ninadam.in

తెలుగు దినపత్రిక

# నినాదం

నిఖార్సైన జర్నలిజం

శుక్రవారం, ఏప్రిల్ 24, 2026 | సంపుటి - 22 | సంచిక 206 | వెల - 7 | పేజీలు - 12 - 8

Published from Hyderabad, Vijayawada Circulated from TS and AP.. Hyderabad, Karimnagar, Khammam, Mahabubnagar, Nalgonda, Nizamabad, Warangal, Vijayawada, Guntur, Ongole, Nellore, Tirupathi, Kadapa, Ananthapur, Kurnool, Tadepalligudem, Rajahmundry, Visakhapatnam, Srikakulam

## హిందూ దేవుళ్లపై వ్యాఖ్యలను సహించం

- చట్టపరమైన చర్యలకోసం పోరాడుతుంటాం
- టీటీడీ బోర్డు సభ్యుడు భాను ప్రకాశ్ రెడ్డి హెచ్చరిక

2



ఇటీవల తప్పుడు వ్యాఖ్యలు చేసిన సినీ నటుడు ప్రకాశ్ రాజ్‌పై రూ.100 కోట్ల పరువు నష్టం దావా వేసినట్లు భాను ప్రకాశ్ రెడ్డి గుర్తు చేశారు. సోషల్ మీడియా ద్వారా హిందూ దేవతలపై విమర్శలు చేస్తున్న వారిపై చట్టపరమైన చర్యలు కొనసాగిస్తూనే ఉంటామని హెచ్చరించారు.

**తిరుపతి, నినాదం:**

హిందూ దేవాలయాలు, సంప్రదాయాలపై అవమానకర వ్యాఖ్యలు చేస్తే ఊరుకునేది లేదని తిరుమల తిరుపతి దేవస్థానం టీటీడీ బోర్డు సభ్యుడు భాను ప్రకాశ్ రెడ్డి హెచ్చరించారు. సోషల్ మీడియా వేదికలపై హిందూ దేవుళ్లపై అవమానకర వ్యాఖ్యలు పెరుగుతున్నాయని ఆయన ఆరోపించారు.

## నేటినుంచి స్కూళ్లకు వేసవి సెలవులు

తిరిగి జూన్ 12న పాఠశాలలు ప్రారంభం

2

ఆర్టీసీ సమ్మెతో గ్రామాలకు వెళ్లలేని పరిస్థితి



# కార్మికులు తొందరపాటు నిర్ణయాలు తీసుకోవద్దు



- ఆర్టీసీ ఉద్యోగులకు సీఎం హితవు
- ఆర్టీసీ సమ్మెపై కేబినెట్ భేటీలో ప్రస్తావన
- నేడు చర్చలు జరపాలని డిప్యూటి సిఎంకు ఆదేశం
- అనాలోచిత చర్యలకు పాల్పడవద్దని శ్రీధర్ బాబు వినతి

ఆర్టీసీ కార్మికులు తొందరపాటు నిర్ణయాలు తీసుకోవద్దని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. ఈమేరకు ఆయన కేబినెట్ భేటీలో మాట్లాడారు. ప్రాణాలు తీసుకోవడం వల్ల సమస్య పరిష్కారం కాదన్నారు. సమస్యలు పరిష్కరించేందుకు తాము చిత్తశుద్ధితో ఉన్నామని.. ఈ అంశంపై ప్రభుత్వం దృష్టి సారించిందని తెలిపారు.

**హైదరాబాద్,ఏప్రిల్ 23(నినాదం):**

శుక్రవారం కార్మిక సంఘాలతో చర్చించాలని మంత్రులకు సీఎం సూచించారు. ఈక్రమంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఆధ్వర్యంలో మంత్రులు.. కార్మిక సంఘాలతో సమావేశం కానున్నారు. నర్సంపేటలో ఓ డ్రైవర్ ఆత్మహత్యాయత్నానికి ఒడిగట్టిన ఘటన నేపథ్యంలో సిఎం ఈ వ్యాఖ్యలు చేసినట్లుగా తెలుస్తోంది. ఇదిలావుంటే ఆర్టీసీ కార్మికులు సంయమనం పాటించి... సమ్మె విరమించాలని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వం తప్ప కుండా చర్చలు జరుపుతుందని గురువారం విడుదల చేసిన ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

▸▸తరువాయి 2లో..



12

నల్లగొండ డిపో ప్రాంగణంలో ఆత్మహత్యాయత్నం చేసిన ఆర్టీసీ డ్రైవర్



## రెండో రోజూ..

- కొనసాగిన ఆర్టీసీ సమ్మె
- ఎక్కడికక్కడే నిలిచిపోయిన బస్సులు
- బలవంతంగా నడడిపేందుకు యత్నాలు
- పలుచోట్ల కార్మికులను అదుపులోకి తీసుకున్న పోలీసులు

6

**హైదరాబాద్, నినాదం:**

తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా రెండో రోజు ఆర్టీసీ కార్మికుల సమ్మె గురువారం కూడా కొనసాగింది. ఆర్టీసీ బస్సులు డిపోలకే పరిమితం కావడంతో ప్రయాణికులు నానా యాతన పడుతున్నారు. తమ న్యాయమైన హక్కుల కోసం ఉద్యమిస్తున్న ఆర్టీసీ కార్మికులపై కాంగ్రెస్ ప్రభుత్వం ఉక్కుపాదం మోపుతున్నది. పోలీసుల పహారాలో బస్సుకు ఒక కానిస్టేబుల్‌ను పెట్టి బలవంతంగా బస్సులను నడుపాలని చూస్తున్నది. అయినప్పటికీ ఆర్టీసీ కార్మికులు తెల్లవారుజాము నుంచే బస్సుల వద్దకు చేరి ఒక్క బస్సును కూడా కదలనీయలేదు. పోలీసులు బలవంతంగా ఆర్టీసీ కార్మికులను అరెస్ట్ చేసినా ఉద్యమాన్ని కొనసాగిస్తున్నారు.

## ఉత్తరప్రదేశ్‌లో ఘోరరోడ్డు ప్రమాదం

- అదుపుతప్పి ముందున్న వాహనాలను ఢీకొన్న ట్రక్కు
- వాహనాలు ఢీకొనడంతో మంటలు చెలరేగి 11మంది సజీవ దహనం

2



## టీపొడినీ వదల్లేదు..

2

నగరంలో పెద్ద ఎత్తు కల్తీ టీపొడి విక్రయం

దాడి చేసి ముఠాను పట్టుకున్న పోలీసులు



## రేషన్ కార్డుల్లో బోగస్ తొలగింపు

2

ఈకెవైసీ తప్పనిసరి చేసిన ప్రభుత్వం

# కాళేశ్వరంపై సిబిఐ విచారణ

- తీర్పు పరిశీలించాక తదుపరిచర్యలు
- మంత్రుల జీతాల్లో 50శాతం రిటైర్డ్ ఉద్యోగుల బకాయిల చెల్లింపు
- వందరోజుల్లోగా బకాయిలు పూర్తిగా చెల్లింపు
- సహకార సంఘాల ఎన్నికలు నిర్వహించాలని నిర్ణయం
- తెలంగాణ కేబినెట్ సమావేశంలో కీలక నిర్ణయాలు
- వివరాలు వెల్లడించిన మంత్రులు పొంగులేటి, ఉత్తమ్, వాకిటి

2

**హైదరాబాద్,ఏప్రిల్ 23(నినాదం):**

కాళేశ్వరం తీర్పు పరిశీలించాక తదుపరిచర్యలు తీసుకోవాలని, న్యాయనిపుణులతో సంప్రదించాలని, సిబిఐ విచారణ కోసం ఒత్తిడి పెంచాలని నిర్ణయం తీసుకున్నారు. మంత్రులు, ఎమ్మెల్యేల జీతాల్లో 50శాతం రిటైర్డ్ ఉద్యోగుల బకాయల చెల్లింపునకు ఉపయోగించాలని నిర్ణయించారు. వందరోజుల్లోగా బకాయిలు పూర్తిగా చెల్లింపు చేయనున్నారు. సహకార సంఘాల ఎన్నికలు నిర్వహించాలని నిర్ణయం తీసుకుంది.




## జిల్లా కాంగ్రెస్‌లో పదవుల మంట

సీనియర్లకు తగిన గుర్తింపు దక్కలేదని నారాజ్

- వసలవాదులకు అందలమెక్కించారంటూ గుస్సా..
- కొత్తగూడెం నియోజకవర్గంలో డీగ్రేడ్ చేశారంటూ గుర్రు
- చెప్పింది ఒకటి.. ఇచ్చింది మరొకటి అంటూ పెదవి విరుపు..
- మినిస్టర్, ఎంపీ ప్రపోజల్స్ సైతం పక్కన పెట్టారా..!?
- పదవులు చేపట్టేందుకు ససేమిరా అంటున్న వైనం
- హస్తం పార్టీకి తలనొప్పిగా మారిన వ్యవహారం




భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కాంగ్రెస్ పార్టీలో తాజా నియామకాలు పెను తుఫాను సృష్టించాయి. తెలంగాణలో అధికారంలో ఉన్న పార్టీకి జిల్లాలో మాత్రం సొంత పార్టీ నేతల నుంచే సెగ తగులుతోంది. ఇటీవల ప్రకటించిన జిల్లా కమిటీలు పార్టీలో ఉత్సాహాన్ని నింపాల్సింది పోయి.. చిచ్చును రాజేశాయి. సీనియర్ల అసంతృప్తి, వలస నేతల ఆధిపత్యం, సమన్వయ లోపం వెరసి "హస్తం" పార్టీలో విభేదాలు భగ్గుమన్నాయి.

**భద్రాద్రి కొత్తగూడెం ప్రతినిధి, ఏప్రిల్22(నినాదం)**

కొత్తగూడెం నియోజకవర్గంలో సీనియర్ నేతలను తక్కువ చేస్తూ (డీగ్రేడ్) పదవులు కేటాయించారంటూ వస్తున్న విమర్శలు ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారాయి. దశాబ్దాలుగా పార్టీ కోసం కష్టపడి, ప్రతిపక్షంలో ఉన్నప్పుడు లాఠీ దెబ్బలు, అనేక కేసులు సైతం ఎదుర్కొన్న సీనియర్ నేతలు ఇప్పుడు తీవ్ర ఆగ్రహంతో ఉన్నట్టు తెలుస్తోంది. పార్టీలోకి నిన్న మొన్న వచ్చిన వలసవాదులకు అందలమెక్కించి, తమకు నామమాత్రపు

▸▸తరువాయి 2లో

## ముగిసిన పోలింగ్

తమిళనాడు, బెంగాల్‌లో ప్రశాంతంగా ఓటింగ్

- భారీగా పోలింగ్ శాతం నమోదు
- తమిళనాట పోటెత్తిన ఓటరు • దాదాపు 83శాతం పోలింగ్ నమోదు • ఓటింగ్ ప్రక్రియ ముగిసాక పెరగవచ్చని అంచనా • సిఎం అభ్యర్థుల నియోజకవర్గాల్లో 80శాతం దాటిన పోలింగ్ • బెంగాల్లోనూ పోటెత్తిన జనం • ఓటేసేందుకు భారీగా తరలివచ్చిన ఓటర్లు • దాదాపు 90శాతం వరకు పోలింగ్ నమోదు
- చెదురు మదురు ఘటనలు మినహా ప్రశాంతం

2



**న్యూఢిల్లీ,ఏప్రిల్ 23(నినాదం):**

దేశంలో కీలక రాష్ట్రాలైన తమిళనాడు, పశ్చిమ బెంగాల్‌లో అసెంబ్లీ ఎన్నికల తొలి దశ పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. పోలింగ్ కేంద్రాల వద్ద సాయంత్రం 6 గంటల వరకు క్యూలో ఉన్న ఓటర్లకు ఓటు వేసే అవకాశం కల్పించారు. ఈ దశలో రికార్డు స్థాయిలో పోలింగ్ నమోదు కావడం విశేషంగా మారింది.

## ఎల్బీనగర్ - హయత్ నగర్ కారిడార్

- డబుల్ డెక్కర్ కారిడార్‌తో ట్రాఫిక్‌కు చెక్
- ప్రాజెక్ట్‌పై అధికారులతో చర్చించిన మంత్రి కోమటిరెడ్డి



2

**హైదరాబాద్, నినాదం:**

ఎల్బీనగర్ నుండి హయత్ నగర్ ఆల్ ఇండియా రేడియో స్టేషన్ వరకు నిర్మించతలపెట్టిన 7.1 కి.మీడబుల్ డెక్కర్ ఎలివేటెడ్ కారిడార్ పురోగతిపై రాష్ట్ర రోడ్లు భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి గురువారం డా.బి.ఆర్ అంబేడ్కర్ రాష్ట్ర సెక్రటేరియట్ లో ఉన్నత స్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు.

## ఇంధన భద్రతపై భారత్ దృష్టి

గ్రీన్ ఎనర్జీ ఉత్పత్తిపై ప్రణాళికలు

2

**న్యూఢిల్లీ, నినాదం:**

ఇంధన భద్రతకు భారత్ పెద్ద పీట వేస్తోంది. సబ్సిడీలు ఇచ్చి దేశీయంగా డిమాండ్‌ను పెంచడంపై దృష్టి పెట్టింది. భవిష్యత్ ఇంధనంగా రూపొందనున్న హరిత హైడ్రోజన్ రంగంపై పట్టు సాధించేందుకు చైనా, భారత్‌లు చాలా వ్యూహాత్మకంగా పావులు కదుపుతున్నాయి.




## మేడ్ ఇన్ తెలంగాణ మరింత విశ్వవ్యాప్తం

- ఆజాద్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ప్రారంభించిన మంత్రి శ్రీధర్ బాబు
- కొత్తగా 230 హై స్కిల్డ్ వర్క్ ఫోర్స్‌కి ఉపాధి

2

టీజీఐఐసీ ఇండస్ట్రియల్ పార్క్ లోని 'ఆజాద్ ' సెంటర్ ఆఫ్ ఎక్స్ లెన్స్,ఇన్నోవేషన్ సెంటర్'లో 7,600 చదరపు మీటర్ల విస్తీర్ణంలో ఏర్పాటు చేసిన 'ది ఎక్స్ క్లూజివ్ లీన్ మాన్యుఫ్యాక్చరింగ్ ఫెసిలిటీ ఫర్ బేకర్ హ్యూస'ను గురువారం మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు లాంఛనంగా ప్రారంభించారు.

## కళావేదిక ప్రత్యేక సావనీర్‌ను ఆవిష్కరించిన మంత్రి

**హైదరాబాద్, నినాదం:**

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ శాసనసభ స్పీకర్ స్వర్గీయ దుద్దిళ్ల శ్రీపాదరావు స్మారకార్థం 'కళావేదిక' సాంస్కృతిక సంస్థ రూపొందించిన ప్రత్యేక సావనీర్ ను ఐటి, పరిశ్రమల మంత్రి శ్రీధర్ బాబు గురువారం నాడు సచివాలయంలో ఆవిష్కరించారు. శ్రీపాద రావు మిత్రుడైన ఆర్.వి. రమణమూర్తి 1960 వ దశకంలో కళావేదికను స్థాపించారు.



## కార్మికులు తొందరపాటు నిర్ణయాలు తీసుకోవద్దు

ఆర్టీసీ కార్మికులు ఎలాంటి తొందర పాటు నిర్ణయాలు తీసుకోవద్దని, ప్రాణాలు తీసుకునే అనాలోచిత చర్యలకు పాల్పడి మీ కుటుంబాలకు అన్యాయం చేయొద్దని విజ్ఞప్తి చేశారు. క్షణికావేశంతో కొత్త సమస్యలు వస్తాయని, ప్రేరేపిత శక్తుల ఒత్తిడికి బలి కావొద్దని కోరారు. కార్మికుల సమస్యల్ని పరిష్కరించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని, వెంటనే చర్చలకు ముందుకు రావాలని కార్మిక సంఘాల నేతలకు పిలుపు నిచ్చారు. కార్మికులు ఆత్మనిబ్బరంతో ఉండాలని... ప్రభుత్వం తో చర్చల ద్వారా తమ సమస్యలను పరిష్కరించుకోవాలని సూచించారు. మరోవైపు.. ఈయూ ఆఫీసులో ఆర్టీసీ జేఏసీ అత్యవసర సమావేశం నిర్వహించింది. ఈ సందర్భంగా జేఏసీ ఛైర్మన్ వెంకన్న, వైస్ ఛైర్మన్ థామస్‌రెడ్డి తదుపరి కార్యాచరణ ప్రకటించారు. ఈ నెల 24న అన్ని డిపోల ముందు ఆర్టీసీ కార్మికుల మౌన ప్రదర్శన, 25న అన్ని డిపోల్లో వంటావార్పు, 26న జిల్లాల్లో ఆర్టీసీ సంఘాల కార్మిక కవాతు, 27న ప్రజాప్రతినిధులకు వినతిపత్రాల అందజేత, అన్ని డిపోల్లో బతుకమ్మలతో మహిళా ఉద్యోగుల నిరసన, 29న డిపోల ముందు ఆర్టీసీ కార్మికుల అర్ధనగ్న ప్రదర్శనలు ఉంటాయన్నారు.

## హిందూ దేవుళ్లపై వ్యాఖ్యలను సహించం

ఈ అంశంలో న్యాయస్థానాలను ఆశ్రయించి భారతీయ న్యాయ సంహితలోని సెక్షన్ 298 ప్రకారం కేసులు వేస్తామని భాను ప్రకాశ్ హెచ్చరించారు. కొంతమంది హిందూ ధర్మంపై విషం చిమ్ముతూ సోషల్ మీడియా ద్వారా డబ్బులు సంపాదిస్తున్నారని ఆగ్రహించారు. దేవాలయాలు సెక్యులర్ సంస్థలు కాదని.. అవి హిందూ ప్రార్థనా స్థలాలని ఆయన తేల్చి చెప్పారు. ఈ మేరకు దేవాలయాల్లో ఉద్యోగాలు, వ్యాపారాలు హిందువులకు మాత్రమే ఉండాలన్నారు. శ్రీశైలంలో అన్యమతస్తులు సగం జనాభా ఉన్నారన్నారు. దీనిపై దేశవ్యాప్తంగా చర్చ అవసరమని.. మేధావులు, రిటైర్డ్ న్యాయమూర్తులతో సమావేశం నిర్వహిస్తామని పేర్కొన్నారు. రాష్ట్రంలో దేవాలయాలపై దాడుల విషయంలో ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. ఎన్డీఏ కూటమి హిందూ సంప్రదాయాల రక్షణకు కట్టుబడి ఉందని భాను ప్రకాశ్ రెడ్డి అభిప్రాయపడ్డారు.

## నేటినుంచి స్కూళ్లకు వేసవి సెలవులు

**హైదరాబాద్, నినాదం:**

తెలంగాణలోని పాఠశాల విద్యార్థులకు వేసవి సెలవుల సందడి మొదలైంది. పెరుగుతున్న ఎండల తీవ్రతను దృష్టిలో ఉంచుకుని విద్యాశాఖ కీలక నిర్ణయం తీసుకుంది. గురువారం 23తో ప్రస్తుత విద్యా సంవత్సరం అధికారికంగా ముగిసింది. శుక్రవారం నుంచి రాష్ట్రవ్యాప్తంగా అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు వేసవి విరామం ప్రారంభం కానుంది. ప్రభుత్వ క్యాలెండర్ ప్రకారం, ఏప్రిల్ 24 నుంచి జూన్ 11 వరకు సెలవులు కొనసాగుతాయి. దాదాపు 50 రోజుల సుదీర్ఘ విరామం తర్వాత, జూన్ 12న పాఠశాలలు తిరిగి ప్రారంభమవుతాయి. సాధారణంగా ఏప్రిల్ నెలాఖరు వరకు తరగతులు నిర్వహించేవారు, కానీ ఈసారి ఎండలు తీవ్రమవుతుండటంతో విద్యార్థుల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని ముందస్తుగానే సెలవులు ప్రకటించారు. విద్యా సంవత్సరం చివరి రోజైన గురువారంతో తరగతులు ముగియనుండటంతో, స్కూల్ ఎడ్యుకేషన్ డైరెక్టరేట్ ఒక ముఖ్యమైన ఆదేశాన్ని జారీ చేసింది. అన్ని ప్రభుత్వ స్కూళ్లు, మోడల్ స్కూళ్లు , కేజీబీవీలలో 'తల్లిదండ్రుల ఉపాధ్యాయుల సమావేశం' నిర్వహించాలని సూచించారు. ఈ సమావేశాల్లో విద్యార్థుల ప్రగతి నివేదికలను అందజేయడమే కాకుండా.. వేసవి కాలాన్ని ఎలా సద్వినియోగం చేసుకోవాలో చర్చించారు. వరుస పరీక్షల ఒత్తిడి తర్వాత విద్యార్థులకు ఈ 50 రోజుల సెలవులు గొప్ప ఉపశమనాన్ని ఇస్తాయి. అయితే ఎండలు ఎక్కువగా ఉన్నందున, పిల్లలు బయట తిరగకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని డాక్టర్లు సూచిస్తున్నారు. మొత్తానికి సందడి, కేరింతల మధ్య పిల్లల వేసవి విడిది రేపటి నుంచే ప్రారంభం కాబోతోంది. అయితే ఆర్టీసీ సమ్మెతో గ్రామాలకు వెళ్లాలనుకున్న వారికి తీవ్రనిరాశ ఎదురయ్యింది. సమ్మెతో ఊళ్లకి వెళ్లలేని పరిస్థితి ఏర్పడింది. సమ్మె ముగిస్తేనే ఎక్కడికైనా వెళ్లడానికి అవకాశం ఉంటుంది.

## ఉత్తరప్రదేశ్‌లో ఘోరరోడ్డు ప్రమాదం

**లక్నో, నినాదం:** ఉత్తర్‌ప్రదేశ్ లో ఘోర ప్రమాదం జరిగింది. ఒక ట్రక్కు అదుపుతప్పి పలు వాహనాలను ఢీకొట్టడంతో 11 మంది సజీవ దహనమయ్యారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు లసోడా ప్రాంతం వైపు వెళుతున్న ఓ ట్రక్కు బ్రేకులు ఫెయిల్ అవ్వడంతో అది అదుపుతప్పి ముందువెళుతున్న కారును, కంటైనర్‌ను ఢీకొట్టింది. ఈ క్రమంలో కంటైనర్ దానిముందు ప్రయాణికులతో వెళుతున్న ఓ బొలేరును ఢీకొట్టడంతో మంటలు చెలరేగాయి. దీంతో బొలేరోలోని 11 మంది ప్రయాణికులు మంటల్లో చిక్కుకొని సజీవదహనం అయ్యారు. ఈ ప్రమాదానికి కారణమైన ట్రక్కు డ్రైవర్ కూడా తీవ్రంగా గాయపడ్డారు. సమాచారం అందుకున్న వెంటనే పోలీసులు, అగ్నిమాపక దళాలు ఘటనా స్థలానికి చేరుకున్నారు. మంటలను అదుపులోకి తీసుకొచ్చి.. డ్రైవర్‌ను ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం ఆయన పరిస్థితి విషమంగా ఉందని పోలీసులు తెలిపారు. మృతుల వివరాలు తెలుసుకునేందుకు ప్రయత్నాలు మొదలయ్యాయని, ఈ ఘటనపై పూర్తిస్థాయి దర్యాప్తును కూడా ప్రారంభించినట్లు తెలిపారు. ప్రమాదం నేపథ్యంలో ఈ ప్రాంతంలో వాహనాల రాకపోకలకు ఆటంకం కలగకుండా పోలీసులు చర్యలు చేపట్టారు.




## మేడ్ ఇన్ తెలంగాణ మరింత విశ్వవ్యాప్తం

**గజ్వేల్, నినాదం:** సిద్దిపేట జిల్లా ములుగు మండలం తునికి బొల్లారం టీజీఐఐసీ ఇండస్ట్రియల్ పార్క్ లోని 'ఆజాద్ ' సెంటర్ ఆఫ్ ఎక్స్ లెన్స్,ఇన్నోవేషన్ సెంటర'లో 7,600 చదరపు మీటర్ల విస్తీర్ణంలో ఏర్పాటు చేసిన 'ది ఎక్స్ క్లూజివ్ లీన్ మాన్యుఫ్యాక్చరింగ్ ఫెసిలిటీ ఫర్ బేకర్ హ్యూస'ను గురువారం రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు లాంఛనంగా ప్రారంభించారు. అమెరికాకు చెందిన గ్లోబల్ ఎనర్జీ టెక్నాలజీ కంపెనీ 'బేకర్ హ్యూస'...ఆయిల్ ఫీల్డ్ సర్వీసెస్/ ఎక్విప్‌మెంట్(వోఎఫ్ సీఈ), ఇండస్ట్రియల్ / ఎనర్జీ టెక్నాలజీ(ఐఈటీ), టెక్నాలజీ / డిజిటల్ సొల్యూషన్స్ తదితర రంగాల్లో ప్రపంచవ్యాప్తంగా 120 దేశాల్లో కార్యకలాపాలను నిర్వహిస్తోంది. తాజాగా ప్రారంభమైన ఈ యూనిట్ లో బేకర్ హ్యూస్.... ఇండస్ట్రియల్ / ఎనర్జీ టెక్నాలజీ విభాగానికి అవసరమైన హై ప్రెసిషన్ ఉత్పత్తులు తయారవుతాయి. కొత్తగా 230 హై స్కిల్డ్ వర్క్ ఫోర్స్ కి ఉపాధి లభిస్తుంది. తయారీ రంగంలో 'మేడ్ ఇన్ తెలంగాణ' మరింత విశ్వవ్యాప్తం అవుతుంది.

## కళావేదిక ప్రత్యేక సావనీర్ ను ఆవిష్కరించిన మంత్రి శ్రీధర్ బాబు

అప్పటి నుంచి నిరంతరాయంగా సాంస్కృతిక కార్యక్రమాలు చేపడుతున్న 'కళావేదిక' తో శ్రీపాద రావుకు ఎంతో అనుబంధం ఉండేది. ఆయన 20 ఏళ్ల పాటు ఈ సంస్థకు అధ్యక్షులుగా కూడా పని చేసారు. సంస్థ 60 వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని కళావేదిక మాసపత్రిక ఎడిటర్ భువన రాయవరపు, సభ్యులు కొమ్మరాజు రవికుమార్, పుట్టంరాజు సీతారామ్ లు ప్రత్యేక సావనీర్ తొలి కాపీని శ్రీధర్ బాబుకు అందజేసారు.కళావేదిక ప్రత్యేక సంచికను ఆవిష్కరించిన దుద్దిళ్ల శ్రీధర్ బాబు. ఈ కార్యక్రమం లో మంత్రి తో పాటు రామగుండం ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్, కొమ్మరాజు రవికుమార్, భువన రాయవరపు, పుట్టంరాజు సీతారామయ్య లు పాల్గొన్నారు.



# కాళేశ్వరంపై సిబిఐ విచారణ

తెలంగాణ కేబినెట్ సమావేశంలో కీలక నిర్ణయాల వివరాలు మంత్రులు పొంగులేటి, ఉత్తమ్, వాకిటి శ్రీహరిలు వెల్లడించారు. ఆర్టీసీ కార్మికుల సమ్మెపై తెలంగాణ మంత్రివర్గ సమావేశంలో కీలకంగా చర్చ జరిగింది. సమస్య పరిష్కారం దిశగా ప్రభుత్వం చర్యలు వేగవంతం చేస్తోంది. సీఎం రేవంత్‌రెడ్డి ఆర్టీసీ కార్మికులకు విజ్ఞప్తి చేస్తూ, తొందరపాటు నిర్ణయాలు తీసుకోవద్దని సూచించారు. ప్రాణాలు తీసుకోవడం సమస్యకు పరిష్కారం కాదని స్పష్టం చేసిన ఆయన.. కార్మికుల సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉందని తెలిపారు. ఈ నేపథ్యంలో నేడు కార్మిక సంఘాలను చర్చలకు ఆహ్వానించాలని ప్రభుత్వం నిర్ణయించింది. మంత్రుల కమిటీతో చర్చలకు రావాలని కార్మిక సంఘాలకు పిలుపు నిచ్చింది. ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఆధ్వర్యంలో మంత్రుల బృందం కార్మిక సంఘాలతో భేటీ కానుంది. ఈ క్రమంలోనే తెలంగాణ కేబినెట్ సమావేశంలో పలు కీలక నిర్ణయాలు తీసుకున్నట్లు మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి వివరాలు వెల్లడించారు. మీడియా సమావేశంలో ఉత్తమ్ కుమార్ రెడ్డి, వాకిటి శ్రీహరి కూడా పాల్గొన్నారు. ఇకపోతే మంత్రులు, ఎమ్మెల్యేల వేతనాల్లో 50 శాతం రిటైర్డ్ ఉద్యోగులకు చెల్లించాలని కేబినెట్ నిర్ణయించినట్లు ఆయన తెలిపారు. అలాగే, సహకార సంఘాల ఎన్నికలు నిర్వహించాలని కూడా నిర్ణయించినట్లు చెప్పారు. ఆర్టీసీ సమ్మెపై కేబినెట్‌లో సుదీర్ఘంగా చర్చ జరిగినట్లు మంత్రి పొంగులేటి తెలిపారు. సమస్య పరిష్కారానికి ఐదుగురు మంత్రులతో కార్మిక సంఘాలతో చర్చలు జరపనున్నట్లు వెల్లడించారు. కార్మికులు క్షణికావేశానికి లోనుకావొద్దని ఆయన విజ్ఞప్తి చేశారు. కార్మికుల సమస్యల పట్ల ప్రభుత్వం సానుకూలంగా ఉందని, చర్చల ద్వారా పరిష్కారం సాధించేందుకు కృషి చేస్తామని మంత్రి పొంగులేటి స్పష్టం చేశారు. అలాగే, రెవెన్యూ రిసోర్సెస్ కమిటీని ఏర్పాటు చేసినట్లు కూడా కేబినెట్ నిర్ణయించినట్లు ఆయన తెలిపారు. మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ, కార్మికులు తొందరపడొద్దని, డిమాండ్ల పరిష్కారానికి ప్రభుత్వం సానుకూలంగా ఉందని చెప్పారు. కార్మికులు ప్రాణాలు తీసుకోవద్దని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ క్రమంలోనే, కార్మికులు సంయమనం పాటించాలని మంత్రి శ్రీధర్‌బాబు సూచించారు. ప్రాణాలు తీసుకోవడం సరైంది కాదని, ఆర్టీసీ కార్మికుల పాత్ర రాష్ట్ర సాధనలో కీలకమని పేర్కొన్నారు. ప్రభుత్వంపై నమ్మకం ఉంచాలని ఆయన కోరారు. అలాగే, కేబినెట్ సమావేశంలో కాళేశ్వరం ప్రాజెక్టు అంశంపైనా కూడా చర్చ జరిగింది. ఈ కేసులో సిబిఐ విచారణకు ఒత్తిడి తేవాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు సమాచారం. ఇకపోతే గతంలో పదేండ్లు అధికారంలో ఉన్న ప్రభుత్వం ఉద్యోగులకు సంబంధించి వేల కోట్ల బిల్లులు పెండింగ్ లో పెట్టింది. తెలంగాణ ఏర్పడే నాటికి ఒక్క రూపాయి కూడా బకాయి లేదు. రిటైర్మెంట్ ఏజ్ పెంచటంతో పాటు రిటైరైన ఉద్యోగులకు ఇవ్వాల్సిన బెనిఫిట్స్ ఇవ్వకపోవటంతో రిటైర్డ్ ఉద్యోగులు, పెన్షనర్లు, వారి కుటుంబాలు ఇబ్బంది పడుతున్నాయి. రాష్ట్ర మంత్రివర్గం ఈ సమస్యపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. రిటైర్డ్ ఉద్యోగులు ఆఫీసుల చుట్టూ, సచివాలయం చుట్టూ తిరిగే పరిస్థితి రాకుండా వెంటనే వారికి ఇచ్చే బకాయిల చెల్లింపులకు తగిన చర్యలు చేపట్టాలని నిర్ణయం తీసుకుంది. రెగ్యులర్ ఉద్యోగులకు సంబంధించి రూ.6,200 కోట్లు, రిటైర్డ్ ఉద్యోగులకు ఇవ్వాల్సినవి రూ.8 వేల కోట్లు పెండింగ్ లో ఉన్నాయి. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి దృష్ట్యా వీటిని వెంటనే ఇవ్వలేని పరిస్థితి ఉన్నప్పటికీ వెంటనే ప్రత్యామ్నాయ మార్గాలన్నీ అన్వేషించి, అవసరమైన నిధులు సర్దుబాటు చేయాలని మంత్రివర్గం నిర్ణయం తీసుకుంది. అవసరమైతే తమ జీతాలు, ప్రజా ప్రతినిధులకు ఇచ్చే జీతాల నుంచి 50 శాతం రిటైర్డ్ ఉద్యోగులకు వెంటనే సర్దుబాటు చేయాలని మంత్రులందరూ ఉదారంగా ముందుకువచ్చారు. రిసోర్స్ మొబిలైజేషన్ సబ్ కమిటీ వెంటనే ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలు, రిటైర్డ్ ఉద్యోగుల సంఘాలు, బాధ్యులైన వారందరినీ పిలిచి చర్చలు జరపాలని, వీలైనంత తొందరగా ఈ సమస్యను పరిష్కరించాలని మంత్రివర్గం నిర్ణయం తీసుకుంది. వంద రోజుల్లోగా రిటైర్డ్ ఉద్యోగుల బకాయిల చెల్లింపు దిశగా తగిన ఏర్పాట్లు చేయాలని నిర్ణయించింది. పీఏసీఎస్ ఛైర్మన్లను రాబోయే రోజుల్లో నామినేటెడ్ పద్ధతిలో భర్తీ చేస్తాం. గచ్చిబౌలి స్టేడియాన్ని అభివృద్ధి చేసేందుకు టాటా సంస్థ అంగీకరించింది. ఈ స్టేడియంలోని 76 ఎకరాలను రూ.700 కోట్లతో అభివృద్ధి చేయనుందని తెలిపారు.




## రేషన్ కార్డుల్లో బోగస్ తొలగింపు

హైదరాబాద్ :ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందాలనే లక్ష్యంతో ప్రభుత్వం అనేక సంస్కరణలు చేపడుతోంది. ఇందులో భాగంగా, రేషన్ కార్డు వినియోగదారులందరికీ 'ఈ కేవైసీ' ప్రక్రియను ప్రభుత్వం తప్పనిసరి చేసింది. గతంలో రేషన్ కార్డుల దుర్వినియోగాన్ని అరికట్టడానికి, అనర్హులను తొలగించడానికి ఈ నిర్ణయం తీసుకున్నారు. చాలా మంది లబ్దిదారులు తమ కార్డులలో వివరాలను అప్‌డేట్ చేయకపోవడం వల్ల రేషన్ నిలిచిపోయే ప్రమాదం ఉంది. ఇప్పటికే లక్షలాది కార్డులు నిబంధనలు పాటించని కారణంగా రద్దు చేశారు. కాబట్టి, ప్రభుత్వం అందించే ఉచిత లేదా రాయితీ బియ్యం, ఇతర సరుకులను నిరంతరాయంగా పొందాలంటే.. ప్రతి కార్డుదారుడు తమ ఆధార్ వివరాలను రేషన్ కార్డుతో అనుసంధానించి.. వేలిముద్రల ద్వారా ధృవీకరణ పూర్తి చేసుకోవడం అత్యవసరం. రేషన్ కార్డులో పేరున్న ప్రతి వ్యక్తి బ్రతికే ఉన్నారా లేదా? ఒకే వ్యక్తికి రెండు చోట్ల కార్డులు ఉన్నాయా? అనే విషయాలను నిర్ధారించుకోవడానికి ఈ ప్రక్రియ ఉపయోగపడుతుంది. ఇది పారదర్శకతను పెంచుతుంది. కార్డుదారులు తమ సమీ పంలోని రేషన్ దుకాణానికి వెళ్లి, అక్కడి డీలర్ వద్ద ఉన్న ఈ పోస్ యంత్రం ద్వారా తమ వేలిముద్రలను వేయాలి. దీనినే బయోమెట్రిక్ అథెంటికేషన్ అంటారు. ప్రభుత్వం నిర్ణయించిన గడువులోగా ఈ ప్రక్రియ పూర్తి చేయని వారి పేర్లను కార్డు నుంచి తొలగించే అవకాశం ఉంది. కొన్ని సందర్భాల్లో మొత్తం కార్డునే రద్దు చేసే అధికారం అధికారులకు ఉంటుంది. ఇప్పటికే క్షేత్రస్థాయి పరిశీలనలో ఈ కేవైసీ అప్‌డేట్ చేయని కారణంతో దేశవ్యాప్తంగా పెద్ద సంఖ్యలో బోగస్ కార్డులను అధికారులు గుర్తించి తొలగించారు. మీరు ప్రస్తుతం మీ ఊరిలో లేకపోయినా, 'వన్ నేషన్ ? వన్ రేషన్ కార్డ్' పథకం ద్వారా మీరు ఉన్న చోటే దగ్గరలోని రేషన్ షాపులో కేవైసీ పూర్తి చేసుకునే వెసులుబాటు ఉంది. ఇప్పటికీ చాలా మంది రేషన్ కార్డుదారులు తమ ఈ కేవైసీ ప్రక్రియను పూర్తి చేయలేదని.. వారు త్వరగా పూర్తి చేయాలని ప్రభుత్వం కోరుతోంది. దీంతో పాటు.. వరుసగా మూడు నెలల కంటే ఎక్కువ నెలలు ఆ రేషన్ కార్డు ద్వారా ఎలాంటి రేషన్ తీసుకోకపోతే.. ఆ కార్డులు కూడా రద్దయ్యే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. ఇలా రద్దైన కార్డులు కూడా దేశ వ్యాప్తంగా చాలా ఉన్నాయి.

## టీపొడినీ వదల్లేదు..

**హైదరాబాద్, నినాదం:**

హైదరాబాద్ నగరంలో టీ ప్రియుల ఆరోగ్యాన్ని పణంగా పెట్టి కాసులు కురిపించుకుంటున్న ఒక ముఠాను పోలీసులు ఆట కట్టించారు. నకిలీ టీ అమ్మతతున్న ముటాను పట్టుకున్నారు. రహస్య సమాచారం మేరకు జరిపిన మెరుపు దాడుల్లో సుమారు 4 టన్నుల కల్తీ టీ పౌడర్, దానికి సంబంధించిన రసాయనాలను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. సాధారణంగా హోటళ్లు, టీ స్టాళ్లలో వాడి పారేసిన టీ పొడిని సేకరించి, దానికి హానికరమైన రంగులు, కృత్రిమ వాసనలు కలిపి తిరిగి ప్యాక్ చేస్తున్నట్లు విచారణలో తేలింది. ఈ కల్తీ పొడిని చూడగానే అసలైన టీ పొడిలాగే కనిపించేలా రసాయనాలు వాడుతున్నారని పోలీసులు తెలిపారు. ఈ దందాపై గత కొన్ని రోజులుగా నిఘా పెట్టిన పోలీసులు, అత్యంత గోప్యంగా ఆపరేషన్ నిర్వహించి కల్తీ కేంద్రాలపై దాడి చేశారు. ఈ కేసులో మొత్తం 10 మంది నిందితులను అదుపులోకి తీసుకున్నారు. వీరిలో కల్తీ టీ పొడిని తయారు చేసేవారితో పాటు, తక్కువ ధరకు వస్తుందని తెలిసి కూడా దీన్ని కొనుగోలు చేస్తున్న కొంతమంది టీ షాప్ ఓనర్లు కూడా ఉన్నట్లు సమాచారం. ఈ కల్తీ టీ పొడిలో కలిపే రంగులు క్యాన్సర్ వంటి ప్రాణాంతక వ్యాధులకు దారితీస్తాయని ఆహార భద్రతా నిపుణులు హెచ్చరిస్తున్నారు.

## జిల్లా కాంగ్రెస్‌లో "పదవుల" మంట

పదవులు ఇవ్వడంపై వారు "గుస్సా" అవుతున్నారు. "పార్టీని కాపాడింది మేము.. ఫలాలు అనుభవిస్తుంది వాళ్లా?" అంటూ సీనియర్ క్యాడర్ బహిరంగంగానే ప్రశ్నిస్తోంది.

**కొత్తగూడెంలో డీగ్రేడ్ పాలిటిక్స్!**

నియోజకవర్గాల వారీగా చూస్తే, కొత్తగూడెం కాంగ్రెస్ నాయకులు తీవ్ర అవమానానికి గురయ్యామని భావిస్తున్నారు. జిల్లా స్థాయిలో కీలక పాత్ర పోషించాల్సిన నేతలకు, స్థాయికి తగ్గ పదవులు ఇవ్వకుండా డీగ్రేడ్ చేశారని వారు మండిపడుతున్నారు. చెప్పింది ఒకటి.. ఇచ్చింది మరొకటి లాగా కమిటీల కసరత్తు సమయంలో ఒక రకమైన హామీలు ఇచ్చి, లిస్ట్ బయటకు వచ్చేసరికి పేర్లు మార్చడం లేదా ప్రాధాన్యత తగ్గించడంపై పెదవి విరుపులు వ్యక్తమవుతున్నాయి. దశాబ్దాలుగా పార్టీ జెండా మోసిన సీనియర్ నేతలు ఇప్పుడు తీవ్ర నైరాశ్యంలో ఉన్నట్లు తెలుస్తోంది. గౌరవప్రదమైన స్థానం దక్కలేదని భావిస్తున్న కొందరు నేతలు, తమకు కేటాయించిన పదవులను చేపట్టేందుకు ససేమిరా అంటున్నట్లు వినికిడి. ఇది టీపీసీసీకి, జిల్లా నాయకత్వానికి పెద్ద తలనొప్పిగా మారిందన్న వాదనలు వినిపిస్తున్నాయి. అసంతృప్త నేతలు గనుక తమ దారి తాము చూసుకుంటే, రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ భారీ మూల్యం చెల్లించుకోక తప్పదన్న వార్తలు సైతం వస్తున్నాయి.

**మంత్రి, ఎంపీ ప్రపోజల్స్ కూడా బేకాతర్!**

ఈ వివాదంలో అత్యంత ఆశ్చర్యకరమైన విషయం ఏమిటంటే.. జిల్లాకు చెందిన మంత్రి (మినిస్టర్), ఎంపీ పంపిన ప్రతిపాదనలను సైతం పార్టీ బాస్ పక్కన పెట్టి నియోజకవర్గంలో కొంత ప్రజాదరణ కలిగిన వారిని డీగ్రేడ్ చేసి, ఇష్టానుసారంగా వ్యవహరించారన్న విమర్శలు సైతం వినిపిస్తున్నాయి. జిల్లాలోని కీలక నేతలు ఇచ్చిన జాబితాను కాదని, ఎవరో వెనకుండి నడిపించిన రాజకీయమే ఈ కమిటీల ఎంపికలో ప్రతిఫలించిందని టాక్ వినిపిస్తోంది. జిల్లా కాంగ్రెస్‌లో కనిపిస్తున్న ఈ వైఖరి గ్రూపు రాజకీయాల పరాకాష్టగా నిలుస్తోందని, వలస నేతల ఆధిపత్యం పెరగడం వల్ల పాత తరం నేతలు ఒంటరి అవుతున్న భావనలో ఉన్నారన్న వాదనలు వినిపిస్తున్నాయి. మంత్రి, ఎంపీ వంటి పెద్దల సిఫార్సులనే పక్కన పెట్టారంటే, పార్టీలో అంతర్గతంగా ఏం జరుగుతుందో అర్థం కాని పరిస్థితి నెలకొందని కొందరు సీనియర్లు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. "ఇల్లు చక్కబెట్టుకోకుండా పోరుగు గెలవలేం" అన్నట్లుగా, జిల్లా నేతల అసంతృప్తిని పోగొట్టాలంటే టీపీసీసీ వెంటనే సీనియర్లకు తగిన ప్రాధాన్యత కల్పించాలని, లేనిపక్షంలో ఈ 'పదవుల మంట' పార్టీ పునాదులనే కదిలించే ప్రమాదం ఉందన్న వాదనలు ప్రస్తుతం జిల్లా వ్యాప్తంగా హాట్ టాపిక్‌గా మారాయి.

## ఎల్బీనగర్ నుండి హయత్ నగర్ కారిడార్

సుదీర్ఘంగా సుమారు 4గంటల పాటు జరిగిన ఈ సమీక్ష సమావేశంలో ముఖ్యమంత్రి ప్రిన్సిపల్ సెక్రటరీ శ్రీనివాస రాజు,ఆర్ అండ్ బి స్పెషల్ సిఎస్ వికాస్ రాజ్, రీజినల్ ఆఫీసర్ కృష్ణ ప్రసాద్,చీఫ్ ప్రాజెక్ట్ మేనేజర్ ఆనంద మోహన్,ఆర్ అండ్ బి సి.ఈ ధర్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం నిత్యం యాక్సిడెంట్స్ జరిగే ఈ ప్రాంతంలో డబుల్ డెక్కర్ ఎలివేటెడ్ కారిడార్ నిర్మించాలని సంకల్పించిందని మంత్రి అన్నారు. సుమారు 941 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టే ఈ ప్రాజెక్ట్ లో రాష్ట్ర వాటాగా 200కోట్లు ఇచ్చేందుకు ఇప్పటికే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సుముఖత వ్యక్తం చేశారని తెలిపారు. నాగపూర్ తర్వాత ఇండియాలో చేపట్టే రెండో పెద్ద ప్రాజెక్ట్ అన్నారు. ఈ ప్రాజెక్ట్ పూర్తయితే ఎల్బీనగర్,హయత్ నగర్ ప్రాంతాల్లోని 54 కాలనీల్లో నివసించే సుమారు 20లక్షల మంది ప్రజలకు పెద్ద ఉపశమనం లభిస్తుందని,హైదరాబాద్ ` విజయవాడ దారిలో రాకపోకలు సాగించే లక్షల మంది 15నిమిషాల్లోపే సిటీ క్రాస్ చేస్తారని అన్నారు. ఎన్‌హెచ్ 65 రూట్ లో ఎల్బీనగర్ నుండి హయత్ నగర్ వరకు విపరీతమైన రద్దీ ఏర్పడి,రోడ్ క్రాస్ చేసేటప్పుడు నిత్యం యాక్సిడెంట్స్ జరుగుతున్నాయని మంత్రి ఆందోళన వ్యక్తం చేశారు. ఈ డబుల్ డెక్కర్ ఎలివేటెడ్ కారిడార్ పూర్తయితే సమీప కాలనీల్లో నివసించే ప్రజలు కింద సర్వీస్ రోడ్డు ద్వారా సులువుగా రోడ్డు దాటవచ్చు అని,ట్రాఫిక్ ఇబ్బందులు కూడా తొలగిపోతాయని చెప్పారు. వీలైనంత త్వరగా సాంక్షన్స్ చేసుకొని,టెండర్ ప్రక్రియ పూర్తి చేసేలా కృషి చేయాలని అధికారులకు సూచించారు.

## ఇంధన భద్రతపై భారత్ దృష్టి

పెద్ద ఎత్తున గ్రీన్ హైడ్రోజన్ అంటే పునర్వినియోగ ఇంధనాన్ని ఉపయోగించడం ద్వారా నీటి ఎలక్ట్రాలసిస్ ద్వారా ఉత్పత్తయ్యే హైడ్రోజన్ ఉత్పత్తి సామర్థ్యాన్ని నిర్మించుకునేందుకు ఇరు దేశాలు పెద్ద మొత్తంలో నిధులను ఖర్చు చేస్తున్నాయి. అయితే పారిశ్రామిక ఆధిపత్యాన్ని నిలుపుకోవడంపై చైనా దృష్టి కేంద్రీకరించగా, పశ్చిమ దేశాల్లో ఈ రంగంలో కొంత స్తబ్ధత నెలకొన్న నేపథ్యంలో ఇరు దేశాలు ఈ రంగంలో తమ మార్కెట్‌ను పెంచుకోవడానికి చూస్తున్నాయి. ఇందుకు అవసరమైన రాజకీయ సంకల్పం, ఆర్థిక తోడ్పాటు సమకూర్చుకుంటున్నాయి. వాతావరణ కాలుష్యానికి ఇతోధికంగా దోహదపడుతున్న బొగ్గుకు దూరంగా వెళ్లాలని చైనా ప్రయత్నిస్తోంది. ఇందుకోసం 200కోట్ల డాలర్ల ప్రాజెక్టులో భాగమైంది. భారత్ దాదాపుగా 210కోట్ల డాలర్ల విలువ చేసే సబ్సిడీల తోడ్పాటుతో 2030కల్లా ఏటా 50లక్షల మెట్రిక్ టన్నుల హరిత హైడ్రోజన్‌ను ఉత్పత్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఇది ప్రస్తుత గ్లోబల్ మార్కెట్‌కు ఐదు రెట్లు ఎక్కువగా వుంది. అప్పటికి చైనా ఉత్పత్తికి దాదాపుగా రెట్టింపని అంచనా వేస్తున్నారు. హించిన దానికన్నా మరింత అధికంగా వ్యయ పరిమితులు నెలకొంటూ వుండడంతో ఈ దశాబ్దం ప్రారంభంలో పెట్టుకున్న గ్రీన్ హైడ్రోజన్ లక్ష్యాలకు దూరంగా పశ్చిమ దేశాలు వెనక్కి మళ్ళుతున్నాయి. అదే సమయంలో ప్రపంచంలోనే అత్యధిక జనాభా కలిగిన చైనా, భారత్‌లు పెద్ద ఎత్తున ఉత్పత్తికి నడుం బిగించాయి. ఈ రంగంలో రెండు దేశాల లక్ష్యాలు వేర్వేరైనా ఇరు దేశాలకు ఉమ్మడిగా వున్నది రాజకీయ సంకల్పం, అధికారం. పెద్ద ఎత్తున తయారుచేయడం ద్వారా వ్యయం తగ్గేలా, డిమాండ్ పెరిగేలా మార్కెట్‌ను ఉనికిలోకి తీసుకురావడంపై దృష్టి పెట్టాయి. రిఫైనరీలు, ఎరువుల ప్లాంట్లు, ఉక్కు తయారీ సంస్థల నుండి హావి లకు సబ్సిడీలను ముడిపెడుతూ ప్రైవేటు పెట్టుబడులను భారత్ రాబడుతోంది. ఇక్కడ ఇంధన భద్రత వుండాలనే భారత్ లక్ష్యం చాలా స్పష్టంగా వుంది. దిగుమతి చేసుకున్న ఖనిజవాయువు నుండి తయారుచేస్తారు. అయితే పశ్చిమాసియాలో తాజా పరిణామాలతో నేచురల్ గ్యాస్ సరఫరా ఇబ్బందుల్లో పడింది. మరోవైపు చైనా ప్రభుత్వ రంగంలోని దిగ్గజాలను లేదా ప్రైవేటు సంస్థలను రంగంలోకి దింపడం ద్వారా పెద్ద ఎత్తున పారిశ్రామిక ప్రాజెక్టులకు సిద్ధమవుతోంది. పరిశుద్ధమైన ఇంధనం దిశగా మళ్ళాలని యావత్ పారిశ్రామిక రంగం అడుగులు వేసే తరుణంలో హైడ్రోజన్ ఉత్పత్తిలో ఆధిపత్యాన్ని పరిరక్షించుకోవాలని చైనా లక్ష్యంగా పెట్టుకుంది.

# ముగిసిన పోలింగ్



రెండు రాష్ట్రాల్లోనూ రికార్డు స్థాయిలో పోలింగ్ నమోదైంది. ఈ సాయంత్రం 5గంటల వరకు తమిళనాడులో 82.24శాతం పోలింగ్ నమోదు కాగా, పశ్చిమ బెంగాల్ తొలి విడత ఎన్నికల్లో 89.93శాతం నమోదైనట్లు ఎన్నికల సంఘం వెల్లడించింది. చెన్నైలో 81.34శాతం పోలింగ్ నమోదైనట్లు అధికారులు తెలిపారు. అలాగే, బెంగాల్‌లోని దక్షిణ్ దినాజ్‌పూర్‌లో అత్యధికంగా 93.12శాతం పోలింగ్ నమోదైనట్లు వెల్లడించారు. సాయంత్రం 6గంటలతో పోలింగ్ సమయం ముగియగా.. ఇప్పటికే క్యూలైన్లలో ఉన్న వారికి ఓటు వేసేందుకు అనుమతించారు. ప్రజలు భారీ సంఖ్యలో పోలింగ్ కేంద్రాలకు తరలివచ్చి తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. తాజా సమాచారం ప్రకారం, తమిళనాడులో సాయంత్రం 5 గంటల వరకు 82.24 శాతం పోలింగ్ నమోదైంది. అదే సమయంలో పశ్చిమ బెంగాల్‌లో 89.93 శాతం పోలింగ్ నమోదు కావడం గమనార్హం. మొత్తం 294 స్థానాలు ఉండగా తొలి విడతలో 152 సీట్లకు ఎన్నికలు జరిగాయి. తమిళనాడులోని మొత్తం 234 అసెంబ్లీ స్థానాలకు ఒకే దశలో పోలింగ్ జరిగింది. ఎన్నికల అధికారులు పోలింగ్ ప్రక్రియను సజావుగా నిర్వహించారు. రెండు రాష్ట్రాల్లోని ఓట్ల లెక్కింపు, ఫలితాల ప్రకటన మే 4 సోమవారం వెల్లడిస్తారు.

**తమిళనాట దాదాపు 83శాతం పోలింగ్**

తమిళనాడు ఓటర్లు చరిత్రలో సరికొత్త రికార్డు సృష్టించారు.. తమిళనాడులో పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. సాయంత్రం ఐదు గంటల వరకు 82.24 శాతం పోలింగ్ నమోదైనట్లు ఎన్నికల సంఘం ప్రకటించింది. సాయంత్రం 6 గంటలకు పోలింగ్ ముగియగా.. క్యూలైన్లలో నిల్చున్న వారికి మాత్రమే ఓటు వేయడానికి అనుమతి ఉంటుందని ఈసీ స్పష్టం చేసింది. రాష్ట్ర చరిత్రలోనే ఇదే అత్యధిక పోలింగ్ శాతంగా నిలిచింది. తమిళనాడులో మొత్తం 4,71,60,321 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. గతంలో రాష్ట్ర చరిత్రలో అత్యధిక పోలింగ్ 2011 ఎన్నికల్లో 78 శాతంగా నమోదైంది. 2021 ఎన్నికల్లో 73.63 శాతం పోలింగ్ మాత్రమే నమోదైంది. అయితే, ఈసారి ఆ రికార్డులన్నింటినీ అధిగమిస్తూ ఓటర్లు భారీగా పోలింగ్ కేంద్రాలకు తరలివచ్చారు. ముఖ్యమంత్రి ఎం.కే. స్టాలిన్ పోటీ చేస్తున్న కొలత్తూరు నియోజకవర్గంలో 83.58 శాతం పోలింగ్ నమోదైంది. మాజీ సీఎం పళనిస్వామి పోటీ చేస్తున్న ఎడప్పాడి నియోజకవర్గంలో 89.09 శాతం పోలింగ్ నమోదవడం విశేషం. నటుడు విజయ్ పోటీ చేస్తున్న పెరంబూర్‌లో 86.72 శాతం పోలింగ్ నమోదైంది. తిరుచిరాపల్లి ఈస్ట్‌లో 79.32 శాతం పోలింగ్ నమోదైంది. ఎండలను సైత లెక్కచేయకుండా ఓటర్లు ఓటేసేందుకు క్యూ కట్టారు.

ఇక, కొంగునాడు ప్రాంత జిల్లాల్లో కూడా రికార్డు స్థాయిలో ఓటింగ్ జరిగింది. కోయంబత్తూరు, తిరుప్పూర్, ఈరోడ్, సేలం, నమక్కల్, కరూర్, నీలగిరి, ధర్మపురి, కృష్ణగిరి జిల్లాల్లో 80 శాతానికి పైగా పోలింగ్ నమోదైంది. ఈసారి తమిళనాడు ఓటర్లు ప్రజాస్వామ్యంపై తమ నిబద్ధతను చాటారు. భారీ ఎత్తున పోలింగ్ జరగడంతో రాజకీయ పార్టీల్లో ఉత్కంఠ నెలకొంది. అధిక ఓటింగ్ శాతం ఫలితాలపై ఎలా ప్రభావం చూపుతుందన్నది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది. ఎన్నికల బరిలోకి తొలిసారిగా దిగిన విజయ్ పార్టీ ఏ మేరకు ప్రభావం చూపుతుందో చూడాలి. తమిళనాడులో అధికార డీఎంకే, ప్రతిపక్ష అన్నాడీఎంకేతో పాటు విజయ్ టీవీకే పార్టీల మధ్య త్రిముఖ పోరు నెలకొంది. ఎండల్ని లెక్క చేయకుండా తమిళ ప్రజలు ఓటు హక్కును వినియోగించుకున్నారు.

**బెంగాల్లోనూ 90శాతం వరకు పోలింగ్**

పశ్చిమ బెంగాల్‌లో తొలి విడత పోలింగ్ భారీ రికార్డుల్ని క్రియేట్ చేస్తోంది. చరిత్రలో ఎప్పుడూ లేని విధంగా ఓటర్లు పోలింగ్ సెంటర్ల ముందు బారులు తీరారు. సాయంత్రం 5 గంటల వరకు బెంగాల్‌లో 90 శాతం మేర ఓటింగ్ నమోదైంది. చాలా మంది ఇంకా క్యూ లైన్లలో నిలిచి ఉండటంతో ఈ పోలింగ్ శాతం మరింత పెరిగే అవకాశం కనిపిస్తోంది. తొలి విడతలో భాగంగా బెంగాల్‌లో 152 స్థానాలకు గురువారం ఓటింగ్ జరిగింది. బెంగాల్‌లో మొత్తం అసెంబ్లీ నియోజకవర్గాలు 294 కాగా, రెండోదైన చివరి విడత పోలింగ్ 142 స్థానాలకు ఏప్రిల్ 29న జరుగనుంది. పోలింగ్ సరళిని చూస్తే అధికార తృణమూల్ కాంగ్రెస్(టీఎంసీ), ప్రతిపక్ష బీజేపీకి మధ్య హోరాహోరీ పోరు జరిగినట్లు తెలుస్తోంది. బెంగాల్ మొదటి విడత ఎన్నికల్లో 1478 మంది అభ్యర్థులు పోటీ చేశారు. బెంగాల్ ఎన్నికల్లో మరోవైపు హింస చెలరేగింది. ముర్షిదాబాద్‌లో టీఎంసీ కార్యకర్తలు ఏయూజేపీ పార్టీ చీఫ్ హుమాయున్ కబీర్‌పై దాడులు చేశారు. సిలిగురిలో టీఎంసీ, బీజేపీ కార్యకర్తల మధ్య ఘర్షణ జరిగింది. కుమార్‌గంజ్‌లో బీజేపీ అభ్యర్థి సువేందు సర్కార్‌పై టీఎంసీ గుండాలు దాడికి పాల్పడ్డారు. మరోవైపు, ఈ ఓటింగ్ చూస్తే ఎసఐఆర్ ప్రక్రియ, ఓట్ల తొలగింపుపై ప్రజల కోపాన్ని సూచిస్తోందని ఇది టీఎంసీకి అనుకూలమే అని సీఎం మమతా బెనర్జీ వ్యాఖ్యలు చేశారు. మరోవైపు, మే 4 టీఎంసీకి గుడ్ బై అంటూ బీజేపీ చెబుతోంది. గంటగంటకు పోలింగ్ పెరుగుతుండటంతో అధికార వ్యతిరేక ఓటింగ్ నమోదవుతున్నట్లు రాజకీయ నిపుణులు చెబుతున్నారు.

# భగీరథ మహర్షి పట్టుదల సేవాభావం ప్రతి ఒక్కరికి ఆదర్శం

### నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్..

### భువి నుంచి దివికి గంగను తెచ్చిన మహనీయుడు భగీరథుడు: ఎమ్మెల్సీ కూచుకుళ్ళ దామోదర్ రెడ్డి

**నాగర్ కర్నూల్ ఏప్రిల్ 23 (నినాదం)**

నాగర్ కర్నూల్ కలెక్టరేట్ లో నాగర్ కర్నూల్ జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో గురువారం భగీరథ మహర్షి జయంతి సందర్భంగా శాసనమండలి సభ్యులు కూచుకుళ్ళ దామోదర్ రెడ్డి, నాగర్ కర్నూలు జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ మహర్షి భగీరథుని చిత్రపటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ మాట్లాడుతూ... భగీరథ మహర్షి పట్టుదల, సేవాభావం ప్రతి ఒక్కరికీ ఆదర్శప్రాయమని కలెక్టర్ పేర్కొన్నారు. అసాధ్యాన్ని సుసాధ్యం చేసి గంగానదిని భూమికి తెచ్చిన మహనీయుడిగా భగీరథుని చరిత్రలో నిలిచిపోయారని అందుకే గొప్ప ప్రయత్నాలను 'భగీరథ ప్రయత్నం'గా పిలుస్తారని కలెక్టర్ ఈ సందర్భంగా వివరించారు. లక్ష్యం పట్ల అంకితభావం, పట్టుదల ఉంటే ఎంతటి కష్టమైన పనినైనా సాధించవచ్చని భగీరథుని జీవితం యువతకు గొప్ప సందేశమని రాష్ట్ర ప్రభుత్వం ప్రతి ఏడాది భగీరథ జయంతిని అధికారికంగా నిర్వహిస్తోందని, ఈ వేడుకల్లో ప్రజలు, ప్రజాప్రతినిధులు పాల్గొనాలని భగీరథుని ఆశయాలకు అనుగుణంగా సమాజంలో నీటి సంరక్షణ, పర్యావరణ పరిరక్షణపై ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని కలెక్టర్ సూచించారు. ఎమ్మెల్సీ కూచుకుళ్ళ దామోదర్ రెడ్డి మాట్లాడుతూ.. భగీరథుడు భువి నుండి దివికి గంగను తెచ్చిన మహనీయుడని, భగీరథుడు అని అన్నారు త్యాగ నిరతి, పట్టుదల ఆదర్శనీయమని ఎమ్మెల్సీ కొనియాడారు. వెనుకబడిన వర్గాల అభ్యున్నతికి, సంక్షేమానికి తెలంగాణ ప్రభుత్వం కట్టుబడి ఉందని, భగీరథుని ఆశయాలను స్ఫూర్తిగా తీసుకుని సగర కులస్తుల అభివృద్ధికి కృషి చేస్తామని ఆయన హామీ ఇచ్చారు. సగర కుల సంఘాల ప్రతిపాదనలను ఎమ్మెల్సీ దామోదర్ రెడ్డి సానుకూలంగా స్పందించారు.నాగర్ కర్నూల్ పట్టణంలో అందుకు అవసరమైన ఏర్పాట్లను చేస్తామని హామీ ఇచ్చారు. సగర కుల సంఘ నాయకులు వక్తలు మాట్లాడుతూ భగీరథుని స్మరిస్తూ, విగ్రహాన్ని సగరకుల భవనాన్ని ఏర్పాటుకు, కృషి చేయాలని వారు ఈ సందర్భంగా కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ సహాయ అధికారి శ్రీరాములు, వివిధ శాఖల జిల్లా అధికారులు, సగర సంఘం జిల్లా అధ్యక్షుడు గట్టు శ్రీనివాసులు సాగర్,18వ వార్డు కౌన్సిలర్ చంద్రకళ సాగర్ సాగర సంఘం నాయకులు అల్లం రాముడు ,సీనియర్ జర్నలిస్టు సాయిలు సాగర్, లక్ష్మణ్ సాగర్ ,టౌన్ అధ్యక్షులు బాలయ్య సాగర్ ,బంగారయ్య సాగర్ ,సూరంపల్లి సుధాకర్ సాగర సంఘం నాయకులు, స్థానిక ప్రజా ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు





# ఫ్లై ఓవర్ క్రింద హత్య కేసు గుట్టురట్టు

### గద్వాల పోలీసుల 'క్లూస్' ఆపరేషన్ సక్సెస్

### వేలిముద్రలే నిందితుల పాలిట మృత్యుపాశం!

**గద్వాల ప్రతినిధి ఏప్రిల్ 23 (నినాదం)**

గద్వాల పట్టణంలో ఈ నెల 12వ తేదీన స్వాగత్ బార్&రెస్టారెంట్ సమీపంలోని ఫ్లై ఓవర్ కింద లభ్యమైన గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం కేసును జిల్లా పోలీసులు అత్యంత చాకచక్యంగా ఛేదించారు. ముఖం గుర్తుపట్టలేనంతగా బండరాయితో మోది కిరాతకంగా చంపిన ఈ కేసులో.. ఎలాంటి ఆనవాళ్లు లేకపోయినా సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి నిందితులను కటకటాల్లోకి నెట్టారు. గద్వాల ఎస్పీ శ్రీనివాస్ రావు ఐపీఎస్ గారి ఆదేశాల మేరకు డీఎస్పీ మొగిలయ్య పర్యవేక్షణలో సీఐ టంగుటూరి శ్రీను బృందం ఈ కేసులో విజయం సాధించింది.



**ఛిద్రమైన ముఖం.. ఆ నిగూఢ పచ్చబొట్టు**

ఏప్రిల్ 12న ఉదయం మున్సిపల్ సిబ్బంది ఇచ్చిన సమాచారంతో పోలీసులు రంగంలోకి దిగారు. ఫ్లై ఓవర్ కింద రక్తపు మడుగులో పడి ఉన్న మృతదేహం భీతిగొల్పేలా ఉంది. ముఖంపై బండరాయితో కొట్టడం వల్ల దంతాలు బయటకు వచ్చి, గుర్తుపట్టలేనంతగా ఛితికిపోయింది. అయితే, మృతుడి కుడి చేతిపై ఉన్న 'అనిత' అనే పచ్చబొట్టు ఆధారంగా ప్రాథమిక దర్యాప్తు మొదలుపెట్టారు

**వేలిముద్రలే మృతుడిని పట్టించాయి**

గుర్తు తెలియని మృతదేహాన్ని గుర్తించడం పోలీసులకు సవాలుగా మారింది. క్లూస్ టీం సహాయంతో మృతుడి వేలిముద్రలను సేకరించి సర్వర్‌లో తనిఖీ చేయగా, అవి కర్నూలు జిల్లా ఎమ్మిగనూరు మండలం కడిమెట్ల గ్రామానికి చెందిన గొల్ల వీరేంద్ర (34) అని తేలింది. కుటుంబ సభ్యులు వచ్చి పచ్చబొట్టు ఆధారంగా మృతదేహాన్ని గుర్తించడంతో కేసు దర్యాప్తులో మొదటి అడుగు విజయవంతంగా పడింది.

**సీసీటీవీ ఫుటేజ్ ఇచ్చిన క్లూ**

నిందితుల గురించి ఎలాంటి ఆధారాలు లేకపోయినా, పోలీసులు ప్రత్యేక బృందాలుగా ఏర్పడి పట్టణంలోని వందలాది సీసీటీవీ కెమెరాలను జల్లెడ పట్టారు. మృతుడు వీరేంద్ర, నిందితులు కలిసి తిరుగుతున్న దృశ్యాలు కెమెరాల్లో నిక్షిప్తమయ్యాయి. నిందితులు మహబూబ్ నగర్ జిల్లా హన్వాడ మండలానికి చెందిన కుప్పగిరి శ్రీనివాసులు (ఏ 1), కడప జిల్లా ఎర్రగుంట్ల మండలానికి చెందిన సిద్దయ్య (ఏ 2) అని గుర్తించారు.

**హత్యకు కారణం.. ప్లాస్టిక్ సీసాల 'ఆదాయం**

నిందితులు ఇద్దరూ ప్లాస్టిక్ సీసాలు, చెత్త కాగితాలు ఏరుకుంటూ జీవిస్తుంటారు. గత మూడు నెలల నుండి వీరికి వీరేంద్రతో పరిచయం ఉంది. అయితే, మహబూబ్ నగర్ నుండి వచ్చి వీరు గద్వాలలో ప్లాస్టిక్ ఏరుకోవడం వల్ల తన ఆదాయం తగ్గుతుందని వీరేంద్ర వారితో తరచూ గొడవపడేవాడు. ఏప్రిల్ 11 రాత్రి వైన్ షాప్ వద్ద వీరేంద్ర గొడవపడి బూతులు తిట్టడంతో, కక్ష పెంచుకున్న నిందితులు ప్లాన్ వేశారు.

**పోలీసుల వేట.. రైల్వే స్టేషన్ వద్ద అరెస్ట్**

హత్య తర్వాత తప్పించుకు తిరుగుతున్న నిందితులను (గురువారం) ఉదయం 7 గంటల సమయంలో గద్వాల రైల్వే స్టేషన్ వద్ద పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుండి రక్తం మరకలైన బండరాయిని, నిందితుడు దాచిన దుస్తులను స్వాధీనం చేసుకున్నారు. కేసును ఛేదించడంలో కీలకంగా వ్యవహరించిన సీఐ టంగుటూరి శ్రీను, ఎస్సైలు జహంగీర్, కళ్యాణ్ కుమార్, నిమ్మల కుమార్,సి హెచ్ శ్రీకాంత్,కానిస్టేబుల్ చందు,కిరణ్ ఇతర సిబ్బందిని ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు.



# కాంగ్రెస్, బీఆర్ఎస్ రెండు ఒకటే

### అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ గుప్తా

**నిజామాబాద్ ప్రతినిధి, ఏప్రిల్ 23 (నినాదం)**

కాళేశ్వరం ప్రాజెక్టు వ్యవహారంలో కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు రెండు ఒకటేనని స్పష్టమైందని అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ గుప్తా తెలిపారు. నగరంలోని బీజేపీ జిల్లా కార్యాలయంలో గురువారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... కాంగ్రెస్ ప్రభుత్వం పిసి గోష్ కమిషన్ పేరుతో రెండేళ్లపాటు కాలయాపన చేసిందన్నారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వస్తే మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, హరీష్ రావును, కేటీఆర్ ను అరెస్ట్ చేస్తామని ప్రకటించిందన్నారు. కానీ ఇప్పటి వరకు ఎటువంటి చర్యలు తీసుకోలేదని ఆరోపించారు. ప్రాజెక్టు వ్యవహారంలో లక్ష కోట్ల అవినీతికి పాల్పడిందని స్వయంగా కాంగ్రెస్ ఆరోపించి, ఇప్పుడేమో కోర్టులో 9 వేల కోట్లు అవినీతి జరిగిందంటూ పిటిషన్ వేయడం వెనక ఆంతర్యం ఏమిటో తెలపాలన్నారు. అవినీతి పరులను కాపాడేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నట్లు తెలుస్తోందన్నారు. అవినీతి జరిగినట్లు ఆధారాలు ఉన్నప్పటికీ వాటిని చట్టపరంగా కోర్టు ముందు సమర్థవంతంగా ఉంచడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. చిత్తశుద్ధి ఉంటే వెంటనే సీబీఐ దర్యాప్తుకు కేంద్రానికి లేఖ రాయాలన్నారు. అలాగే హై కోర్టు స్టే ను సవాల్ చేస్తూ సుప్రీంకోర్టు లో అప్పీల్ చేయడం రాష్ట్ర ప్రభుత్వ బాధ్యత అని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వ పాలన అధ్వానంగా మారిందని ఎమ్మెల్యే అన్నారు. అర్బన్ లో పరిస్థితి కూడా దారుణంగా ఉందన్నారు. సిడీపీ ఫండ్ లేక పనులు ముందుకు సాగడం లేదన్నారు. పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ ఇందూరుకు వచ్చిన ప్రతిసారి అభివృద్ధి అంటారు, కానీ నియోజకవర్గ ప్రజలకు ఏమీ చేయడం లేదని విమర్శించారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ రెండు దోచుకోవడమే ప్రధాన లక్ష్యంగా పని చేస్తున్నాయన్నారు. అలాగే మహిళా బిల్లును కాంగ్రెస్ అడ్డుకోవడం దారుణమన్నారు. సమావేశంలో ఫ్లోర్ లీడర్ ప్రమోద్, కార్పొరేటర్లు మల్లేష్ యాదవ్, మల్కాయి మహేందర్, సీనియర్ నాయకులు న్యాలం రాజు, ఇప్పకాయల కిషోర్, సత్యపాల్, పుట్ట వీరేందర్, మండల అధ్యక్షుడు పడాల భూపతి, పిల్లి శ్రీకాంత్, అమంద్ విజయ్, మారావార్ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# ఆర్టీసీ సమ్మెతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న ప్రయాణికులు

**కోడేరు ఏప్రిల్ 23 (నినాదం)**

రాష్ట్రవ్యాప్తంగా చేపట్టిన ఆర్టీసీ కార్మికుల సమ్మె పేద ప్రజలపై ప్రభావం చూపుతుంది ఆర్టీసీ బస్సులు రాకపోకలు నిలిచిపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు ప్రయాణికుల ప్రైవేటు వాహనాలను ఆశ్రయించక తప్పలేదు సకాలంలో రవాణా సౌకర్యాలు లేకపోవడంతో పాఠశాలలు నేటితో ముయ్యడంతో విద్యార్థులు రావడానికి తీవ్ర ఇబ్బందులకు గురి అయ్యారు ప్రైవేటు ఆటో దారులు ఆర్టీసీ చార్జీ కంటే అదనంగా వసూలు చేస్తున్నారు అయినా ప్రయాణికులకు అవసరాలను బట్టి చెల్లించక తప్పడం లేదు



## భగీరథ మహర్షి ప్రతి ఒక్కరికి ఆదర్శం

**గద్వాల ప్రతినిధి ఏప్రిల్ 23( నినాదం)**

అసాధ్యం అనుకున్న గంగమ్మను భూమండలంకు తీసుకొచ్చి సకల జీవరాశులకు నీటిని అందించిన భగీరథ మహర్షి ప్రతి ఒక్కరికి ఆదర్శంగా నిలుస్తారని అదనపు కలెక్టర్ లక్ష్మీనారాయణ అన్నారు. గురువారం భగీరథ మహర్షి జయంతి ఉత్సవాలను పురస్కరించుకొని జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో ఐడిఓసి వద్ద మహర్షి చిత్రపటానికి అధికారులు, సగర సంఘం నేతలు పూలమాలలు వేసి, పూజలు చేశారు. ముఖ్యఅతిథిగా హాజరైన అదనపు కలెక్టర్ మాట్లాడుతూ మహర్షులు అంటేనే గొప్ప వ్యక్తులని, అందులోనూ భగీరథ మహర్షి తన తపోశక్తితో సాధించిన విజయం భవిష్యత్తు తరాలకు స్ఫూర్తిగా నిలుస్తుందన్నారు. ఎవరైనా ఏదైనా ప్రయత్నం చేసేటప్పుడు విజయం వరించకుంటే భగీరథ మహర్షిని తలుచుకోమని పెద్దలు చెబుతుంటారని, దాంతో విజయం సాధించే వరకు ప్రయత్నం చేస్తూనే ఉండాలన్న అర్థం వస్తుందన్నారు. ఇలాంటి గొప్ప వాళ్ళు చూపిన మార్గం, చేసిన సమాజ సేవ గుర్తు చేసుకునేందుకు ప్రభుత్వం ఏటా అధికారికంగా జయంతి ఉత్సవాలను నిర్వహిస్తోందని తెలిపారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మహర్షి గొప్పతనం గురించి ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో కలెక్టరేట్ ఏవో భూపాల్ రెడ్డి, డీఈవో విజయలక్ష్మి , గద్వాల మున్సిపల్ కమిషనర్ జానకి రామ్ సాగర్, ఇతర అధికారులు, సగర సంఘం నేతలు, తదితరులు పాల్గొన్నారు.



## పదోవ తరగతి మూల్యాంకనం పూర్తి

### నాగర్ కర్నూలు జిల్లా విద్యాశాఖ అధికారి ఏ రమేష్ కుమార్

**నాగర్ కర్నూల్ ఏప్రిల్ 23 (నినాదం)**

నాగర్ కర్నూలు జిల్లా కేంద్రంలోని లిటిల్ ఫ్లవర్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన పదో తరగతి జవాబు పత్రాల మూల్యాంకన ప్రక్రియ విజయవంతంగా పూర్తయిందని నాగర్ కర్నూలు జిల్లా విద్యాశాఖ అధికారి (డీఈఓ) ఏ. రమేష్ కుమార్ తెలిపారు. విద్యాశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మూల్యాంకన కేంద్రంలో ఉపాధ్యాయులు నిర్దేశించిన షెడ్యూల్ ప్రకారం సమాధాన పత్రాల పరిశీలనను సకాలంలో పూర్తి చేసినట్లు డిఇఓ వెల్లడించారు. మూల్యాంకన ప్రక్రియలో పారదర్శకత, ఖచ్చితత్వానికి ప్రాధాన్యత ఇచ్చినట్లు అధికారులు పేర్కొన్నారు. డీఈఓ మాట్లాడుతూ, ప్రతి సమాధాన పత్రాన్ని నిబంధనలకు అనుగుణంగా జాగ్రత్తగా పరిశీలించడంతో పాటు మార్కుల నమోదు ప్రక్రియను కూడా సమాంతరంగా నిర్వహించినట్లు తెలిపారు. తద్వారా ఫలితాల తయారీకి అవసరమైన ప్రాథమిక పనులు వేగంగా పూర్తయ్యాయని చెప్పారు. మే మొదటి వారంలో పదో తరగతి ఫలితాల విడుదలకు రాష్ట్ర స్థాయి లో ఏర్పాట్లు జరుగనున్నాయి. జిల్లా కేంద్రంలో నిర్వహించిన ఈ మూల్యాంకన ప్రక్రియలో నాగర్ కర్నూల్ వనపర్తి జిల్లాల ఉపాధ్యాయులు పాల్గొని, నిర్దేశిత సమయానికి పని పూర్తి చేయడంలో కీలక పాత్ర పోషించారని, విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని అత్యంత జాగ్రత్తగా మూల్యాంకనం నిర్వహించినట్లు డిఇఓ రమేష్ కుమార్ తెలిపారు.

## జనగణన స్వీయ లెక్కింపుకు అవకాశం

**గద్వాల ప్రతినిధి ఏప్రిల్ 23( నినాదం)**

జన గణన 2027 కార్యక్రమంలో భాగంగా మొదటి దశలో గృహాలు లెక్కింపును చేపడుతున్న నేపథ్యంలో ప్రజల సౌలభ్యం నిమిత్తం స్వీయ లెక్కింపుకు అవకాశం కల్పిస్తున్నట్లు అదనపు కలెక్టర్, అదనపు జిల్లా ప్రధాన జనగణన అధికారి లక్ష్మీ నారాయణ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 26 నుంచి మే 10వ తేదీ వరకు మొబైల్ ఫోన్, ఇంటర్నెట్ ఉన్న కంప్యూటర్, తదితర ద్వారా సెన్సెస్ కు సంబంధించిన వెబ్ పోర్టల్ లో తమ వివరాలను పొందుపరచవచ్చన్నారు. నమోదు పూర్తయిన తర్వాత ఒక యూనిక్ కోడ్ వస్తుందని, దీనిని తమ ప్రాంత ఎన్నిమరేటర్కు చూపించాల్సి ఉంటుందన్నారు. ఇంటి సభ్యుల వివరాలను స్వయంగా నమోదు చేసుకోవడానికి ఇది సులభమైన, వేగవంతమైన విధానంగా పేర్కొన్నారు. స్వీయ లెక్కింపులో పాల్గొనడం ద్వారా గణన ప్రక్రియను వేగవంతం చేయడానికి సహకరించిన వారవుతారన్నారు. జిల్లాలోని ప్రజాప్రతినిధులు, ప్రభుత్వ ఉద్యోగులు, యువత, మహిళ సంఘాలు, స్వయం సహాయక సంఘాలు, బ్యాంకు, ఐటీ ఉద్యోగులు, ఇతర వర్గాల వారు స్వీయ లెక్కింపులో పాల్గొని విజయవంతం చేయాల్సిందిగా అదనపు కలెక్టర్ కోరారు.

# అక్రమంగా తరలిస్తున్న 21 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత.. ఇద్దరిపై కేసు నమోదు

### బియ్యం వాహనాన్ని పట్టుకున్న సర్పంచ్ శేఖర్ యాదవ్



**కల్వకుర్తి ఏప్రిల్ 23 (నినాదం)**

తలకొండపల్లి మండలం ప్రభుత్వం పేద ప్రజలకు ఉచితంగా పంపిణీ చేస్తున్న రేషన్ బియ్యాన్ని కొందరు అక్రమంగా విక్రయిస్తున్నారని తలకొండపల్లి మండలం జూలపల్లి గ్రామ సర్పంచ్ కడారి శేఖర్ యాదవ్ పేర్కొన్నారు. తలకొండపల్లి మండలం జూలపల్లి గ్రామంలో అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యం వాహనాన్ని పట్టుకొని గ్రామ పంచాయతీకి తరలించి అధికారులకు తెలియజేయడం జరిగింది. స్పందించిన అధికారులు ఆర్ఐ శ్రవణ్, జీ పి ఓ నర్సింహా వాహనాన్ని తనిఖీ చేసి బియ్యం సంచులను తరలిస్తున్న డ్రైవర్, మరో ముగ్గురిని అదుపులోకి తీసుకొని, వాహనాన్ని పోలీస్ స్టేషన్ తరలించారు .విచారణలో రేషన్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తున్నట్టుగా గుర్తింమని వెల్లడించారు,అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని సహకరించిన సర్పంచి శేఖర్ యాదవ్ కు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

# మధిర మున్సిపాలిటీలో ఆధునిక హిందూ స్మశాన వాటిక నిర్మాణం

**మధిర, ఏప్రిల్ 23 (నినాదం):**

మధిర మునిసిపాలిటీని అభివృద్ధి దిశగా పయనించే క్రమంలో భాగంగా తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క 15వ వార్డులో ఉన్న మహాప్రస్థాన్నాన్ని (హిందూ స్మశాన వాటిక) అన్ని సౌకర్యాలతో, అధునాతన పద్ధతిలో నిర్మించుటకు అనుమతులు మంజూరు చేయించినారు. ఇట్టి బృహత్తర కార్యక్రమంలో ప్రజలను భాగస్వామ్యులను చేయుటకు మధిర మున్సిపాలిటీ రూపు రేఖలను మార్చి భావితరాలు ఎప్పటికీ మర్చిపోని విధంగా, మధిర అంటే నాకు ప్రాణం అనే మాటను నిజం చేస్తూ పట్టణంలోని మహాప్రస్థానాన్ని హైదరాబాదు మహానగరంలో ఉన్న పద్ధతిలో నిర్మించుటకు అనుమతినిచ్చిన మల్లు భట్టి విక్రమార్కకు ముందుగా కృతజ్ఞతలు తెలుపుతూ, ఈ సందర్భంగా మహాప్రస్థానంలో ఉన్న సమాధులను తొలగించుటకు పెద్ద మనసుతో అంగీకరించిన వివిధ కుల సంఘాల వారిని సమన్వయపరిచిన మధిర పట్టణ



అభివృద్ధి కమిటీ, పట్టణ మున్సిపల్ కౌన్సిల్, మహాప్రస్థానం అభివృద్ధికి తమ వంతు సహకారం అందించుటకు ముందుకు వచ్చిన ఎలక్ట్రానిక్, ప్రింట్ మీడియా, మరియు పట్టణ ప్రముఖ జర్నలిస్టులకు మధిర అభివృద్ధికి తోడ్పాటును అందిస్తున్న ప్రతి ఒక్కరికి పేరుపేరునా కృతజ్ఞతలు, ధన్యవాదాలు, తెలుపుతూ, మనిషి జన్మకు చివరి మజిలీ, మోక్షాన్ని ప్రసాదించే నెట్ నడయాడు పుణ్యస్థలం నిర్మాణమునకు అనుమతులు మంజూరు చేసిన గౌరవ మల్లు బట్టి విక్రమార్కకు మరొక్కసారి కృతజ్ఞతలు తెలుపుతూ మీ 15వ వార్డు కౌన్సిలర్ నకిరేకంటి రాజేశ్వరి గోవింద్.

# మున్సిపాలిటీ మహిళా కో-ఆప్షన్ సభ్య పదవికి వాజిదా బేగం నామినేషన్

### మున్సిపాలిటీ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా: వాజిదా బేగం

**కల్వకుర్తి ఏప్రిల్ 23 (నినాదం)**



కల్వకుర్తి మున్సిపాలిటీలో మహిళా కో–ఆప్షన్ సభ్య పదవికి వాజిదా బేగం నామినేషన్ దాఖలు చేశారు. కాంగ్రెస్ పార్టీ సంపూర్ణ మద్దతుతో ఆమె తన అభ్యర్థిత్వ పత్రాలను సమర్పించారు.ఈ సందర్భంగా పలువురు జర్నలిస్టులతో కలిసి మున్సిపల్ కార్యాలయానికి చేరుకున్న వాజిదా బేగం నామినేషన్ ప్రక్రియను పూర్తి చేశారు. మహిళల అభివృద్ధి, పట్టణ సమస్యల పరిష్కారం, ప్రజా సంక్షేమం కోసం కృషి చేస్తానని ఈ సందర్భంగా వాజిదా బేగం పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆమె విజయం ఖాయమని విశ్వాసం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో ప్రింట్ & ఎలక్ట్రానిక్ మీడియా మిత్రులు పాల్గొన్నారు.




# ఉన్నత స్థాయికి చేరుకునేలా ప్రోత్సహించాలి

**గద్వాల ప్రతినిధి ఏప్రిల్ 23( నినాదం)**

విద్యార్థులు ఉన్నత స్థాయికి చేరుకునేలా ఉపాధ్యాయులతో పాటు వారి తల్లిదండ్రులు కూడా ప్రోత్సహించాలని అదనపు కలెక్టర్ నర్సింగరావు అన్నారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా నిర్వహిస్తున్న సంక్షేమ వారోత్సవాల్లో గురువారం పేరెంట్ టీచర్స్ మీటింగ్స్, విద్యార్థుల ప్రగతి నివేదిక కార్యక్రమాలను పురస్కరించుకొని ఉండవెల్లి మండలం పుల్లూరు గ్రామంలోని మహాత్మా జ్యోతిబాపూలే బీసీ బాలికల గురుకుల విద్యాలయంలో నిర్వహించిన కార్యక్రమానికి అదనపు కలెక్టర్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ప్రస్తుతం అమ్మాయిలు అన్ని రంగాల్లో రాణిస్తున్నారని తల్లిదండ్రులు తమ పిల్లలను ఉన్నత చదువులు చదివిస్తే ఉద్యోగాలు సాధించి ఆర్థికంగా ఎవరిపై ఆధారపడకుండా జీవిస్తారని తెలిపారు. విద్యార్థులు వేసవి సెలవులను సద్వినియోగం చేసుకునేలా, వారికి వివిధ అంశాల్లో నైపుణ్యాలు పెరిగేలా తల్లిదండ్రులు శిక్షణ ఇప్పించాలని సూచించారు. ఈ సందర్భంగా గురుకుల విద్యాలయంలో చదివి ఇంటర్లో టాపర్లుగా నిలిచిన విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు సన్మానం చేశారు. అనంతరం అధికారులు గురుకుల విద్యాలయంలోని విద్యార్థులతో, వారి తల్లిదండ్రులతో కలిసి భోజనం చేశారు. ఈ కార్యక్రమంలో పుల్లూరు గ్రామ సర్పంచ్ సునీతమ్మ, ఉప సర్పంచ్ అబ్దుల్, డీసీఓ అనిలా కుమారి, జిల్లా ఎస్సీ సంక్షేమ శాఖ అధికారి సుషిత, బీసీ సంక్షేమ శాఖ అధికారి అక్బర్ బాషా, ఎంపీఓ ఖాజా మొయినుద్దీన్, ఇతర అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



## మెకానిక్ కుటుంబాలకు ఆర్థిక సహాయం

**గద్వాల ప్రతినిధి ఏప్రిల్ 23 (నినాదం)**

జోగులాంబ గద్వాల జిల్లా అయిజ.పట్టణానికి చెందిన తాండ్రపాడు గ్రామం బోయ సత్యం,కుర్వ భరత్, మెకానిక్ లు అనారోగ్యం కారణంగా చనిపోవడంతో...ఈరోజు అయిజ మెకానిక్ సభ్యులుతరపున ప్రతి ఒక్క మెకానిక్ సహాయంతో అధ్యక్షులు సుధాకర్ ఆచారి ఉపాధ్యక్షులు దేవరాజ్ సలహాదారుడు బీచ్ పల్లి కోశాధికారి చాంద్ కోఆర్డినేటర్లు,చేతుల మీదుగా అయిజ మెకానిక్ ల నుండి కుర్వ భరత్ కుటుంబానికి24,000/- రూపాయలు,మరియు బోయ సత్యం కుటుంబానికి 26,000/-రూపాయలు ఆర్థిక సాయం చేయడంజరిగింది.ఈ కార్యక్రమంలో తోటి మెకానిక్ సభ్యులు పాల్గొన్నారు.

# నర్సంపేట డిపోలో డ్రైవర్ శంకర్ గౌడ్ ఆత్మహత్యాయత్నం అత్యంత దురదృష్టకరం

**మధిర, ఏప్రిల్ 23(నినాదం):**

గురువారం రోజు ఆర్టీసీ లో కొనసాగుతున్న 2 వ రోజు సమ్మెలో భాగంగా నర్సంపేట డిపోలో డ్రైవర్ శంకర్ గౌడ్ ఒంటి మీద పెట్రోల్ పోసుకొని ఆత్మహత్యాయత్నం చేయడం అత్యంత దురదృష్టకరమైన ఘటనగా మధిర డిపో జేఏసీ తీవ్రంగా ఖండిస్తోంది. ఈ ఘటనకు నిరసనగా మధిర డిపో గేటు ముందు జేఏసీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించబడింది. ఈ సందర్భంగా జేఏసీ నాయకులు మాట్లాడుతూ, ఇలాంటి ఆత్మహత్యాయత్నాలు ఎట్టి పరిస్థితుల్లోనూ చేయకూడదని, సమస్యల పరిష్కారం కోసం సహనంతో పోరాటం కొనసాగించాలి అని పిలుపునిచ్చారు. ఈరోజు కాకపోతే రేపైనా కార్మికుల సమస్యలు తప్పక పరిష్కారం అవుతాయి. మన హక్కుల కోసం, మనం ఐక్యంగా, శాంతియుతంగా పోరాడాలి కానీ, ప్రాణాలకు హాని కలిగించే చర్యలకు దిగకూడదు అని నాయకులు స్పష్టం



చేశారు. అలాగే ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తూ, వెంటనే చర్చలు ప్రారంభించి ఆర్టీసీ కార్మికుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరారు. కార్మికుల ఆవేదనను గుర్తించి ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జేఏసీ నాయకులు షేక్ నాగుల్ మీరా, ఎం రామచంద్రరావు, కే అరుణ కుమారి, సిహెచ్ కోటయ్య, జె పద్మావతి, ఎం నాగేశ్వరరావు, వి కిరణ్ బాబు, పి అనూష తదితరులు పాల్గొన్నారు.

# గూడులేని నిరుపేదలకు ఇందిరమ్మ ఇల్లు

**సీఎం రేవంత్ రెడ్డి సంకల్పం**

**కాంగ్రెస్ సీనియర్ రాష్ట్ర నాయకులు జువ్వాడి కృష్ణారావు**

**కోరుట్ల మున్సిపల్ చైర్ పర్సన్ తిరుమల వసంత గంగాధర్**





**కోరుట్ల, ఏప్రిల్ 23(నినాదం):** తెలంగాణ రాష్ట్రశీలో గూడులేని నిరుపేద కు ఇందిరమ్మ ఇల్లు ఇవ్వాలనే సంకల్పంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇందిరమ్మ ఇల్లు అందజేయడమే లక్ష్యంగా పని చేస్తున్నారని కాంగ్రెస్ సీనియర్ రాష్ట్ర నాయకులు జువ్వాడి కృష్ణారావు,కోరుట్ల మున్సిపల్ చైర్ పర్సన్ తిరుమల వసంత గంగాధర్ తెలిపారు. కోరుట్ల పట్టణశీలోని భీముని దుబ్బ వాడకు చెందిన అగ్గ రాజు – లక్మిరాజం, అగ్గ సుజాత – రాజేశంలకు రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసిన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం పూర్తి చేసుకుని గురువారం ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశ వేడుకల్లో పాల్గొని నూతన వస్త్రాలు అందజేశారు. ఈ సందర్భంగా జువ్వాడి కృష్ణారావు,కోరుట్ల మున్సిపల్ చైర్ పర్సన్ తిరుమల వసంత గంగాధర్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వంలో ఏ ఒక్కరు ఇల్లు లేని వారు ఉండకూడదనే ఉద్దేశంతో రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇందిరమ్మ ఇంటి నిర్మాణ పథకాన్ని చేపట్టారన్నారు. నియోజక వర్గంలో అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇల్లు అందజేయడమే ప్రభుత్వ లక్ష్యమని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తిరుమల గంగాధర్, 14వ వార్డు కౌన్సిలర్ రెంజర్ల కళ్యాణి, యూత్ కాంగ్రెస్ నియోజక వర్గ మాజీ అధ్యక్షులు ఏలేటి మహిపాల్ రెడ్డి, నాయకులు చెట్పల్లి రంజిత్ గుప్తా, వార్డు ప్రజలు, ఇందిరమ్మ గృహ ప్రవేశ కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# రెండవ రోజు కొనసాగిన ఆర్టీసీ ఉద్యోగుల సమ్మె

**ఇక్కట్లకు గురైన ప్రయాణికులు**

**పరిస్థితులను సమీక్షించిన రిజనల్ మేనేజర్ శ్రీలత**

**ఎస్పీ స్నేహ మెహ్రా ఐపీఎస్**

**సమ్మెకు మద్దతు తెలిపిన బిఆర్ఎస్**





**వికారాబాద్, ఏప్రిల్23 (నినాదం):** తెలంగాణ రోడ్డు రవాణా సంస్థ ఉద్యోగుల గత రెండు రోజులుగా తమ సమస్యల పరిస్కారం కోరుతూ సమ్మె చేస్తున్న విషయం విధితమే. గురువారం కూడా సమ్మెను కొనసాగించారు. ఈ నేపథ్యంలో పరిస్థితులను ఆర్టీసీ రిజినల్ మేనేజర్ శ్రీలత, వికారాబాద్ జిల్లా ఎస్పీ స్నాహ మెహ్రా ఐ పీ ఎస్ లు వికారాబాద్ డిపోకు చేరుకుని సమీక్షించారు. అదేవిధంగా సమ్మె చేస్తున్న ఆర్టీసీ ఉద్యోగులకు మద్దతుగా వికారాబాద్ జిల్లా బి ఆర్ ఎస్ అధ్యక్షుడు మెతుకు ఆనంద్, నాయకగణం నిలిచారు. ఉద్యోగుల న్యాయబద్ధమైన డిమాండ్లను పరిష్కరించాలని ఈ సందర్భంగా కోరారు. జిల్లా వ్యాప్తంగా అధికారులు ప్రయివేట్ సిబ్బంది సహాయంతో కొన్ని బస్సులను నడిపించినప్పటికీ ప్రయానిణికులు కొందరు ఇబ్బందులకు గురికాక తప్పలేదు. పాఠశాలలకు ప్రభుత్వం వేసవి సెలవులను ప్రకటించడంతో ఆశ్రమ పాఠశాలల నుండి విద్యార్థులను తీసుకుని రావడానికి సరైన బస్సు సౌకర్యం లేక తల్లి తండ్రులు కొంత ఇబ్బందికి గురైయ్యారు. అదేవిధంగా సాధారణ ప్రయాణికులు సహితం కొంత అసౌకర్యానికి లోనైయ్యారు. ఈ నేపథ్యంలో జిల్లా ఎస్పీ స్నాహ మెహ్రా ఐపీఎస్ ఈ సందర్భంగా ఆర్టీసీ ఉన్నతాధికారులతో మాట్లాడి, బస్సుల రాకపోకలు డిపో వద్ద నెలకొన్న తాజా పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. బందోబస్తులో ఉన్న పోలీస్ అధికారులు సిబ్బంది నిరంతరం అప్రమత్తంగా ఉండాలని, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని ఆమె ఆదేశించారు. సమ్మె నేపథ్యంలో విధులకు హాజరయ్యే డ్రైవర్లు ఇతర సిబ్బంది ఏలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, వారికి పోలీసు శాఖ తరపున పూర్తిస్థాయిలో రక్షణ కల్పిస్తామని భరోసా ఇచ్చారు. ప్రజా రవాణా వ్యవస్థకు ఆటంకం కలిగించే ప్రయత్నం చేసినా, లేదా ప్రభుత్వ ఆస్తులైన బస్సులకు నష్టం కలిగించినా సహించేది లేదని ఆమె స్పష్టం చేశారు. చట్టాన్ని అతిక్రమించి ఆందోళనలకు దిగేవారిపై, విధులను అడ్డుకొనే వారిపై కఠినమైన చట్టపరమైన చర్యలు తీసుకోవాలని అక్కడి అధికారులను ఆదేశించారు.జిల్లా లోని మూడు డిపోలలో పరిస్థితి శాంతియుతంగా కొనసాగుతోందని అన్నారు. విల్లింగ్ ఉన్న డ్రైవర్లు విధులకు హాజరుకావాలని, పోలీస్ శాఖ రక్షణ కల్పిస్తుంది అని తెలిపినారు. ప్రయాణికులకు ఇబ్బంది కలగకుండా రవాణా సౌకర్యాలు కొనసాగేలా చూడటమే తమ ప్రాధాన్యతని ఆమె పేర్కొన్నారు.

# అన్నదాతలు పండించిన చివరి ధాన్యం గింజ వరకు కొనుగోలు

**కొనుగోలు కేంద్రాల్లో ధాన్యాన్ని విక్రయించాలి**

**కాంగ్రెస్ పార్టీ సీనియర్ రాష్ట్ర నాయకులు జువ్వాడి కృష్ణారావు**





**కోరుట్ల, ఏప్రిల్ 23(నినాదం):** రాష్ట్రంలో అన్నదాత పండించిన చివరి ధాన్యం గింజ చివరి వరకు కొనుగోలు చేస్తామని,కేంద్రాల్లో ధాన్యాన్ని విక్రయించి మద్దతు ధర పొందాలని కాంగ్రెస్ పార్టీ సీనియర్ రాష్ట్ర నాయకులు జువ్వాడి కృష్ణారావు అన్నారు. కోరుట్ల మండలం వెంకటాపూర్ గ్రామంలో ఐకెపి ప్యాక్ కల్లూర్ గ్రామంలో ఐకెపి ఆధ్వర్యంలో ప్రజా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న ధాన్యం కొనుగోలు కేంద్రాలను గురువారం వ్యవసాయ మార్కెట్ చైర్మన్ పన్నాల అంజిరెడ్డి, వెంకటాపూర్ సర్పంచ్ ధ్యాగ గంగాధర్, కల్లూరు సర్పంచ్ చిట్నేని లత సర్పంచ్ లతో కలిసి వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని కాంగ్రెస్ పార్టీ సీనియర్ రాష్ట్ర నాయకులు జువ్వాడి కృష్ణారావు ప్రారంభించారు. ఈ సంద ర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు పండించిన వరి ధాన్యానికి మందతు ధరగా గ్రేడ్ ఏ రకానికి 2389 రూపా యలు చెల్లిస్తూ ప్రభుత్వం కొనుగోలు చేస్తుందన్నారు. రైతు సంక్షేమ అభివృద్ధి కోసం కాంగ్రెస్ పార్టీ అనునిత్యం కృషి చేస్తుందని, రైతులు ఎక్కడికో పోయి అమ్ముకోవాల్సిన పరిస్థితి ఉండకూడదనే ప్రతి గ్రామంలో ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటు చేసిందన్నారు. రైతులు ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో ధాన్యాన్ని విక్రయించుకొని మద్దతు ధర పొందాలని సూచించారు. రైతులకు పెట్టుబడి సహాయం కింద రైతుబంధు అందజేయడం జరిగిందని, రైతుల పక్షపాతి ప్రభుత్వం కాంగ్రెస్ అన్నారు. రైతులకు ఒకేసారి రుణమాఫీ అమలు చేసినట్లు తెలిపారు. సన్నబడ్లకు రూ. 500 బోనస్ ప్రభుత్వం చెల్లిస్తుందని గుర్తు చేశారు. రైతులు దళారులను నమ్మి మోసపోవద్దని వారు పండించిన పంటలను చివరి గింజ వరకు రాష్ట్ర ప్రభుత్వం కొనుగోలు చేస్తుందన్నారు. రైతుల ఎలాంటి ఆందోళనకు గురి కావద్దని రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మారుతున్న కాలానికి అనుగుణంగా రైతులు పంట మార్పిడి విధానాన్ని అవలంబించాలని కాంగ్రెస్ పార్టీ సీనియర్ రాష్ట్ర నాయకులు జువ్వాడి కృష్ణారావు సూచించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ చైర్మన్ పన్నాల అంజిరెడ్డి, సర్పంచ్ ల ఫోరం మండల అధ్యక్షులు దొడ రంజిత్ రెడ్డి, వెంకటాపూర్ సర్పంచ్ ధ్యాగ గంగాధర్, కల్లూరు సర్పంచ్ చిట్నేని లత రమేష్, మండల కాంగ్రెస్ అధ్యక్షులు కొంతం రాజం, యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ మాజీ అధ్యక్షులు ఏలేటి మహిపాల్ రెడ్డి, కాంగ్రెస్ నాయకులు పల్లపు అశోక్, మారుపాక సుమన్, కాంగ్రెస్ నాయ కులు, కార్యకర్తలు, ఆయా గ్రామాల రైతులు తదితరులు పాల్గొన్నారు.

# పాఠశాలలో విద్యార్థుల సంఖ్యను మెరుగు పరచండి

**మధ్యాహ్న భోజనంలో నాణ్యతను పాటించండి**

**మేడ్చల్ కలెక్టర్ మను చౌదరి**





**మేడ్చల్ కలెక్టరేట్, ఏప్రిల్ 23 (నినాదం):** మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ మను చౌదరి గురువారం మేడ్చల్ మండలం పూడూరు గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన పాఠశాలలోని వసతులు, విద్యా ప్రమాణాలను పరిశీలించడంతో పాటు విద్యార్థులు, తల్లిదండ్రులు ఉపాధ్యాయులతో ముఖాముఖి నిర్వహించారు.పాఠశాల అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలపై కలెక్టర్ తల్లిదండ్రులతో ప్రత్యేకంగా చర్చించారు. దూర ప్రాంతాల నుండి వచ్చే విద్యార్థులకు రవాణా ఇబ్బందిగా ఉందని, పాఠశాలకు స్కూల్ బస్సు కావాలని తల్లిదండ్రులు కలెక్టర్‌ను కోరారు. దీనిపై స్పందించిన ఆయన, పాఠశాలలో విద్యార్థుల సంఖ్యను (స్ట్రెంతు) మెరుగుపరచాలని పాఠశాల అధికారులను ఆదేశించారు. విద్యార్థుల సంఖ్య పెరిగితే, దానికి అనుగుణంగా కొత్త బస్సును కొనుగోలు చేసే అంశాన్ని పరిశీలిస్తామని హామీ ఇచ్చారు. పాఠశాలలోని కంప్యూటర్ సైన్స్ ల్యాబ్‌లను కలెక్టర్ తనిఖీ చేశారు. ల్యాబ్ ఇన్‌స్ట్రక్టర్లతో మాట్లాడి ప్రయోగాల నిర్వహణ గురించి తెలుసుకున్నారు. విద్యా ప్రమాణాలను పెంచేందుకు పాఠశాలకు ఇంకేమైనా అవసరాలు ఉన్నాయా అని సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు.అనంతరం కలెక్టర్ విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. భోజనం రుచిగా ఉందా మెనూ ప్రకారం ప్రతిరోజూ భోజనం పెడుతున్నారా అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. వంట సిబ్బందితో మాట్లాడి వారికి కావాల్సిన వంట సామాగ్రి లేదా ఇతర పరికరాల అవసరాల గురించి ఆరా తీశారు. జిల్లా విద్యాశా ఖాధికారి (డీఈవో) విజయకుమారి, డిప్యూటీ తహసీల్దార్ అనూష, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ చందన్ రెడ్డి, పాఠశాల ప్రధానో పాధ్యాయులు వై. శంకరయ్య ఇతర ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

# ప్రభుత్వ పాఠశాల్లో చదివే విద్యార్థులకు ప్రభుత్వం సకల సౌకర్యాలు

**నాగర్ కర్నూల్ పార్లమెంటు సభ్యులు మల్లు రవి**









**వనపర్తి ప్రతినిధి, ఏప్రిల్ 23 (నినాదం) :** ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు ప్రభుత్వం సకల సౌకర్యాలు కల్పిస్తోందని, విద్యార్థులు బాగా చదువుకుంటే మంచి అవకాశాలు అందిపుచ్చుకోవచ్చని నాగర్ కర్నూల్ పార్లమెంటు సభ్యులు డాక్టర్ మల్లు రవి పేర్కొన్నారు. గురువారం వనపర్తి జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జడ్పీ బాలికల పాఠశాలలో బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ కింద విద్యార్థినులకు 500 సైకిళ్ళు అందజేశారు. ఈ కార్యక్రమానికి ఎంపీ మల్లు రవి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఎంపీ తో పాటుగా ఎమ్మెల్యే మేఘారెడ్డి, జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి, బ్యాంక్ ఆఫ్ ఇండియా చీఫ్ జనరల్ మేనేజర్ మనోజ్ శ్రీవాస్తవ పాల్గొన్నారు. ఈ సందర్భంగా బ్యాంక్ ఆఫ్ ఇండియా అందజేసిన సైకిళ్లను ఎంపీ, ఎమ్మెల్యే చేతుల మీదుగా విద్యార్థినులకు పంపిణీ చేశారు. ఎంపీ మల్లు రవి మాట్లాడుతూ వనపర్తి జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో 1000 మంది విద్యార్థులు చదువుతున్నారని తెలిసి ఆశ్చర్యానికి గురయ్యానని ఎంపీ అన్నారు. ప్రభుత్వ పాఠశాలలో 1000 మంది చదవడం గొప్ప విషయం అని పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు ఉచితంగా సైకిళ్లు అందజేసేందుకు కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ కింద పంపిణీ చేయడానికి ముందుకు వచ్చిన బ్యాంక్ ఆఫ్ ఇండియా ను అభినందిస్తున్నామ న్నారు. రాబోయే రోజుల్లో మరిన్ని కార్యక్రమాలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వ పాఠశాలలపై నేడు ప్రభుత్వం ప్రధానంగా దృష్టి సారించింది కాబట్టి మంచి సౌకర్యాలు ఉన్నాయన్నారు. విద్యార్థుల సమానత్వం కోసం ఉచితంగా ప్రభుత్వం యూనిఫామ్ లు పంపిణీ చేస్తోందని తెలిపారు. ప్రస్తుతం విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజన పథకం తో పాటు రాబోయే రోజుల్లో అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో బ్రేక్ ఫాస్ట్ పథకాన్ని కూడా ప్రవేశపెట్టనున్నట్లు తెలిపారు. వెయ్యి మంది విద్యార్థుల సామర్థ్యం ఉన్నందున ఈ స్కూల్ ని మోడల్ స్కూల్ చేయాలని మా ఆలోచన అన్నారు. స్కూల్ కోసం ఏమైనా అవసరాలు ఉంటే కోరవచ్చని ఎంపీ తెలపగా లిఫ్ట్ కాంపౌండ్ సౌకర్యం కల్పించాలని ప్రధానోపాధ్యాయులు కోరారు. దీనికి ఎంపీ స్పందిస్తూ లిఫ్ట్ ఏర్పాటుకు రూ.10 లక్షల రూపాయలు, కాంపౌండ్ నిర్మాణానికి రూ.5 లక్షల రూపాయలు మంజూరు చేయిస్తానని హామీ ఇచ్చారు. ఎమ్మెల్యే తూడి మేఘా రెడ్డి మాట్లాడుతూ బ్యాంకుల ద్వారా సి ఎస్ ఆర్ ఫండ్స్ తెప్పించి విద్యార్థులకు సౌకర్యాలు కల్పిస్తున్న ఎంపీకి, సైకిళ్లు అందజేస్తున్న బ్యాంక్ ఆఫ్ ఇండియాకు, ప్రత్యేక చొరవ తీసుకున్న జిల్లా కలెక్టర్ కు అభినందనలు తెలిపారు.ఇప్పటికే వనపర్తిలో యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో డిజిటల్ లైబ్రరీ, సీటీ స్కాన్ సెంటర్ ఏర్పాటు చేయడం, ఇప్పుడు దాదాపు రూ.16 లక్షల వ్యయంతో 500 మంది ప్రభుత్వ పాఠశాల అమ్మాయిలకు బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో సైకళ్ళ ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. రాబోయే రోజుల్లో వనపర్తి నియోజకవర్గంలో 8, 9, 10 తరగతిలో చదివే 6000 మంది విద్యార్థినులకు సి ఎస్ ఆర్ ద్వారా సైకిళ్లు పంపిణీ చేసే కార్యక్రమానికి కూడా చర్యలు తీసుకుంటామన్నారు. రాష్ట్ర ప్రభుత్వానికి పాఠశాలల అభివృద్ధి ప్రథమ ప్రాధాన్యత అని, సీఎం రేవంత్ రెడ్డి చదువుకున్న పాఠశాల అభివృద్ధి కోసం రూ.50 కోట్లతో అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. ఇవే కాకుండా ప్రజలకు ఉచితంగా కరెంటు, సన్న బియ్యం, ఇందిరమ్మ ఇల్లు వంటి సంక్షేమ కార్యక్రమాలతో ప్రభుత్వం అండగా నిలుస్తుందని తెలిపారు. విద్యార్థులు బాగా చదువుకొని మంచి స్థాయికి ఎదగాలని సూచించారు. జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి మాట్లాడుతూ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ ద్వారా విద్యార్థినిలకు 500 సైకిళ్లు అందజేస్తున్నందుకు ధన్యవాదాలు తెలిపారు. విద్యార్థులు ఇట్టి సైకిళ్లను సద్వినియోగపరచుకొని పాఠశాలకు ప్రయాణించడానికి వినియోగించుకోవాలన్నారు.వనపర్తికి విద్యారంగంలో మంచి పేరు ఉంది కాబట్టి వచ్చే సంవత్సరం పదో తరగతిలో విద్యార్థులు మంచి ఫలితాలు సాధించాలని ఆకాంక్షిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ మాధవి, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీనివాస్ గౌడ్, మాజీ డిసిసిబి చైర్మన్ విష్ణువర్ధన్ రెడ్డి, డీఈవో అబ్దుల్ ఘని, బ్యాంక్ ఆఫ్ ఇండియా ప్రతినిధులు, లీడ్ బ్యాంక్ మేనేజర్ శివకుమార్, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

# ఇద్దరు ప్రభుత్వ ఉద్యోగులు సస్పెండ్

**జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష**

**జీత,బిల్లుల విషయంలో నగదు డిమాండ్ చేసినట్లు ఆరోపణలు**



**పెద్దపల్లి రూరల్,ఏప్రిల్23(నినాదం) :** జిల్లా వైద్య ఆరోగ్య అధికారి డి.ఎం. హెచ్.ఓ,కార్యాలయంలో సూపరింటెండెంట్‌గా విధులు నిర్వహిస్తున్న ఎం.డి.అజీమ్ ఖాన్‌తో పాటు సీనియర్ అసిస్టెంట్ ఓ.రాము ను సస్పెండ్ చేస్తూ,జిల్లా కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు.పెద్దపల్లి జిల్లాలోని వివిధ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో పనిచేస్తున్న కొత్తగా నియమితులైన ల్యాబ్ టెక్నీషియన్ల జీతాలు ఐ.ఎఫ్.ఎం.ఎస్ పోర్టల్‌లో ప్రాసెస్ చేయడం కోసం సంబంధిత అధికారులచే నగదు డిమాండ్ చేసినట్లు ఫిర్యాదులు అందినట్లు కలెక్టర్ తెలిపారు.ఈ ఫిర్యాదులపై ప్రాథమిక విచారణ నిర్వహించగా, సూపరింటెండెంట్ ఎం.డి. అజీమ్ ఖాన్, సీనియర్ అసిస్టెంట్ ఓ.రాము జీత బిల్లులు సిద్ధం చేయడం,ప్రాసెస్ చేయడం విషయంలో అక్రమాలు, అధికార దుర్వినియోగం చేసినట్లు తేలినట్లు పేర్కొన్నారు. విచారణలో భాగంగా ల్యాబ్ టెక్నీషియన్ల నుంచి నగదు డిమాండ్ చేసినట్లు ఆరోపణలు రావడంతో పాటు, సంబంధిత వివరాల్లో అవకతవకలు గుర్తించినట్లు తెలిపారు.ఈ నేపథ్యంలో సంబంధిత అధికారులపై శాఖాపరమైన చర్యలు ప్రారంభించినట్లు కలెక్టర్ వెల్లడించారు. అందుబాటులో ఉన్న సాక్ష్యాధారాల పరిశీలన మేరకు, సూపరింటెండెంట్ ఎం.డి.అజీమ్ ఖాన్,సీనియర్ అసిస్టెంట్ ఓ.రాము ను తక్షణ ప్రభావంతో సస్పెండ్ చేస్తున్నట్లు ఉత్తర్వులు జారీ చేసినట్లు తెలిపారు. సస్పెన్షన్ కాలంలో సంబంధిత అధికారులు ముందస్తు అనుమతి లేకుండా హెడ్‌క్వార్టర్స్‌ను వీడరాదని, నిబంధనల ప్రకారం సబ్సిస్టెన్స్ అలవెన్స్ చెల్లించబడుతుందని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

# ఏప్రిల్ 26 నుండి మే 10 వరకు స్వీయ గణన,సెల్ఫ్ ఎన్యుమరేషన ప్రక్రియ

**జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష**

**నమోదు తర్వాత వచ్చే11 అంకెల ఎస్.ఈ.ఐ.డి.ని గణన సమయంలో ఎన్యుమరేటర్‌కు అందజేయాలి**



**పెద్దపల్లి రూరల్,ఏప్రిల్23 (నినాదం):** భారత ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సెన్సస్ 2027లో భాగంగా, పెద్దపల్లి జిల్లాలో స్వీయ గణన సెల్ఫ్ అన్యుమరేషన్ ప్రక్రియను ఏప్రిల్ 26,2026 నుండి మే 10,2026 వరకు నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.ఈ డిజిటల్ విధానం ద్వారా పౌరులు ఎటువంటి ఆటంకం లేకుండా,ఇంట్లోనే ఉండి ఆన్‌లైన్ ద్వారా తమ ఇంటి వివరాలను నమోదు చేసుకోవచ్చని, తద్వారా గణన ప్రక్రియ మరింత పారదర్శకంగా,ఖచ్చితంగా వేగంగా జరుగుతుందని ఆయన పేర్కొన్నారు.నిర్దేశిత ([https://se.census.gov.in] (https://se.census.gov.in)) ద్వారా వివరాలను నమోదు చేసుకున్న తర్వాత,11 అంకెల ప్రత్యేక సెల్ఫ్ ఎన్యుమరేషన్ ఐడి ఎస్.ఈ.ఐ. డి,జనరేట్ అవుతుందని,ఆ ఐడిని స్క్రీన్‌షాట్ తీసుకోవాలని లేదా నోట్ చేసుకోవాలని తెలిపారు. గణన కోసం ఎన్యుమరేటర్ ఇంటికి వచ్చినప్పుడు, సదరు ఎస్.ఈ.ఐ.డి,ని వారికి చూపడం ద్వారా ధృవీకరణ ప్రక్రియ సులభతరం అవుతుందని ఆయన వివరించారు.జిల్లా ప్రజలందరూ ఈ డిజిటల్ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని,సెన్సస్ 2027 కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ ఆ ప్రకటనలో కోరారు.

# ఆర్టీసీ కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలి

**ఎన్నికల్లో ఆర్టీసీ కార్మికులకు ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలి**

**యుఎస్ఎఫ్ఐ మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు చంద్రకాంత్**



**కుత్బుల్లాపూర్, ఏప్రిల్ 23 (నినాదం) :** ఏప్రిల్ 22 బుధవారం నుండి ఆర్టీసీ కార్మికులు చేస్తున్న సమ్మెకు పూర్తి మద్దతు ప్రకటిస్తున్నామని యు ఎస్ ఎఫ్ ఐ మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు చంద్రకాంత్ తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల ముందు ఆర్టీసీ కార్మికుల కోసం ఇచ్చిన హామీలను పూర్తిస్థాయిలో అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఏప్రిల్ 22 బుధవారం నుంచి సమ్మె జరుగుతున్నా రాష్ట్ర ప్రభుత్వం స్పందించకపోవడం ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనమని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆర్టీసీ కార్మికుల సమ్మెతో రాష్ట్రంలోని ప్రయాణికులు బస్సులు లేక అనేక ఇబ్బందులు పడుతుంటే రాష్ట్ర ప్రభుత్వ మాటలు తమకు సంబంధం లేని విధంగా ఏకపక్షంగా వ్యవహరిస్తున్న తీరును ప్రతి ఒక్కరు ఎండ కట్టాలని కోరారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం మొద్దు నిద్ర విడి ఆర్టీసీ కార్మికుల న్యాయమైన( ఎన్నికల మేనిఫెస్టోలో పొద్దుపరిచిన) డిమాండ్లను నెరవేర్చాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే వారితో చర్చలు జరిపి యధావిధిగా బస్సులు నడిచే విధంగా ప్రజలకు ఇబ్బంది కలగకుండా చూడాలని యు ఎస్ ఎఫ్ ఐ కోరారు. ఆర్టీసీ కార్మికులు జేఏసీ నేతలను చర్చలకు పిలవకుండా రాష్ట్ర ప్రభుత్వం ఆర్టీసీ కార్మికులను భయభ్రాంతులకు గురిచేస్తున్న పరిస్థితి నెలకొన్నదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ పరిస్థితి మార్చుకోకపోతే తగిన మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని హెచ్చరించారు. ఆర్టీసి ఉద్యోగులను ప్రభుత్వంలో విలీనం చేసే ప్రక్రియను వెంటనే ప్రారంభించాలి. 2021 వేతన సవరణ 30% ఫిట్మెంట్ తో అమలు చేయాలి, 2025 వేతన సవరణ అమలు చేయాలి. మహాలక్ష్మి పథకంలో ఆర్టీసీకి రాష్ట్ర ప్రభు త్వం ప్రతినెల చెల్లించవలసిన 400 కోట్లు ఆర్టీసీకి ఇవ్వాలి.ఆర్టీసీ కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలి, కారుణ్య నియామకాలను వెంటనే చేపట్టాలి. ట్రేడ్ యూనియనపై ఆంక్షలు ఎత్తివేసి, గుర్తింపు సంఘం ఎన్నికలు నిర్వహించాలి.ఆర్టీసీ ఉద్యోగులపై పనిభారాలు తగ్గించాలి, కండక్టర్ డ్రైవర్లపై కే ఎం పి ఎల్, ఈ పికే వేధింపులు మానుకోవాలి. ఎలక్ట్రిక్ బస్సులను రాష్ట్ర ప్రభుత్వమే కొని ఆర్టీసీకి ఇవ్వాలి,ఆర్టీసీ స్థలాలను ఈవీ బస్సులకు ఇవ్వరాదు. అద్దె బస్సులను, అద్దె బస్సుల డ్రైవర్లను ఆర్టీసీలో విలీనం చేసుకోవాలి, గతంలో మాదిరిగా జాతీయం చేసుకోవాలి. గ్రేటర్ హైదరాబాద్ జోన్లో పనిచేస్తున్న సిబ్బందిని కరీంనగర్ జోన్, హైదరాబాద్ జోన్లకు బలవంతగా బదిలీ చేసే ఉత్తర్వులను రద్దు చేయాలి. 2019 సమ్మె కాలంలో నమోదైన పోలీస్ కేసులను ఎత్తివేయాలి. మహిళా కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలి. రద్దీకనుగుణంగా బస్సుల సంఖ్యను పెంచాలి.అన్ని కేటగిరీలలోని ఖాళీలను భర్తీ చేయాలి.రిటైరైన ఉద్యోగుల బకాయిలను అన్నిటినీ చెల్లించాలి, చెల్లించటంతో పాటు దీర్ఘకాలిక పెండింగ్ సమస్యలను పరిష్కరించాలని యుఎస్ ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు చంద్రకాంత్ పత్రిక ప్రకటనలో వివరించారు.

# కోల బాలరాజు యాదవ్ ఆధ్వర్యంలో ర్యాలీ



**కీసర, ఏప్రిల్ 23, (నినాదం) :** భారతీయ జనతా పార్టీ కీసర మండల డివిజన్ -1 అధ్యక్షుడు కోల బాలరాజు యాదవ్, మహిళా మోర్చా అధ్యక్షురాలు శాలిని నాయకత్వంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సింగిరెడ్డి వెంకట్ రెడ్డి, అదేవిధంగా మండల ప్రధాన కార్యదర్శిడు నల్ల వెంకటరెడ్డి, అబ్రబోయిన నాగరాజ్ ముదిరాజ్, పండగ మురళి, కోల శ్రీనివాస్ యాదవ్ తో కలిసి రాష్ట్ర పార్టీ నేతృత్వంలో జరుగుతున్నటువంటి మహిళలకు 33% రిజర్వేషన్ కు వ్యతిరేకించిన కాంగ్రెస్ కు బుద్ధి చెప్పేందుకు మహిళా నాయకుల ఆధ్వర్యంలో ట్యాంక్ బండ్ పై ర్యాలీకి మద్దతుగా కీసర మండలశీ నుండి బయలుదేరడం జరిగింది.

# పుచ్చకాయ తొక్కతో అదిరిపోయే క్రిస్పీ దోసె..

## ఇలా తయారు చేస్తే లొట్టలేయాల్సిందే!

**పుచ్చకాయ ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుంది. ముఖ్యంగా వేసవిలో ఎంత తాపం నుంచి ఉపశమనం కలిగించడంలో పుచ్చకాయకు సాటి వేరొకటి లేదంటే అతిశయోక్తి కాదు. అందుకే చాలా మంది వేసవిలో పుచ్చకాయ తినడానికి ఇష్టపడతారు. కానీ మనందరం పుచ్చకాయ తిని దాని తొక్కను పారేస్తుంటాం. కానీ మీకు తెలుసా వృద్ధాగా పడేసే పుచ్చ తొక్కతో రుచికరమైన దోసెలు తయారు చేసుకోవచ్చు. ఎలాగో ఇక్కడ తెలుసుకుందాం..**

పుచ్చకాయ తొక్కతో దోసె తయారు చేయడానికి కావలసినవి.. పుచ్చకాయ తొక్క నుంచి చివరి ఆకుపచ్చ పొరను తీసివేసి మధ్యలో ఉన్న తెల్లటి పొరను తీసుకోవాలి. నానబెట్టిన బియ్యం ( బియ్యాన్ని సుమారు రెండు గంటలు నానబెట్టుకోవాలి), పచ్చిమిర్చి, అల్లం, కొబ్బరి పొడి, ఒక కప్పు నల్ల మినపప్పు తీసుకోవాలి.

ముందుగా పుచ్చకాయ తొక్కను చిన్న ముక్కలుగా కోసి పక్కన పెట్టుకోవాలి. ఇప్పుడు ఒక మిక్సింగ్ బౌల్ తీసుకుని అందులో పుచ్చకాయ తొక్క, నానబెట్టిన బియ్యం, పచ్చిమిర్చి, అల్లం, కొబ్బరి పొడి వేసి మెత్తగా గ్రైండ్ చేసుకోవాలి.

ఇప్పుడు ఈ మిశ్రమాన్ని ఓ పాత్రలోకి తీసుకుని అందులో దోసె మిశ్రమానికి సరిపడా ఉప్పు వేసి బాగా కలుపుకోవాలి. దీనిని రాత్రంతా వెచ్చని ప్రదేశంలో ఉంచాలి. ఇలా చేయడం వల్ల పిండి బాగా పులిసి, దోసె క్రిస్పీగా ఉంటుంది. ఇప్పుడు స్టవ్ ఆన్ చేసి దానిపై దోసె పాన్ వేడి చేయాలి. పాన్ కు నెయ్యి లేదా నూనె రాసి దోసె వేసుకోవాలి. ఇప్పుడు బంగారు గోధుమ రంగు వచ్చే వరకు రెండు వైపులా కాల్చుకోవాలి. అంతే రుచికరమైన పుచ్చకాయ తొక్క దోసె సిద్ధమైనట్లే మరి.

ఈ దోశను కొబ్బరి చట్నీ లేదా అల్లం చట్నీతో కలిపి తింటే రుచి అద్భుతంగా ఉంటుంది. అంతే కాకుండా ఈ దోశ వల్ల అనేక ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయని ఆరోగ్య నిపుణులు అంటున్నారు. కాబట్టి మీరు కనీసం ఒక్కసారైనా పుచ్చకాయ తొక్క దోశను ప్రయత్నించడం మర్చిపోకూడదు.





# కొత్త స్టైల్లో పాల పాయసం..

శుక్రవారం లక్ష్మీదేవికి పెడితే ఆ దోషాలన్నీ మాయం



**కొత్త స్టైల్లో పాల పాయసం రెసిపీ:**
ఒక లీటర్ పాలు, ఒక కప్పు బియ్యం, ఒక కప్పు తురిమిన బెల్లం, అర టేబుల్ స్పూన్ యాలకుల పొడి, బాదం పప్పులు, 10 జీడిపప్పు, 10 కిస్మిస్ , ఒక టేబుల్ స్పూన్ నెయ్యి , అర టేబుల్ స్పూన్ ఉప్పు, రెండు గ్లాసుల మంచి నీళ్లు, ఒక టేబుల్ స్పూన్ వెన్న, ఇంకా కుంకుమపువ్వు కూడా తీసుకోవాలి.
ఇది వేస్తే మంచి రుచి వస్తుంది.

**ముందుగా పాలను ఈ విధంగా మరిగించుకోవాలి :**
ముందుగా గ్యాస్ వెలిగించి ఒక పాన్ పెట్టి, దానిలో పాలను వేసి బాగా మరిగించాలి. అయితే, దీనిని మీడియం మంట పై మాత్రమే మరిగించాలి. అలాగే మధ్య మధ్యలో గరిటెతో తిప్పుతూ ఉండాలి. ఇలా చేస్తే అడుగు అంటకుండా ఉంటుంది. ఆ తరవాత బియ్యాన్ని కడిగి 30 నిమిషాల పాటు నానబెట్టాలి. ఒక పాత్రలో వీటిని బాగా ఉడికించాలి

**బెల్లాన్ని ఈ విధంగా కలుకోవాలి:**
బియ్యం మెత్తగా అయినా తరవాత దానిలో బెల్లం లేదా పంచదార షుగర్ వేసి మిక్స్ అయ్యేలా కలపాలి. బెల్లం వేస్తే పాయసం అద్భుతంగా ఉంటుంది. దీనిలో ఐరన్ ఎక్కువగా ఉంటుంది. ఆరోగ్యానికి కూడా చాలా మంచిది. అలాగే, మంచి సువాసను కూడా ఇస్తుంది. అలాగే దీనిలో కుంకుమపువ్వు కూడా వేయండి.

**పాల పాయసంలో డ్రైఫ్రూట్స్ కలిపితే ఆ రుచే వేరు:**
ఒక పాన్‌లో కొద్దిగా నెయ్యి చేసి 10 జీడిపప్పు, కిస్మిస్ వేసి బంగారు రంగులోకి మారే వరకు బాగా వేయించాలి. వీటిలో పాయసంలో వేస్తే టేస్ట్ కూడా మంచిగా ఉంటుంది. ఇంకా నోటికి రిచ్ ఫ్లేవర్ కూడా తగులుతుంది. ఇంకా ఇవి ఆరోగ్యానికి కూడా చాలా బలం.

**ఫైనల్ టచింగ్:**
చివర్లో యాలకుల పొడి వేస్తే టెస్ట్ మొత్తం మారిపోతుంది. ఇది వేశాక మొత్తం మిక్స్ అయ్యేలా బాగా కలుపుకోవాలి. ఆ తర్వాత స్టవ్ ఆఫ్ చేసి కిందకు దించేసి వేడి వేడిగా తినొచ్చు. ఇలా కొత్త స్టైల్లో పాల పాయసం చేసి తింటే ఇంట్లో అందరు అయ్యి ఫిదా అవుతారు. పండుగలకి కూడా ఇదే పర్ఫెక్ట్‌గా ఉంటుంది.

# కొబ్బరి బెల్లం ఉండలతో కొండంత బలం..

**మనలో చాలా మంది కొబ్బరిని ఇష్టంగా తింటారు. ఇక వాటితో చేసి లడ్డులు తింటే అస్సలు వదలరు. ఇంకా వీటిలో బెల్లం వేయడం వలన ఇవి మరింత స్వీట్‌గా అనిపిస్తాయి. అయితే, కరెక్ట్ కొలతలతో చేసి తింటే చాలా చాలా రుచిగా ఉంటాయి. మరి, ఆలస్యం దీనికి కావాల్సిన పదార్ధాలు, ఎలా తయారుచేయాలో ఇక్కడ చదివి నేర్చుకుందాం..**

కొబ్బరి బెల్లం ఉండలకు కావాల్సి పదార్థాలు: ఒక కప్పు తాజా కొబ్బరి తురుము, ఒక కప్పు బెల్లం, అర టేబుల్ స్పూన్ యాలకుల పొడి, ఒక టేబుల్ స్పూన్ నెయ్యి , ఒక టేబుల్ స్పూన్ నూనె, 10 జీడిపప్పులు, 10 కిస్మిస్ లు, 10 బాదం పప్పులు తీసుకోవాలి, ఇవన్నీ వేసి కొబ్బరి ఉండలు చేస్తే రుచికరంగా ఉంటాయి.

ముందుగా కొబ్బరి, బెల్లాన్ని ఈ విధంగా తీసుకోవాలి : ఒక పెద్ద గిన్నెను తీసుకుని దానిలో కొబ్బరిని తురుముకుని పక్కన పెట్టుకోవాలి. ఆ తరవాత దీనిలో ఒక కప్పు బెల్లం తురుమును కూడా పాకంలాగా చేసుకుని బాగా కలుపుకోవాలి. అయితే, వీటిని ఒకసారి వడకట్టాలి. ఇలా చేస్తే దానిలో ఉన్న పీచు పోతోంది.



బెల్లం పాకంలో కొబ్బరిని ఇలా కలుపుకోవాలి: బెల్లం పాకం అయ్యాక కొబ్బరి తురుము దీనిలో వేసి కలపాలి. మీడియం మంటపై దీనిని ఉంచి ఇంకా గట్టిగా అయ్యే వరకు బాగా కలుపుతూ ఉండాలి. ఇలా చేస్తే ఉండలు చేసేటప్పుడు చాలా ఈజీగా ఉంటుంది. ఆ తరవాత వీటిని కొద్ది సేపు ఫ్యాన్ కింద ఆరబెట్టుకోవాలి.



డ్రైఫ్రూట్స్ కూడా వీటిలో యాడ్ చేసుకోవాలి: ఇప్పుడు దీనిలో అర టేబుల్ స్పూన్ యాలకుల పొడి వేసి వాసన వచ్చే వరకు ఉంచాలి. వేరే పాన్‌లో కొద్దిగా నెయ్యి వేసి 10 జీడిపప్పు, 10 కిస్మిస్ కూడా దీనిలో వేయించి కలుపుకోవాలి. ఇది వేడి మీద ఉండగానే చేతికి నెయ్యి రాసుకుని ఉండలు చేసుకుని 10 నిముషాల పాటు ఉంచి తినడమే.



# వందల ఏళ్ళ నుంచి మన పెద్దవాళ్ళు వీటినే తినేవాళ్లు..

## అంతుచిక్కని రుచి.. జన్మలో ఒక్కసారైనా తినాలి

వందల ఏళ్ల నుంచి మన పెద్ద వాళ్ళు వీటినే తింటున్నారు: వట్టి తునకలు గురించి ప్రత్యేకించి చెప్పాల్సిన అవసరం లేదు. ఇది మన తెలుగు వారు ఎప్పటి నుంచో ఈ కూరను తింటున్నారు. ఇంకా మన పెద్దవాళ్లు కూడా దీనిని తప్పక చేసుకుని తింటారు. ఇది నాన్ వెజ్ ఫుడ్ మాత్రమే కాదు అంతకిమించిన రుచిని కూడా ఇస్తుంది.

ఈ వట్టితునకలు రుచే చాలా వేరు : ఈ నార్మల్ కూరలతో పోలిస్తే పూర్తిగా వేరుగా ఉంటుంది. డ్రైగా, మసాలాలు పట్టి తునకలు తినే కొద్దీ తినాలనిపిస్తుంది. స్లోగా కుక్ చేయడం వలన మసాలాలు మంచిగా పట్టి మంచి రుచిని అందిస్తుంది, అందు వలన ఇది అంత రుచి చాలా స్పెషల్‌గా మారింది.

ఈ కూరను లైఫ్ లో ఒక్కసారైనా తినాల్సిన రెసిపీ: ఒక ప్రత్యేకమైన టేస్ట్, వందల ఏళ్ల నుంచి చరిత్ర ఉన్న ఈ కూరను ప్రతి నాన్ వెజ్ లవర్ తప్పకుండా తినాలి. ఇది కేవలం టెస్ట్ కే కాదు, అయినా పాత వంటలు వండి తింటే ఆ ఫీలింగ్ వేరే లెవెల్. ఇది మంచి అనుభూతిని కూడా అందిస్తుంది. కాబట్టి అందరూ తినాలి. వట్టి తునకలు ఎలా చేస్తారంటే? వట్టి తునకలు (ఎండిన మటన్) కూర ప్రత్యేకించి చెప్పాల్సిన అవసరం లేదు. రాయలసీమలో దీన్ని బాగా తింటారు. ఇది అంత ఫేమస్. ఇది మాములు మాంసంతో కాదు చేసేది. నిల్వ ఉండే మటన్ ముక్కలతో చేసే కూర. ముఖ్యంగా, పసుపు, ఉప్పు రాసి రోజుల తరబడి మటన్ ముక్కలను ఎండలో బాగా ఎండబెడతారు.

వట్టి తునకలకు ఉల్లిపాయలు, ఒక టేబుల్ స్పూన్ అల్లం వెల్లుల్లి పేస్ట్, సరిపడినంత కారం, మాసాలాలు బాగా పట్టించి వండుతారు. అయితే, ఇది అన్ని కూరల్లాగా ఉండదు. ఇది ఉడకడానికి చాలా సమయం పడుతుంది. అలాగే, దీనిని సరైన పద్ధతిలో వండి తింటే ఏ కూరలు కూడా సరిపోవు. కాబట్టి, ఈ సారి మీ ఇంట్లో ట్రై చేయండి.



**చికెన్ అంటే పడిచచ్చే వారు చాలా మంది ఉంటారు. కొందరు స్కిన్ లెస్ చికెన్ ఇష్టపడితే, మరికొందరు గ్రిల్డ్ లేదా ఫ్రైడ్ చికెన్‌ను చర్మంతో సహా తినడానికి మొగ్గు చూపుతారు. అయితే కోడి చర్మం తినడం ఆరోగ్యానికి మంచిదేనా..? దీనివల్ల గుండెకు ఏమైనా ముప్పు ఉందా..? అనే డౌట్లు చాలా మందికి వస్తాయి. నిపుణుల అభిప్రాయం ప్రకారం.. చికెన్ చర్మంలో సంతృప్త కొవ్వు చాలా ఎక్కువగా ఉంటుంది. ఇది శరీరానికి మేలు చేసే కొవ్వు కాదు. మీరు రెగ్యులర్‌గా చికెన్‌ను చర్మంతో సహా తింటే ఆ కొవ్వు మీ రక్తంలో చేరి అనారోగ్య సమస్యలకు దారితీస్తుంది.**



**గుండె జబ్బుల ముప్పు**



కోడి చర్మంలో ఉండే అధిక కొవ్వు రక్తంలో చెడు కొలెస్ట్రాల్ స్థాయిని పెంచుతుంది. ఈ కొవ్వు రక్తనాళాలలో పేరుకుపోవడం వల్ల రక్త ప్రసరణకు ఆటంకం కలుగుతుంది. దీనివల్ల గుండెపోటు వచ్చే ప్రమాదం ఉంది. పక్షవాతం వచ్చే అవకాశం పెరుగుతుంది. రక్తపోటు నియంత్రణ తప్పుతుంది. ముఖ్యంగా ఇప్పటికే గుండె సమస్యలు లేదా అధిక కొలెస్ట్రాల్ ఉన్నవారు దీనికి దూరంగా ఉండటమే శ్రేయస్కరం.

**ఊబకాయం- ఇతర సమస్యలు**

చికెన్ చర్మంలో క్యాలరీలు చాలా ఎక్కువగా ఉంటాయి. ముఖ్యంగా ఫాస్ట్ ఫుడ్ సెంటర్లలో దొరికే డీప్ ఫ్రైడ్ చికెన్ చర్మం ఎక్కువ నూనెను పీల్చుకుంటుంది. దీనివల్ల వేగంగా బరువు పెరుగుతారు. అధిక బరువు వల్ల టైప్-2 డయాబెటిస్ వచ్చే ఛాన్స్ ఉంది. థైరాయిడ్, ఆర్థరైటిస్ వంటి సమస్యలు కూడా తలెత్తవచ్చు.

**ఎప్పుడు తినాలి..?**

చికెన్ చర్మం పూర్తిగా విషం ఏమీ కాదు. దీనిపై కొన్ని నియమాలు ఉన్నాయి.. రెండు మూడు నెలలకు ఒకసారి కాల్చిన లేదా బేక్ చేసిన చికెన్ చర్మాన్ని రుచి చూడటంలో పెద్ద ప్రమాదం లేదు. వారం వారం చికెన్ చర్మం తినే అలవాటు ఉంటే వెంటనే మానుకోవాలి. అంతేకాకుండా చిన్న పిల్లలు, వృద్ధులు మరియు ఏదైనా అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న వారు చికెన్ స్కిన్ తినకుండా ఉండటమే ఉత్తమం. రుచి కంటే ఆరోగ్యమే ముఖ్యం. చికెన్ వండుకునేటప్పుడు చర్మం తొలగించడం వల్ల మీరు అధిక క్యాలరీలను, కొవ్వును తగ్గించుకోవచ్చు.



# రెండో రోజూ భారీ నష్టాల్లో ముగిసిన సూచీలు



**ముంబయి:** దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు వరుసగా రెండో రోజూ భారీ నష్టాలు చవిచూశాయి. ఇరాన్-అమెరికా మధ్య చర్చలపై నీలినీడలు కమ్ముకోవడం, హర్మూజ్ వద్ద దిగ్బంధనం కొనసాగుతుండడం సెంటిమెంట్‌ను దెబ్బతీసింది. చమురు ధర బ్యారెల్ మళ్లీ 100 డాలర్ల ఎగువకు చేరడం సూచీలపై ప్రతికూల ప్రభావం చూపింది. దీంతో సెన్సెక్స్ 850 పాయింట్లకు పైగా నష్టపోగా.. నిఫ్టీ 24,200 దిగువన ముగిసింది. సెన్సెక్స్ ఉదయం 77,983.66 పాయింట్ల వద్ద (క్రితం ముగింపు 78,516.49) నష్టాల్లో ప్రారంభమై.. రోజంతా అదే బాటలో పయనించింది. ఇంట్రాడేలో 77,574.18 పాయింట్ల వద్ద కనిష్ఠాన్ని తాకిన సూచీ.. చివరికి 852.49 పాయింట్ల నష్టంతో 77,664.00 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 205.05 పాయింట్ల నష్టంతో 24,173.05 వద్ద ముగిసింది. డాలరుతో రూపాయి మారకం విలువ మళ్లీ 94 మార్కు దాటి 94.10కు చేరింది. సెన్సెక్స్ 30 సూచీలో ట్రెంట్, బజాజ్ ఫిన్‌సర్వ్, టెక్ మహీంద్రా, మహీంద్రా అండ్ మహీంద్రా, ఇన్ఫోసిస్ స్టాక్స్ ప్రధానంగా నష్టపోయాయి. అదానీ పోర్ట్స్, ఎల్‌అండ్‌టీ, సన్‌ఫార్మా, భారతీ ఎయిర్‌టెల్, బీఈఎల్ మాత్రమే లాభపడ్డాయి. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 103 డాలర్ల వద్ద కొనసాగుతుండగా.. బంగారం 4688 డాలర్ల వద్ద ట్రేడవుతోంది.

# భారత్ సమయం ఆసన్నమైంది..

## నీతా అంబానీ



**న్యూయార్క్:** భారత్ సమయం అసన్నమైందని రిలయన్స్ ఫౌండేషన్ ఛైర్‌పర్సన్ నీతా అంబానీ అన్నారు. న్యూయార్క్‌లో టైమ్ మ్యాగజైన్ నిర్వహించిన టైమ్ 100 సమిట్‌లో పాల్గొన్న సందర్భంగా ఆమె ఈ వ్యాఖ్యలు చేశారు. టైమ్ మ్యాగజైన్ సీఈఓ జెస్సికా సిబ్లీతో జరిగిన ఇంటర్వ్యూలో నాయకత్వం అంశంపై నీతా మాట్లాడుతూ.. ప్రపంచానికి హార్డ్‌పవర్ అక్కర్లేదని, అది సాఫ్ట్ పవర్‌ను కోరుకుంటోందన్నారు. ఆ సాఫ్ట్ పవర్‌కు భారత్ ప్రతినిధిగా ఉందని పేర్కొన్నారు. పూర్తి ఇంటర్వ్యూ త్వరలో ప్రసారం కానుంది. ఈ లీడర్ షిప్ సమ్మిట్‌కు భారత సంప్రదాయ దుస్తుల్లో నీతా అంబానీ హాజరయ్యారు. భారత కళా వైభవాన్ని చాటి చెప్పేలా 'జమ్దానీ' చీరను ధరించారు. పశ్చిమ బెంగాల్‌కు చెందిన పద్మశ్రీ అవార్డు గ్రహీత బీరేన్ కుమార్ బాసక్ రెండేళ్లు కష్టపడి దీన్ని రూపొందించారు.

నినాదం మార్కెట్



# ప్రతీ ఏడాది మీ అకౌంట్లోకి రూ.60 వేలు..!

## కేంద్ర ప్రభుత్వం అదిరిపోయే స్కీమ్.. వీరందరికీ వర్తింపు..

ప్రభుత్వ ఉద్యోగులకు రిటైర్మెంట్ తర్వాత పెన్షన్ అందుతుంది. అదే ప్రైవేట్ ఉద్యోగులకు ఈపీఎఫ్‌వో ద్వారా 60 ఏళ్ల తర్వాత నెలనెలా పెన్షన్ వస్తుంది. ఈపీఎఫ్‌వో సౌకర్యం లేనివారికి రిటైర్మెంట్ తర్వాత ఎలాంటి పెన్షన్ ప్రయోజనాలు ఉండవు.

అంతేకాకుండా వివిధ రంగాల్లో పనిచేసేవారికి పీఎఫ్ సౌకర్యం అనేది ఉండదు. ఈ క్రమంలో అసంఘటిత రంగంలో పనిచేసేవారి కోసం కేంద్ర ప్రభుత్వం అటల్ పెన్షన్ యోజన పథకాన్ని తీసుకొచ్చింది. ఈ పథకంలో కొంతమొత్తంలో ప్రీమియం చెల్లిస్తే.. 60 ఏళ్ల తర్వాత పెన్షన్ పొందవచ్చు. ఈ పథకంలో ఎవరెవరు చేరవచ్చు..? ఎంత పింఛన్ వస్తుంది? అనే విషయాలు చూద్దాం.

**ఏడాదికి రూ.60 వేలు**
2015లో అటల్ పెన్షన్ యోజన పథకాన్ని కేంద్ర ప్రభుత్వం ప్రారంభించింది. 18 నుంచి 40 ఏళ్ల మధ్య వయస్సు ఉన్నవారు ఇందులో చేరేందుకు అర్హులు. 60 ఏళ్లు వచ్చేంతవరకు కొంత మొత్తంలో ప్రీమియం చెల్లిస్తే.. అందుకు సమానంగా ప్రభుత్వం మరికొంత చెల్లిస్తుంది. 60 ఏళ్ల తర్వాత మీకు నెలనెలా పెన్షన్ వస్తుంది. మీ చెల్లించే ప్రీమియంను బట్టి రూ.వెయ్యి నుంచి రూ.5 వేల వరకు పెన్షన్ పొందవచ్చు. అంటే ఏడాదికి రూ.12 వేల నుంచి రూ.60 వేల వరకు పొందవచ్చు. మీకు రూ.5 వేల పెన్షన్ కావాలంటే ప్రీమియం ఎక్కువ చెల్లించాల్సి ఉంటుంది. అదే రూ.వెయ్యి కావాలంటే తక్కువ మొత్తంలో ఉంటుంది. ఇక మీ వయస్సును బట్టి కూడా ప్రీమియం మారుతూ ఉంటుది. చిన్న వయస్సులో చేరితే ప్రీమియం తక్కువగా ఉంటుంది. వయస్సు పెరిగే కొద్ది చేరితో ప్రీమియం ఎక్కువగా ఉంటుంది. మీ సమీపంలోని ఏదైనా బ్యాంక్‌కు వెళ్లి ఈ పథకంలో చేరవచ్చు. లేదా పోస్టాఫీస్ ద్వారా అయినా చేరవచ్చు. ప్రీమియం మీ అకౌంట్ నుంచి ఆటోమేటిక్‌గా డెబిట్ అవుతుంది. అలాగే 60 ఏళ్ల తర్వాత మీ అకౌంట్లోనే నెలనెలా పెన్షన్ జమ అవుతుంది.



60 ఏళ్ల తర్వాత మరణిస్తే..
ఒకవేళ పథకంలో చేరిన వ్యక్తి 60 ఏళ్ల తర్వాత మరణిస్తే జీవిత భాగస్వామికి ప్రతీ నెలా పెన్షన్ లభిస్తుంది. జీవిత భాగస్వామి మరణించేంత వరకు పెన్షన్ వస్తుంది. 2025-26 ఆర్థిక సంవత్సరంలో 13.5 మిలియన్ల మంది కొత్తగా అటల్ పెన్షన్ యోజనలో చేరారు. 2026 ఏప్రిల్ 21 నాటికి 9 కోట్ల మందికి చేరుకోగా.. ఇది ఒక చారిత్రాత్మక మైలురాయిగా నిలిచింది. పెన్షన్ ఫండ్ రెగ్యులేటరీ అండ్ డెవలప్‌మెంట్ అథారిటీ ఈ పథకాన్ని నిర్వహిస్తోంది. ఈ పథకం ద్వారా రిటైర్మెంట్ తర్వాత ఆర్థిక భరోసా అసంఘటిత రంగంలో పనిచేసే కార్మికులకు లభిస్తుంది.

# పట్టుదలకు రాజశ్రీ భగీథ ఆదర్శనీయులు

## జిల్లా కలెక్టర్ దీపక్ తివారి



**వికారాబాద్, ఏప్రిల్ 23(నినాదం) :** మహాజ్ఞాని పరోపకారిగా ఖ్యాతి గాంచిన రాజశ్రీ భగీరథ పట్టుదలకు అనుకున్నది సాధించుటకు మారు పేరని జిల్లా కలెక్టర్ దీపక్ తివారి అన్నారు. గురువారం జిల్లా కలెక్టర్ సమావేశమందిరంలో రాజశ్రీ భగీరథుని జయంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రాజశ్రీ భగీరథ చిత్రపటానికి పూలమాల వేసి నివాళ్ళు అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అనుకున్నది సాధించే పట్టుదల వెనకడుగు వేయని పంతం భగీరథ స్వంత మణి అన్నారు. ఆయన ఆశయాలను అనుసరించాలని సూచించారు. పట్టుదలకు మారుపేరుగా ఆయనను కీర్తిస్తుంటారని చెప్పారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ ఉమా శంకర్ ప్రసాద్, డిపివో జయసుధ, డి డబ్ల్యూవో కృష్ణవేణి, డి పీ ఆర్వో చెన్నమ్మ, తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

# విఘ్నాలను తొలగించి విజయం చేకూర్చే దైవం విజయ గణపతి

## బిఆర్ఎస్ ఎల్పి విప్, ఎమ్మెల్యే కేపీ. వివేకానంద్



**కుత్బుల్లాపూర్, ఏప్రిల్ 23 (నినాదం) :** కుత్బుల్లాపూర్ నియోజకవర్గం 132 – జీడిమెట్ల డివిజన్ న్యూ వివేకానంద నగర్ లో నూతనంగా నిర్మించిన విజయ గణపతి దేవాలయంలో స్వామి వారి విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమానికి బిఆర్ఎస్ ఎల్పి విప్, ఎమ్మెల్యే కేపీ. వివేకానంద్ ముఖ్యఅతిథిగా హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ విఘ్నాలను తొలగించి విజయం చేకూర్చే దైవం విజయ గణపతి అని అన్నారు. స్వామి వారి కరుణా కటాక్షాలు భక్తులందరిపై ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు ఎస్. దాస్ గౌడ్, కె. బుచ్చి రెడ్డి, బి. ఆర్. విశాల్, ఆర్. అనిల్ కుమార్, బిఆర్ఎస్ పార్టీ జీడిమెట్ల డివిజన్ సమన్వయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇండ్లను ప్రారంభించిన ఎంపీడీవో. రఫిక్ కునిస





**కొల్చారం ఏప్రిల్ 23 (నినాదం) :** మెదక్ జిల్లా కొల్చారం మండలం వెంకటాపూర్ గ్రామంలో నూతనంగా నిర్మించిన ఇందిరమ్మ ఇండ్లను రిబ్బన కట్ చేసి ప్రారంభించిన కొల్చారం ఎంపీడీవో రఫిక్ కునిస బేగం సర్పంచ్ కన్నబోయిన సుజాత శేకులు అనంతరం ఎంపీడీవో మాట్లాడుతూ గత సంవత్సరంలో ఇందిరమ్మ ఇండ్లకు ప్రోసిడింగ్ ఇచ్చిన ఏడు మంది లబ్ధిదారులు గవర్నమెంట్ పెట్టిన నిబంధనల ప్రకారం పూర్తి చేసుకుని గృహప్రవేశాలు చేయడం సంతోషంగా ఉందని అన్నారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కన్నబోయిన సుజాత షేకులు ఉప సర్పంచ్ సత్యనారాయణ పంచాయతీ సెక్రెటరీ సంధ్య హౌసింగ్ ఏఈ సుష్మ వార్డ్ మెంబర్ లు లబ్ధిదారులు గంగాయాలా భారతమ్మ శామయ్య పెద్దోళ్ల శేకమ్మ పెద్దోళ్ల జ్యోతి అశోక్ షేకులు శేకమ్మ గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# పుప్పాలగూడలో వైభవంగా శ్రీ కోదండ రామచంద్ర స్వామి ఆలయ ప్రతిష్ఠా





**రాజేంద్రనగర్,ఏప్రిల్ 23 (నినాదం):** ఉప్పలగుడలో వైభవంగా శ్రీ కోదండ రామచంద్రస్వామి ఆలయ ప్రతిష్టాపన మై హోం అవతార్ రోడ్, హాల్‌మార్క్ విసినియా ఎదురుగా ఉన్న సంకట హరణ శ్రీ హనుమాన్ దేవస్థానం ప్రాంగణంలో నూతనంగా నిర్మించిన శ్రీ సీతా లక్ష్మణ హనుమత్సమేత శ్రీ కోదండ రామచంద్ర స్వామి ఆలయ మహోత్సవాలు భక్తుల కోలాహలం నడుమ అత్యంత వైభవంగా కొనసాగుతున్నాయి. మూడు రోజుల పాటు నిర్వహించే ఈ ఉత్సవాల్లో భాగంగా మూడవ రోజైన గురువారం ఉదయం నుంచే ఆలయంలో వేద మంత్రోచ్చారణలు మారుమోగాయి. చతుస్థానార్చన, బింబోత్థాపన, రత్న విన్యాస హవనాలు, మహాపూర్ణాహుతి కార్యక్రమాలను అర్చకులు వైభవంగా నిర్వహించారు.అష్టధాతు, లోహ, ధాన్య, రత్న విన్యాస యంత్ర ప్రతిష్ఠాపనతో పాటు ధ్రువమూర్తి, ఉత్సవమూర్తులు, శిఖర, ధ్వజస్తంభ ప్రతిష్ఠాపనలు భక్తిశ్రద్ధలతో జరిగాయి. అనంతరం మహాకుంభప్రోక్షణం, దిష్టికుంభ దర్శనం, ప్రథమారాధన, శాస్త్రకళ్యాణం, ఋత్విక్ సన్మానాలు మహదాశీర్వచనం కార్యక్రమాలు నిర్వహించారు. ఈ ఆధ్యాత్మిక మహోత్సవానికి రాజకీయ, అధికారిక రంగాలకు చెందిన పలువురు ప్రముఖులు విచ్చేసి స్వామివారిని దర్శించుకున్నారు. మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ, చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు రామచంద్రరావు, హైడ్రా కమిషనర్ రంగనాథ్, వీరితో పాటు తోకల శ్రీనివాస్ రెడ్డి, కస్తూరి నరేంద్ర, నరేంద్ర రెడ్డి, జితేంద్ర, తలారి మల్లేష్, కోట వేణుగౌడ్, అశోక్ యాదవ్, స్వామి గౌడ్, కృష్ణమోహన్ రెడ్డి తదితరులు స్వామివారి ఆశీస్సులు అందుకున్న వారిలో ఉన్నారు. ఏప్రిల్ 21 నుంచి 24 వరకు ప్రతిరోజూ భక్తులకు అన్నప్రసాద వితరణ జరుగుతోంది. ముఖ్యంగా గురువారం (ఏప్రిల్ 23) నిర్వహించిన అఖండ అన్నదాన కార్యక్రమంలో వేలాది మంది భక్తులు పాల్గొన్నారు.

# తెలంగాణ రాష్ట్ర బీసీ యువజన సంఘం ఉపాధ్యక్షుడిగా జనుముల ప్రశాంత్ ముదిరాజ్

## నియామక పత్రం అందజేసిన రాజ్యసభ సభ్యులు, జాతీయ బీసీ అధ్యక్షులు ఆర్ కృష్ణయ్య



**కుత్బుల్లాపూర్, ఏప్రిల్ 23 (నినాదం) :** తెలంగాణ రాష్ట్ర బీసీ యువజన సంఘం ఉపాధ్యక్షులుగా సుభాష్ నగర్ డివిజన్ సూరారంకు చెందిన జనుముల ప్రశాంత్ ముదిరాజును నియమించారు. గురువారం బీసీ జాతీయ అధ్యక్షులు రాజ్యసభ సభ్యులు ఆర్ కృష్ణయ్య జనుముల ప్రశాంత్ ముదిరాజుకు నియామక పత్రాన్ని అందజేశారు. బీసీల అభ్యున్నతి కోసం బీసీ విద్యార్థులు, యువజన సంక్షేమం కోసం నిరంతరం పాటుపడాలని బీసీ జాతీయ అధ్యక్షులు ఆర్ కృష్ణయ్య ప్రశాంత్ ముదిరాజ్ సూచించారు. అనంతరం రాష్ట్ర యువజన ఉపాధ్యక్షులుగా నియామకం కాబడిన ప్రశాంత ముదిరాజ్ మాట్లాడుతూ జాతీయ అధ్యక్షులు ఆర్ కృష్ణయ్య తనపై నమ్మకంతో రాష్ట్ర ఉపాధ్యక్షులుగా నియమించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. జాతీయ కమిటీ తనపై నమ్మకంతో పెట్టిన బాధ్యతను మరింత బాధ్యతగా విధులు నిర్వహిస్తానని పేర్కొన్నారు. యువతకు, విద్యార్థులకు అండగా నిలబడి ఉంటానని ప్రకటనలో వివరించారు. ఈ కార్యక్రమంలో వినోద్,వంశీ,వెంకట్,శ్రవణ్ తదితరులు పాల్గొన్నారు.

# మౌలిక వసతులను మరింత అభివృద్ధి చేస్తాం

## బిఆర్ఎస్ ఎల్పి విప్, ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్





**కుత్బుల్లాపూర్, ఏప్రిల్ 23 (నినాదం) :** కుత్బుల్లాపూర్ నియోజకవర్గం 126– జగద్గిరిగుట్ట డివిజన్ వాంబే హౌస్ కాలనీలో బిఆంఎస్ ఎల్పి విప్, ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్ అధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో పర్యటించారు. ఈ సందర్భంగా కాలనీలోని భూగర్భ డ్రైనేజీ, త్రాగునీటి సరఫరా సామర్థ్యాన్ని పెంపొందించడంతోపాటు నూతన వీధి దీపాలు ఏర్పాటుచేసి అంతర్గత సిసి రోడ్లను నిర్మించాలని స్థానికులు ఎమ్మెల్యే కు విన్నవించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వాంబే హౌస్ కాలనీలో ఇప్పటికే అన్ని రకాల మౌలిక వసతులు కల్పించామన్నారు. పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా మౌలిక వసతులను అభివృద్ధి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని రానున్న రోజుల్లో బాంబే హౌస్ కాలనీలో మౌలిక వసతులను మరింత అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో బాంబే హౌస్ కాలనీ అధ్యక్షులు మురళి, ప్రధాన కార్యదర్శి, మౌనిక, మాజీ కార్పొరేటర్ జగన్, డివిజన్ అధ్యక్షులు రుద్రా అశోక్, శ్రీ వెంకటేశ్వర దేవస్థానం మాజీ చైర్మన్ వేణు యాదవ్, సీనియర్ నాయకులు బాబు గౌడ్, పాపులు గౌడ్, విటల్, దాసు, మల్లేష్ గౌడ్, శశిధర్ ముదిరాజ్, ప్రభాకర్, మెట్ల శీను, సాయి తేజ, గోపాల్, మహేందర్, నాని, ముంతాజ్, అంజి, భూపతి రెడ్డి, త్రివేణి, తదితరులు పాల్గొన్నారు.

## మోడీపై మల్లికార్జున ఖర్గే వ్యాఖ్యలు సరికాదు



**చేగుంట , ఏప్రిల్ 23 (నినాదం):** నూతనంగా ఏర్పడ్డ మాసాయిపేట మండల కేంద్రంలో జాతీయ రహదారి హైవే పక్కన అంబేద్కర్ విగ్రహం వద్ద సర్వీస్ రోడ్డులో నిరసన చేపట్టిన బిజెపి నాయకులు ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రధానమంత్రి నరేంద్ర మోడీపై కాంగ్రెస్ నాయకుడు మల్లికార్జున ఖర్గే వ్యాఖ్యలు సరికాదని, మాసాయిపేట బిజెపి మండల అధ్యక్షుడు ములుగు నాగేందర్ రెడ్డి హెచ్చరించారు. అందుకు నిరసనగా మాసాయిపేట మండల అధ్యక్షుడు మొలుగు నాగేందర్ రెడ్డి ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. దేశంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు, ఉగ్రవాదులను పెంచి పోషించిన పార్టీ కాంగ్రెస్ పార్టీ అని, కానీ, ఈరోజు నరేంద్ర మోడీని పట్టుకొని టెర్రరిస్టు అనడం సిగ్గుచేటు అన్నారు. దేశంలో ఎక్కడ టెర్రరిస్ట్ దాడులు జరిగినా మొట్టమొదట స్పందించేది, టెర్రరిస్టు లను ఏరివేసేది నరేంద్ర మోడీ ప్రభుత్వం అని అన్నారు. దేశం కోసం పనిచేస్తున్న నరేంద్ర మోడీకి, మల్లికార్జున ఖర్గే వెంటనే క్షమాపణలు చెప్పాలని బీజేపీ తరపున డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బిజెపి మాసాయిపేట మండలం ఇంచార్జ్ పార్టీ నాయకులు ఒంటేరు శ్రీనివాస్ రెడ్డి, నవీన్ యాదవ్, శ్రీకాంత్, విఠల్, లింగం నాయక్, తరుణ్ నాయుడు, సీనియర్ నాయకులు సాయిలు, ముక్కా యాదగిరి, ఆరిఫ్ , కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## యూత్ కాంగ్రెస్ కార్యదర్శుల నియామకం



**వికారాబాద్, ఏప్రిల్ 23(నినాదం) :** కాంగ్రెస్ పార్టీ వికారాబాద్ జిల్లా యూత్ కాంగ్రెస్ జిల్లా కార్యదర్శులుగా నియమిస్తూ రాష్ట్ర అధ్యక్షుడు జెక్కిడి శివచరణ్ రెడ్డి గురువారం శ్రీకాంత్ నాయక్, రఘువర్ధన్ రెడ్డి లకు నియామక పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పార్టీ బలోపేతానికి కృషి చేయనున్నట్లు చెప్పారు. తమను ప్రోత్సహించిన స్పీకర్ ప్రసాద్ కుమార్, యువజన కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి సతీష్ గౌడ్, జిల్లా అధ్యక్షుడు సతీష్ రెడ్డి కి వారు కృతజ్ఞతలు తెలిపారు.

## వేసవి సెలవుల నిబంధనలు పాటించాలి

### విద్యార్థుల ప్రాణాలతో చెలగాటం సముచితం కాదు

### ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు తేజ



**వికారాబాద్, ఏప్రిల్ 23(నినాదం):** నేటి నుండ విద్యార్థులకు వేసవి సెలవులు ప్రారంభమైన నేపథ్యంలో సెలవుల సమయంలో పాఠశాలలను తెరవడం విద్యార్థుల ఆరోగ్యం, హక్కులకు విరుద్ధమని వికారాబాద్ జిల్లా ఎస్ ఎఫ్ ఐ జిల్లా ఉపాధ్యక్షుడు తేజ గురువారం ఒక ప్రకటన లో తెలిపారు. తీవ్రమైన ఎండల పరిస్థితుల్లో విద్యార్థులను పాఠశాలకు రప్పించడం అనేది బాధ్యతారాహిత్యమని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన సమ్మర్ సెలవులను గౌర వించకుండా కొన్ని ప్రైవేట్, ప్రభుత్వ పాఠశాలలు క్లాసులు నిర్వహించడం ఖండనీయమని అన్నారు. అధిక ఉష్ణోగ్రతల వల్ల హీట్ స్ట్రోక్ వంటి ప్రమాదాలు ఏర్పడే అవకాశం ఉందని చెప్పారు. పిల్లల శారీరక, మానసిక ఆరోగ్యాన్ని పరిగణలోకి తీసుకోవాలని అన్నారు. సమ్మర్ హాలిడేస్ సమయంలో స్కూల్స్ ఓపెన్ చేసిన యాజమాన్యాలపై తక్షణ చర్యలు తీసుకో వాలన్నారు. అన్ని పాఠశాలలు ప్రభుత్వ ఆదేశాలను ఖచ్చితంగా పాటించాలని అన్నారు. విద్యార్థుల ఆరోగ్య భద్రతకు ప్రాధాన్యత ఇవ్వాలనారు. నిబంధనలు ఉల్లంఘించే సంస్థలపై కఠినమైన శిక్షలు విధించాలని కోరారు. ఈ విషయంపై వెంటనే చర్యలు తీసుకోని పక్షంలో విద్యార్థి సమాఖ్య భారీ స్థాయిలో ఆందోళనలు చేపడుతుందని హెచ్చరించారు.

# పేదల పెన్నిధి.. బలహీన వర్గాల ఆశాజ్యోతి కేఎల్ఆర్

జవహర్ నగర్ లో ఘనంగా కేఎల్ఆర్ జన్మదిన వేడుకలు.

జవహర్ నగర్ ముస్లిం కమిటీ కార్యదర్శి టీ.కాలేశా





**జవహర్ నగర్, ఏప్రిల్ 23 (నినాదం):** పేదల పెన్నిధి, బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి మహేశ్వరం నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి కిచ్చన్న గారి లక్ష్మారెడ్డి యేఅని జవహర్ నగర్ ముస్లిం వెల్ఫేర్ కమిటీ కార్యదర్శి కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు టీ. కాలేశా అన్నారు. మేడ్చల్ నియో జకవర్గం మాజీ శాసనసభ్యులు ప్రస్తుత మహే శ్వరం నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి కిచ్చన్న గారి లక్ష్మారెడ్డి 70వ జన్మదినోత్సవం సందర్భంగా మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని కీసర సర్కిల్ జవహర్ నగర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు టీ. కాలేశా ఆధ్వర్యంలో సుక్కమ్మ బస్తీలో కేఎల్ఆర్ జన్మదిన వేడుకలు కాలేశా నివాసంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కాలేషా మాట్లాడుతూ మృదుస్వభావి, స్నేహశీలి, పీడత వర్గాల ఆశాజ్యోతి, కేఎల్ఆర్ అని కష్టించే వారికే తినే హక్కు ఉంటుందని కేఎల్ఆర్ ఆలోచనలకు అభిమానిగా మారానన్నారు. ప్రతి సంవత్సరం క్రమం తప్పకుండా కేఎల్ఆర్ పుట్టినరోజున కుటుంబ సభ్యులతో ఆయన పుట్టినరోజు వేడుకలు జరుపుకోవాలని ఆనవాయితీగా మారిందని తెలిపారు. కేఎల్ఆర్ మరెన్నో పుట్టినరోజులు జరుపుకోవాలని ఆయన రాజకీయంగా మరింత ఎత్తుకు ఎదగాలని కోరారు. మానసికంగా శారీరకంగా దృఢంగా ఉండేటట్లు ప్రజల ఆదర అభిమానాలు వారి ఆశీస్సులు ఎల్లవేళలా ఉండాలని కోరుకుంటున్నానని తెలిపారు. ఈ సందర్భంగా బస్తీలోని పిల్లలకు పండ్లు ఫలహారాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బస్తీ నివాసులతోపాటు పెద్దలు చిన్నపిల్లలు కుటుంబ సభ్యులు షేక్ మత్తుజ, హైదర్, షేక్ అజ్మతుల్, హైదర్, ఫాతిమా, సమీనా, సమరీన్, జుబేరియా, ధన్విక, నిషి రేవతి, అభిషేక్, అక్షిత, తదితరులు పాల్గొన్నారు.

# దుబ్బాకలో ఆర్టీసీ కార్మికుల నిరసనకు ఎంపీ సంఘీభావం



**దుబ్బాక: ఏప్రిల్ 23 (నినాదం) :** మాజీ సీఎం కేసీఆర్ తరహాలోనే సీఎం రేవంత్ రెడ్డి పాలన కొనసాగుతోందని మెదక్ ఎంపీ మాధవనేని రఘునందన్ రావు విమర్శించారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ గురువారం దుబ్బాక ఆర్టీసీ డిపో ఎదుట నిరసన చేపట్టిన ఆర్టీసీ కార్మికులకు ఆయన సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వ విధానాలు కార్మికుల పరిస్థితిని "పెనం నుంచి పొయ్యిలో పడినట్లుగా" మార్చాయని అన్నారు. తమ హక్కుల కోసం సమ్మె చేస్తున్న కార్మికులను ప్రభుత్వం బెదిరిస్తోందని, వారికి మద్దతు తెలిపే ప్రతిపక్షాలపై కేసులు పెట్టే ప్రయత్నం జరుగుతోందని ఆరోపించారు. ధర్నాలు, నిరసనలు తెలిపే హక్కు భారత రాజ్యాంగం కల్పించినదేనని గుర్తుచేశారు. మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం అమలు చేస్తున్నప్పటికీ, కార్మికులు ఓపికతో పని చేస్తున్నారని, అయితే ప్రభుత్వం వారిపై అదనపు భారం మోపుతోందని విమర్శించారు. సీఎం సభలకు జనాన్ని తరలించడంలో ఆర్టీసీ కార్మికుల పాత్రను ప్రభుత్వం మరిచిపోయిందన్నారు. గతంలో సీఎం కేసీఆర్ కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తిస్తామని హామీ ఇచ్చి అమలు చేయలేదని, ప్రస్తుత ప్రభుత్వం కూడా అదే దారిలో నడుస్తోందని ఎద్దేవా చేశారు. ఆర్టీసీ కార్మికుల న్యాయమైన డిమాండ్లకు బీజేపీ అండగా ఉంటుందని తెలిపారు. సమస్యలు పరిష్కారం అయ్యే వరకు శాంతియుతంగా నిరసన కొనసాగించాలని కార్మికులను కోరారు.

# రాజేంద్రనగర్‌లో ఆర్టీసీ కార్మికుల సమ్మె రెండో రోజు కొనసాగింపు

## బస్సులు డిపోకే పరిమితం



**రాజేంద్రనగర్ ఏప్రిల్ 23( నినాదం):** ఆర్టీసీ కార్మికుల సమ్మె రెండో రోజు కూడా కొనసాగుతూ, రాజేంద్రనగర్ ప్రాంతంలో రవాణా సేవలు తీవ్రంగా ప్రభావితమయ్యాయి. సమ్మె ప్రభావంతో రాజేంద్రనగర్ డిపోకు చెందిన బస్సులు డిపోకే పరిమితమై ఉండటంతో, రోజువారీ ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా ఉద్యోగులు, విద్యార్థులు, అత్యవసర పనుల కోసం ప్రయాణించాల్సిన ప్రజలు ప్రత్యామ్నాయ రవాణా మార్గాల కోసం తంటాలు పడుతున్నారు. తమ న్యాయమైన డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని కోరుతూ ఆర్టీసీ కార్మికులు రాజేంద్రనగర్ డిపో ఎదుట ధర్నాకు దిగారు. కార్మికులు తమ హక్కుల సాధన కోసం ఐక్యంగా పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు. ప్రభుత్వం తమ సమస్యలను పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తూ, త్వరితగతిన చర్చలు జరిపి పరిష్కారం చూపాలని డిమాండ్ చేశారు.ఈ ధర్నాకు మద్దతుగా ఆర్టీసీ యూనియన్ నాయకుడు అశ్వద్ధామ రెడ్డి రాజేంద్రనగర్ డిపోకు చేరుకొని కార్మికులకు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికుల డిమాండ్లు న్యాయసమ్మతమైనవేనని, ప్రభుత్వం వెంటనే స్పందించి సమస్యలను పరిష్కరించాలని కోరారు. అవసరమైతే ఆందోళనను మరింత తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. సమ్మె కొనసాగుతున్న నేపథ్యంలో రవాణా సేవలు పూర్తిగా నిలిచిపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రభుత్వం త్వరగా జోక్యం చేసుకొని సమస్యకు పరిష్కారం చూపాలని ప్రజలు కోరుతున్నారు.

# మహిళల భద్రత సామాజిక బాధ్యత

## పరిశోధనాంశాలను వివరించిన సైకాలజీ అధ్యాపకురాలు డాక్టర్ అఫ్రిన్ వసీం



**పటాన్చెరు, ఏప్రిల్ 23 (నినాదం) :** మహిళలు భయం లేకుండా స్వేచ్ఛగా జీవించగల వాతావరణాన్ని సృష్టించడానికి సామూహికంగా బాధ్యత వహించాలని గీతంలోని అప్లైడ్ సైకాలజీ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ అఫ్రీన్ వసీం అభిప్రాయపడ్డారు. గీతం స్కూల్ ఆఫ్ హ్యుమానిటీస్ అండ్ సోషల్ సైన్సెస్ (జీఎస్ హెచ్ఎస్) 'పరిశోధన చర్చల' శ్రేణిలో భాగంగా ఐదవ సెమినార్ ను గురువారం నిర్వహించింది. భయంలో జీవించడం: భారతదేశంలోని మహిళలపై లైంగిక హింస ముప్పు యొక్క మానసిక ప్రభావం' అనే శీర్షికతో జరిగిన ఈ ఉపన్యాసం, లైంగిక హింస యొక్క నిరంతర ముప్పు కారణంగా మహిళలు మోస్తున్న, విస్తృతంగా వ్యాపించి ఉన్న, తరచుగా విస్మరించబడే మానసిక భారాన్ని పరిశీలించింది. ఈ భయం వారి మానసిక ఆరోగ్యాన్ని, ప్రవర్తనను, రోజువారీ నిర్ణయాలను ఎలా ప్రభావితం చేస్తుందో డాక్టర్ వసీం వివరించారు. అంతర్జాతీయంగా ఖ్యాతి గడించిన 'అనాలిసిస్ ఆఫ్ సోషల్ ఇష్యూస్ అండ్ పబ్లిక్ పాలసీ' (వైలీ) జర్నల్ లో ప్రచురితమైన ఆమె పరిశోధన, అందులోని ప్రధాన అంశాలను డాక్టర్ వసీం వివరించారు. అనుభవపూర్వక పరిశోధనల ఆధారంగా, సమాజంలో లోతుగా పాతుకుపోయిన, ఈ సవాళ్లను పరిష్కరించడానికి మరింత అవగాహన, విధానపరమైన జోక్యం, బలమైన సహాయక వ్యవస్థల ఆవశ్యకతను ఆమె నొక్కి చెప్పారు. భయం యొక్క పటం'గా వర్ణించిన ఆరు కీలక అంశాలను డాక్టర్ వసీం సమర్పించారు. బహిరంగ ప్రదేశాలలో నిరంతర అతి జాగరూకత, మారిన జీవన విధానాలు-పరిమితమైన చలనశీలత, మహిళలు అవలంబించే సర్దుబాటు పద్ధతులు, ఆందోళన-భావోద్వేగ అలసట వంటి మానసిక ప్రభావాలు, రక్షణ పేరుతో కుటుంబం విధించే ఆంక్షలు, వ్యవస్థాగత మార్పు కోసం పెరుగుతున్న డిమాండ్లతో పాటు శారీరక హింస లేకపోయినా, భయమే నిజమైన హానిని కలిగించగలదని ఆమె అభిప్రాయపడ్డారు. అర్థవంతమైన సంస్కరణల కోసం పిలుపునిస్తూ, సకాలంలో న్యాయం, బలమైన చట్ట అమలు, సహాయక కుటుంబ వాతావరణం, బాధితులను నిందించే వైఖరులను సవాలు చేసే సాంస్కృతిక మార్పు యొక్క ఆవశ్యకతను డాక్టర్ వసీం నొక్కి చెప్పారు. న్యాయమైన సమాజానికి మహిళల భద్రతను నిర్ధారించడం ప్రాథమికమని స్పష్టీకరిస్తూ, ఆమె తన ఉపన్యాసాన్ని ముగించారు. జీఎస్ హెచ్ఎస్ సంస్థాగత పరిశోధన కమిటీ నిర్వహించిన ఈ చర్చాగోష్ఠిలో అధ్యాపకులు, పరిశోధక విద్యార్థులు చురుకుగా పాల్గొన్నారు. సమకాలీన భారతదేశంలో లింగం, భద్రత, మానసిక శ్రేయస్సుపై విమర్శనాత్మక ఆలోచనను ప్రోత్సహిస్తూ, ఆసక్తికరమైన చర్చతో ఈ సమావేశం ముగిసింది.

# నూతన ఇందిరమ్మ ఇల్లు ప్రారంభించిన సర్పంచ్



**చేగుంట, ఏప్రిల్ 23 (నినాదం):** చేగుంట మండలం అనంతసాగర్ గ్రామంలో ఎరుకల లక్ష్మి, యాదగిరి దంపతుల,గృహా ప్రవేశం లో రాష్ట్ర ప్రభుత్వం రేవంత్ రెడ్డి, గృహ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి నాయకత్వంలో పేదలకు సహాయపడి నిర్మిస్తున్న ఇందిరమ్మ ఇళ్లు గృహ ప్రవేశం ప్రారంభోత్సవ కార్యక్రమంలో దుబ్బాక నియోజవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జీ చెరుకు శ్రీనివాస్ రెడ్డి ఆదేశాల మేరకు, చేగుంట మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వడ్ల నవీన్ కుమార్, గ్రామ సర్పంచ్ శ్రీధర్, హౌసింగ్ ఏ ఈ రియాజుద్దీన్, గ్రామ పంచాయతీ సెక్రటరీ రాజేష్, ఉపసర్పంచ్ చిక్కుడు స్వామి, తో కలిసి ప్రారంభించారు, ఈ కార్యక్రమంలో , కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు మసాయిపేట్ శ్రీనివాస్, ఎఎంసి డైరెక్టర్లు అన్నం ఆంజనేయులు, మోజమిల్, బాల్ రెడ్డి,కాషాబోయిన శ్రీనివాస్, స్టాలిన్ నర్సిములు,మండల కాంగ్రెస్ పార్టీ జనరల్ సెక్రటరీ కోండి శ్రీనివాస్, గ్రామ ఇందిరమ్మ కమిటీ సభ్యులు శంకరయ్య,గ్రామ వార్డు సభ్యులు, వెంకటేష్ గారి సిద్దిరాములు, వెంకట్, సాలిపేట రేఖ, రమేష్, కంబాల నర్సమ్మ, సత్యయ, కార్యకర్తలు, అభిమానులు, పాల్గొన్నారు.

## ఉపాధిహామీ కూలీలకు మజ్జిగ ప్యాకెట్ల పంపిణీ



**కమలాపూర్, ఏప్రిల్ 23 (నినాదం) :** మండలంలోని ఉప్పల్ పెద్ద చెరువులో పనిచేస్తున్నటువంటి 130 మంది ఉపాధి హామీ కూలీలకు హుజురాబాద్ పట్టణానికి చెందిన గంగిశెట్టి మధురమ్మ మెమోరియల్ ట్రస్టు నిర్వాహకులు డాక్టర్ గంగిశెట్టి జగదీశ్వర్ గురువారం మజ్జిగ ప్యాకెట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ మొండెద్దుల రమ మాట్లాడుతూ తెల్లవారుజామున పనులకు వచ్చిన ఉపాధి కూలీలకు ఎండ నుండి ఉపశమనం పొందుటకు మధురమ్మ ట్రస్ట్ వారు మజ్జిగ ప్యాకెట్లు అందించడం అభినందనీయమని అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ మొండెద్దుల రమ నాగరాజు, ఉప సర్పంచ్ మేడిపల్లి సిద్ధార్థ, వార్డు సభ్యులు ఎర్రబెల్లి శ్రీధర్ రావు, రాణ ప్రతాప్, ఫీల్డ్ అసిస్టెంట్ బొనగాని తిరుమల, ఆటో యూనియన్ ప్రెసిడెంట్ ఎం రాజేందర్, గుజ్జుల రాజేశ్వరరావు, హుజురాబాద్ సోషల్ మీడియా కన్వీనర్ తులసి లక్ష్మణమూర్తి,పలువురు ఉపాది కూలీలు, తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధిహామీ కూలీలు

## ఉదయం 6 నుండి 11 వరకు పనిచేయాలి

### డిఆర్‌డిఓ శేఖర్ రెడ్డి



**మిర్యాలగూడ ఏప్రిల్ 23 (నినాదం) :**ఉపాధిహామీ పనులను ఉదయం 6 గంటల నుండి 11 గంటల వరకే చేయించాలని డి ఆర్ డి ఓ , శేఖర్ రెడ్డి అన్నారు.నల్గొండ గురువారం దామచర్ల మండలానికి ఆకస్మిక తనిఖీ కోసం తాళ్ల వీరప్ప గూడెం గ్రామపంచాయతీ, దామచర్ల, కొండ్రపోలు ఈ గ్రామాలలో ఉపాధి హామీ పనులు జరిగే చోటికి వెళ్లి కూలీలతో మాట్లాడారు. ఆయా గ్రామాలలోని నర్సరీ పనులను, వడ్లు కొనుగోలు కేంద్రం ను సందర్శించడం జరిగినది. కూలీలకు ఎండాకాలం నందు మంచినీళ్లు వసతి, టెంట్లు ఏర్పాటు ను ఫస్ట్ ఎయిడ్ కిట్ ను ఏర్పాటు చేసి, ఓఆర్ఎస్ ప్యాకెట్లను కూలీలకు అందుబాటులో ఉంచవలెనని ఎంపీడీవో , ఏపీఓ ఆదేశాలు ఇచ్చినారు. . ప్రతి గ్రామ పంచాయతీలోని అందరు కూలీలు ఉపాధి హామీ పనులను ఎక్కువ మొత్తంలో ఉపయోగించుకుని ఈ ఎండాకాలంలో ఉపాధి హామీ సంబంధించిన డబ్బులు ఎక్కువ మొత్తంలో లబ్ధి పొందాలని ఆదేశాలు ఇచ్చినారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో అలివేలు మంగమ్మ , ఏపీఓ నాగేశ్వరావు , ఏపీఎం కృష్ణమూర్తి , తాలవీరప్పగూడెం గ్రామ సర్పంచ్ పోకల వెంకటేశ్వర్లు , ఈసీ శంకర్ ,టి ఏ సైదా, ఆయా గ్రామపంచాయతీ ల కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

## యువతకు ఉచిత నైపుణ్య శిక్షణ



**మిర్యాలగూడ ఏప్రిల్ 23 ( నినాదం):** యువత ఆర్థికంగా స్వావలంబన చెందాలనే దృక్పథంతో పండిట్ దీన్ దయాల్ ఉపాధ్యాయ పథకం ద్వారా గ్రామీణ, పట్టణ విద్యార్థిని విద్యార్థులకు వీసీడమ్ ఎడ్యుకేషన్ డెవలప్మెంట్ సొసైటీ ద్వారా 3 నెలల ఉచిత నర్సు, డేటా ఎంట్రీ, స్పోకెన్ ఇంగ్లీష్, స్కిల్ డెవలప్మెంట్ వంటి కోర్సులను హాస్టల్ సదుపాయంతో సుధా బ్యాంకుపై గల శిక్షణ సంస్థలో నేర్పించడం జరుగుతుంది ఈ సందర్భంగా పట్టణ మున్సిపల్ కౌన్సిలర్ వెలుగు ఇందిరా నాగరాజు, మాజీ కౌన్సిలర్ చిలుకూరి రమాదేవిశ్యామ్,బీజేవైఎం రాష్ట్ర అధికార ప్రతినిధి చిల్లంచర్ల అభి చేతుల మీదుగా విద్యార్థిని విద్యార్థులకు ఈరోజు వెల్కమ్ కిట్లను అందించడం జరిగింది ఈ సందర్భంగా చిలుకూరి శ్యామ్ మాట్లాడుతూ దేశ ప్రధాని మోదీ అంత్యోదయ పలాలను, నిరుద్యోగ యువతీ యువకులకు ఉచిత శిక్షణ ద్వారా వారు అభివృద్ధి చెంది వారి కుటుంబాలకు ఆసరాగా ఉండాలనే లక్ష్యంతో ఈ పథకాలను ప్రవేశపెట్టారని వీటిని అందరు వినియోగించుకోవాలను కోరారు ఈ కార్యక్రమంలో బీజేవైఎం పట్టణ అధ్యక్షులు మేడి నవీన్, సంస్థ నిర్వాహకులు సైదా చారి, రేణుక, వరుణ్, పూజ, సునీత, స్వర్ణలత, సుధా లు పాల్గొన్నారు.

# నెరవేరుతున్న నిరుపేదల సొంతింటి కల

### కొనసాగుతున్న ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం
### బిల్లుల చెల్లింపుతో ఆనందం
### వ్యక్తం చేస్తున్న లబ్ధిదారులు
### పలు గ్రామాల్లో మొదలైన గృహ ప్రవేశాలు



**కమలాపూర్, ఏప్రిల్ 23 (నినాదం):** గ్రామాల్లో నిరుపేదలకు రాష్ట్ర ప్రభుత్వం ఇందిరమ్మ ఇండ్లను కేటాయించడంతో లబ్ది దారులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.అదేవిధంగా బిల్లుల చెల్లింపు లతో ఇండ్ల నిర్మాణాల పనులు వేగంగా జరుగుతున్నాయి. పలు గ్రామాల్లో లబ్ధిదారులు గృహ ప్రవేశాలు సైతం నిర్వహించు కున్నవారు ఉన్నారు.గత ప్రభుత్వ అయాంలో గ్రామాల్లో డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు నిర్మిస్తామని చెప్పి పది సంవత్సరాల కాలంలో కమలాపూర్ ,మర్రిపల్లి గూడెం, గూడూరు గ్రామాల్లో మాత్రమే నిర్మించారు. కాని అవి నేటికి ఒక్క నిరుపేద కురుంబానికి అందించలేదు.కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తరువాత ఇందిరమ్మ ఇళ్ల ను ప్రతి గ్రామంలో మంజూరు చేశారు. వాటి పనులు వేగంగా సాగుతుండడంతో సొంతింటి కల నెరవేరుతుందని లబ్ధిదారులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.ఇందిరమ్మఇళ్ళ నిర్మాణాలు పూర్తి చేసు కుంటున్న లబ్ధిదారులకు త్వరితగతిన ఇళ్ల బిల్లులు చెల్లించేలా అధికారులు చర్యలు చేపడుతున్నారు. ఇళ్ల నిర్మాణ స్థితిని బట్టి నాలుగు విడతలుగా బిల్లులు చెల్లిస్తున్నారు. మొదటి విడత బెస్ మెట్ వరకు పూర్తి కాగానే లక్ష రూపాయలు లబ్ది దారుల ఖాతాల్లో జమ చేస్తున్నారు. రూఫ్ లెవల్ పూర్తి కాగానే రెండో విడత లక్ష జమ చేస్తున్నారు. స్లాబ్ వరకు పూర్తి కాగానే రూ 1లక్ష 60 వేలు జమ చేస్తున్నారు. మొత్తం ఇల్లు నిర్మాణం పూర్తి కాగానే మిగిలిన మొత్తం రూపాయలు లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేస్తున్నారు. ఇలా వెంట వెంటనే బిల్లులు రావడంతో ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేసుకుంటున్న లబ్ధిదారులు సొంతింటి కల నెరవేరుతుందని ఆనందం వ్యక్తం చేస్తున్నారు.ఇంటి నిర్మాణాలు పూర్తయిన లబ్దిదారులు గృహ ప్రవేశాలు జరుపుకుంటున్నారు.

## ఉపాధిహామీ కూలీల సమస్యలను పరిష్కరించాలి

### తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు అజయ్



**అమరచింత, ఏప్రిల్ 23, (నినాదం):** ఉపాధి పెండింగ్ బిల్లులు ఇవ్వాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం వనపర్తి జిల్లా అధ్యక్షులు ఎస్ అజయ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అమరచింత గురువారం అమరచింత ఎంపీడీవో కార్యాలయం వద్ద ప్రసాద్ కార్మిక సంఘం కూలీలతో కలిసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా అజయ్ మండలఅధ్యక్షులు కె. శంకర్ లు మాట్లాడుతు. ఫిబ్రవరి 8నుంచి కూలీలు పనులు చేస్తున్న డబ్బులు రాకపోవడం తో కూలీలు తీవ్ర ఇబ్బందులకు గురి అవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. కేంద్రం లోని బిజెపి ఉపాధి హామీ పతకం పేరును నరేగా మార్చడం సరికాదని విమర్శించారు. కొత్త పతకం ను రద్దు చేయాలనీ డీమాండ్ చేశారు. కేంద్రం 60%రాష్ట్రశీ 40%.నిధులను భరించాలనే నిబంధన సరికాదని పాత పద్దతి లాగానే కేంద్రం 90%రాష్ట్రశీ 10%నిధులను అమలు చేయాలనీ కోరారు. పని ప్రదేశం లో మట్టి కుండా లతో నీటి సౌకర్యం ఏర్పాటు చేయాలనీ అన్నారు. టెంట్ సౌకర్యం. పారా తట్ట బుట్ట. ఫస్ట్‌ఎయిడ్ బాక్స్ తో పాటు ఏప్రిల్ మే నెలలకు వేసవి అలవెన్స్ లు ఇవ్వాలని. పని ప్రదేశం లో వడ దెబ్బకు చనిపోయే కూలీలకు 10లక్షలు నష్ట పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు.వారం వారం పే స్లిప్పు లు 15రోజులకు ఒకసారి వేతనాలు చెల్లించాలని విజ్ఞప్తి చేశారు. ఏడాదికి 200పనిదినాలు. రోజు కూలి 600చెల్లించాలని. ఫోటో కాప్చర్ విధానం రద్దు చేయాలనీ. కెవైసి సిస్టం ఉన్నందున ప్రతి గ్రామం లో ఆధార్ క్యాంపులు పెట్టి కూలీల ఆధార్ కార్డులు అప్డేట్ చేయాలనీ సూసించారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని ఎంపీడీవో శ్రీనివాసులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో భగవంతు. చిన్న విష్ణు. జలగరి రాములు. విజయ్. నిశాంత్.అరుణ్ తదితరులు పాల్గొన్నారు.

## సంసద్ ఖేల్ జేతలను ప్రకటించిన ప్రధానమంత్రి మహోత్సవ పార్లమెంట్ టీం

### పాలమూరు గడ్డపై మెరిసిన ఆత్మకూరు ఆణిముత్యాలు
### మక్తల్ నియోజకవర్గ స్థాయిలో ఆత్మకూరు నుంచి గెలుపొందిన క్రీడాకారులు



**అమరచింత, ఏప్రిల్ 23, (నినాదం):** ప్రధానమంత్రి పార్లమెంటరీ స్థాయి సంసద్ ఖేల్ పోటీల్లో పాలమూరు గడ్డపై ఆత్మకూరు ఆణిముత్యాలు విజయ దుంభిది మోగించినట్లు ఆత్మకూరు బిజెపి మండల అధ్యక్షులు అశోక్ భూపాల్ యాదవ్ గురువారం తెలిపారు. కబడ్డీ టీం గెలుపు వాలీబాల్ బాయ్స్ మొదటి ప్రైజ్ 20,000 వాలీబాల్ బాయ్స్, వాలీబాల్ బాయ్స్ గెలుపు 20,000, వాలీబాల్ గర్ల్స్ గెలుపు మనీ ప్రైజ్ 20,000, కోకో టీం రన్నర్ ఆఫ్ గెలుపు మనీ ప్రైస్ 10,000, కబడ్డీ బాయ్స్ గెలుపు మనీ ప్రైస్ 50,000వాలీబాల్ గర్ల్స్ గెలుపు మనీ ప్రైస్ 50,000,09-04-2026 ఆత్మకూరు పట్టణంలోని మినీ స్టేడియంలో పాలమూరు ఎంపీ డీకే అరుణమ్మ చేతుల మీదుగా ప్రారంభం అయిన ప్రధానమంత్రి ఖేల్ సంసాద్ మహోత్సవ కార్యక్రమాన్ని విజయవంతంగా ముందుకు నడిపిన బిజెపి మండల మండల అధ్యక్షుడు మండల సూరి జిల్లా కౌన్సిల్ మెంబర్ ఆంజనేయులు ముదిరాజు జిల్లా నాయకులు జిందె శ్రీనివాసులు మాజీ మండల అధ్యక్షుడు విష్ణువర్ధన్ రెడ్డి , ఇతర నాయకులు, పిఈటిలు, మక్తల్ వెళ్లడానికి బస్సు సౌకర్యం కల్పించిన ఎం.వి.రామన్ స్కూల్ కరస్పాండెంట్ శ్రీధర్ గౌడ్ క్రీడాకారులకు అందరికీ కృతజ్ఞతలు తెలుపుతున్నామని ఆయన అన్నారు.నేడు పాలమూరులో జరిగే బహుమతి ప్రధాన ఉత్సవానికి గవర్నర్ శుక్ల తో పాటు పాలమూరు ఎంపీ డీకే అరుణ హాజరవుతున్నారని క్రీడాకారులు బిజెపి నాయకులు కార్యకర్తలు భారీ సంఖ్యలో హాజరు కావాలని ఆయన కోరారు.

## ఆర్టీసీ ప్రైవేటీకరణ కుట్రపై మాజీ ఎమ్మెల్యే ఆగ్రహం

- కోదాడలో ఆర్టీసీ సమ్మెకు బొల్లం మల్లయ్య యాదవ్ మద్దతు



**కోదాడ,ఏప్రిల్ 23(నినాదం):** రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఆర్టీసీ కార్మికుల పొట్టలు కొట్టి వారి సమస్యలు పరిష్కరించకుండా తాత్సారం చేస్తుందని, ఈ సంస్థను క్రమేణ ప్రైవేటీకరణ చేసేందుకు కుట్ర పన్నుతుందని మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. గురువారం కోదాడ డిపో ఆవరణలో ఆర్టీసీ సమ్మెకు మద్దతు ప్రకటించిన అనంతరం ఆయన మాట్లాడారు... తమ సమస్యలు పరిష్కరించాలని రెండున్నర సంవత్సరాలుగా ఆర్టీసీ కార్మికులు ప్రభుత్వానికి పలురూపాలలో విన్నవించుకున్నప్పటికీ ఫలితం లేకపోవడం వల్లే కార్మికులు సమ్మెకు దిగాల్సిన పరిస్థితి దాపురించిందన్నారు.. రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ సమ్మెపై ఇష్టం వచ్చినట్లు మాట్లాడుతున్నారని విమర్శించారు.. ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని గతంలో కాంగ్రెస్ ఇచ్చిన హామీనే నిలబెట్టుకోవాలని కార్మికులు సమ్మె చేస్తున్న విషయాన్ని ఆయన గుర్తు చేశారు.. ప్రాథమిక అవగాహన లేని డ్రైవర్లతో బస్సులు నడపడం వల్ల ప్రయాణికులకు భద్రత లేకుండా పోయిందని పేర్కొన్నారు.... గతంలో ప్రతి చిన్న సమస్యపై మాట్లాడిన కోదండరాము లాంటి మేధావులు ఆర్టీసీ సమ్మెపై ఎందుకు నోరు మెదపడం లేదని అసహనం వ్యక్తం చేశారు. ఆర్టీసీ ఉద్యోగులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని ఆయన డిమాండ్ చేశారు. గతంలో ఆర్టీసీకి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇచ్చిన200 కోట్ల రూపాయల చెక్కు ఇప్పటికీ చెల్లలేదని ఎద్దేవా చేశారు. బి ఆర్ఎస్ హయాం లోని బస్సులను ఇప్పటి ముఖ్యమంత్రి జండా ఊపి ప్రారంభిస్తున్నారని అపహస్యం చేశారు. ఆర్టీసీ కార్మికుల సమస్యలు పరిష్కరించే దాకా సమ్మెకు తమ సంపూర్ణ మద్దతు ఉంటుందన్నారు.. ఆర్టీసీ అధికారులు సమ్మెను నీరు కార్చేందుకు పోలీసు యంత్రాంగాన్ని రంగంలోకి దింపడం, కార్మికులపై ఒత్తిడి తేవడం శోచనీయమన్నారు.. ఈ కార్యక్రమంలో టిఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు ఎస్కే నయీమ్ ,నాయకులు కుక్కడపు బాబు సుంకర అజయ్ కుమార్ తోగరు రమేష్ ఉపేందర్ గౌడ్ కరీముల్లా గొర్రె రాజేష్ చలిగంటి వెంకట్ పిట్టల భాగ్యమ్మ ఉపేందర్ గౌడ్ జానీ అబ్దుల్లా పుల్లయ్య ఆర్టీసీ కార్మికుల పాల్గొన్నారు.. కాగా డిపో ఎదుట ఆర్టీసీ కార్మికులు ధర్నా నిర్వహించారు

## యూరియా యాప్‌ను వెంటనే రద్దు చేయాలి



**మిర్యాలగూడ ఏప్రిల్ 23 (నినాదం) :**యూరియా యాప్‌ను రైతు ప్రయోజనాల దృష్ట్యా తక్షణమే రద్దు చేయాలని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు, రైతు బంధు సమితి నల్లగొండ జిల్లా మాజీ అధ్యక్షుడు చింతరెడ్డి శ్రీనివాస్ రెడ్డి కోరారు. గురువారంఈ మేరకు తెలంగాణ రాష్ట్ర హైకోర్టులో ప్రజాప్రయోజన వ్యాజ్యం (పిల్) దాఖలు చేసినట్లు తెలిపారు. చింతరెడ్డి శ్రీనివాస్ రెడ్డి తో పాటు మరో నలుగురు రైతులు దాఖలు చేసిన పిల్ పై హైకోర్టు చీఫ్ జస్టిస్ అపరేష్ కుమార్ సింగ్, జస్టిస్ గౌస్ మీరా మొహియుద్దీన్ తో కూడిన ధర్మాసనం గురువారం విచారం చేపట్టింది. ఈ మేరకు 2 వారాల్లో సమగ్ర కౌంటర్ దాఖలు చేయాల్సిందిగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వాన్ని సీజే తో కూడిన ధర్మాసనం ఆదేశించింది. హైకోర్టులో పిటిషనర్స్ తరపున పాశం రవీందర్ రెడ్డి వాదనలు వినిపించారు. మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో రైతులకు యూరియా యాప్ ద్వారా రైతులు యూరియా సప్లయి చేయడాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

## తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం



**కోదాడ,ఏప్రిల్ 23(నినాదం):** ప్రస్తుతం వేసవికాలం తీవ్రంగా ఉండటంతో ఖానాపురం గ్రామంలోని 5వ వార్డులో గ్రామపంచాయతీ త్రాగునీరు ఇళ్లకు సరఫరా కాకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు.ఈ సమస్యను స్థానిక వార్డు మెంబర్ శీలం శ్రావణి నాగేంద్రబాబు ప్రజా ప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన సర్పంచ్ లాజర్, ఉపసర్పంచ్ జగన్ ఆధ్వర్యంలో రూ.25 వేల వ్యయంతో నూతన పైపులైన్లు ఏర్పాటు చేసి తాగునీటి సమస్యను పరిష్కరించేందుకు చర్యలు చేపట్టారు.అనంతరం వారు ఇరువురు మాట్లాడుతూ, వేసవి తీవ్రత కారణంగా ప్రజలకు తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలతో పాటు తక్షణ మరమ్మతులు చేపట్టామని తెలిపారు. గ్రామంలో నీటి సరఫరా వ్యవస్థను మెరుగుపరచేందుకు అవసరమైన అన్ని చర్యలు కొనసాగిస్తామని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు ఉయ్యాల వీరయ్య గౌడ్, వార్డు మెంబర్ మాధవి గోపి,గ్రామ పెద్దలు రెడ్డబోయిన ఉపేందర్, వార్డు మహిళలు పాల్గొన్నారు.

## వైద్యులు పూర్తి స్థాయిలో అందుబాటులో ఉండాలి





### హుజుర్‌నగర్ ఏరియా ఆసుపత్రిని ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్
### తనిఖీ సమయంలో అందుబాటులో లేని డాక్టర్లు
### డాక్టర్ల గైర్హాజరు పట్ల కలెక్టర్ ఆగ్రహం

**హుజుర్‌నగర్, ఏప్రిల్ 23 (నినాదం):** ప్రభుత్వ ఆసుపత్రిలలో వైద్యులు రోగులకు పూర్తిస్థాయిలో అందుబాటులో ఉండాలని, లేదంటే చర్యలు తప్పవని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ హెచ్చరించారు. గురువారం హుజుర్ నగర్ (ప్రాంతీయ వైద్యశాల) ఏరియా ఆసుపత్రికి కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. కలెక్టర్ ఆసుపత్రిని తనిఖీ చేసిన సమయంలో డాక్టర్లు అందుబాటులో లేకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కొంత మంది సమయం కాకముందే విధుల నుంచి వెళ్లిపోవడంపై కలెక్టర్ వివరాలను ఆరా తీశారు. అనంతరం డయాలసిస్ కేంద్రం, బ్లడ్ బాంక్ కేంద్రలను పరిశీలించారు. రోగులకు అందుతున్న వైద్య సేవలపై కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వైద్యులు విధి నిర్వహణలో సమయానికి రోగులకు అందుబాటులో ఉండాలని రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని ఆదేశించారు. ఓపి విభాగంలో సమయపాలన పాటించని డాక్టర్లను, కాంట్రాక్టు డాక్టర్లపై చర్యలు తీసుకోవాలని సంబంధిత సూపరెండెంట్ ని ఆదేశించారు. ఇందుకు సంబంధించి పూర్తి నివేదికను అందించాలన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న ఆరోగ్య కార్యక్రమాలపై ప్రత్యేక దృష్టి సారించాలని. గర్భిణులు, బాలింతల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని. సాధారణ ప్రసవాలు అధికంగా జరిగేలా అవగాహన కల్పించాలని సూచించారు. ఆసుపత్రి పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని, పారిశుద్ధ్య నిర్వహణ పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈసందర్భంగా ఆసుపత్రి పారిశుద్ధ్య నిర్వహణపై శానిటేషన్ సిబ్బందిని, నర్సింగ్ ఆఫీసర్లను అభినందించారు. కాయకల్పలో అవార్డ్ పొందాలని ఆకాక్షించారు.మెరుగ్గా పారిశుద్ధ్య పనులను నిర్వహించి ఆసుపత్రి పరిసర ప్రాంతాలు పరిశుభ్రంగా ఉండే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆసుపత్రిలోని అత్యవసర విభాగం, ఓపి విభాగం, బ్లడ్ స్టోరేజి విభాగాలను కలెక్టర్ పరిశీలించారు. నూతనంగా నిర్మిస్తున్న ఓపి బ్లాక్ నిర్మాణ పనులను వేగవంతంగా పూర్తి చేయాలని ఆదేశించారు. అనంతరం సిటీ స్కాన్ మిషన్ పని తీరును పర్యవేక్షించారు. టిహబ్ నిర్వహణలో ఉన్న లోపాలను అధికారులతో మాట్లాడి తక్షణమే సమస్యను పరిష్కరించాలని జిల్లా అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో రెవిన్యూ డివిజనల్ అధికారి శ్రీనివాసులు, సూపరెండెంట్ డాక్టర్ ప్రవీణ్ కుమార్, ఆర్ఎంఓ డాక్టర్ రవి కుమార్, గైనకాలజిస్ట్ డాక్టర్ వనజ, వైద్యులు, నర్సింగ్ ఆఫీసర్లు, శానిటేషన్ సిబ్బంది, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## జూనియర్ కోర్టులో చలివేంద్రం ప్రారంభం



**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (నినాదం):** ఎండ తీవ్రత పెరుగుతున్న నేపథ్యంలో న్యాయవాదులు, కక్షిదారుల దాహార్తిని తీర్చడానికి ఏర్పాటు చేసిన చలివేంద్రంను ప్రిన్సిపాల్ జూనియర్ సివిల్ జడ్జి ఎస్.ఆర్.దిలీప్ కుమార్ నాయక్ గురువారం ప్రారంభించారు. అడ్వొకేట్స్ బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రిన్సిపాల్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టు ప్రాంగణంలో చలివేంద్రాన్ని ఏర్పాటు చేసారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ సుదూర ప్రాంతాలనుండి కోర్టుకు వచ్చే కక్షిదారులు, న్యాయవాదుల దాహార్తిని తీర్చాలనే ఉద్దేశంతో అడ్వొకేట్స్ బార్ అసోసియేషన్ చొరవ చూపడం అభినందనీయమన్నారు. సొంత ఖర్చులతో చలివేంద్రం ఏర్పాటుకు సహకరించిన న్యాయవాది భూక్యా రమేష్ నాయక్, తిరుమలను జడ్జి అభినందించారు. ఈ కార్యక్రమంలో అడ్వొకేట్స్ బార్ అసోసియేషన్ అధ్యక్షులు కూనూరు సురేష్ కుమార్, ఉపాధ్యక్షులు గంగరబోయిన రాజేందర్, ప్రధాన కార్యదర్శి ఆకుల రాములు, లేడీ జాయింట్ సెక్రటరీ కంప అక్షయ, లైబ్రరీ కార్యదర్శి ఆకినేపల్లి రవికుమార్, ట్రేసరర్ ఇందరపు శివకుమార్, స్పోర్ట్స్ సెక్రటరీ ఎస్. నాగరాజ్, ఈ.సి మెంబెర్ రాయం రమేష్, లేడీ ఈ.సి మెంబెర్ మచ్చ వసంత, ఏ.పి.పి అర్థ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## రెండో రోజు కొనసాగిన ఆర్టీసీ సమ్మె

- ఆడపదడప తిరిగిన అద్దె బస్సులు
- భూపాలపల్లి డిపో ఎదుట కార్మికుల ఆందోళన
- ప్రయాణికులకు తప్పని ఇబ్బందులు




**భూపాలపల్లి ప్రతినిధి, ఏప్రిల్ 23(నినాదం):** తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ ఆర్టీసీ కార్మికులు చేపట్టిన రాష్ట్రవ్యాప్త సమ్మె రెండో రోజు గురువారం కొనసాగింది. ఆర్టీసీ జేఏసీ ఆధ్వర్యంలో కార్మికులు విధులను బహిష్కరించి సమ్మెలో పాల్గొన్నారు. దీంతో ఆర్టీసీ అధికారులు ప్రయాణికుల ఇబ్బందులు తొలగించడానికి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు కొనసాగించారు. పలు రూట్లో అద్దె బస్సులను నడిపించారు. రోజువారి వేతనం కింద డ్రైవర్లు కండక్టర్లను సమకూర్చి బస్సులో నడిపే ప్రయత్నం చేస్తున్నారు. విషయం తెలుసుకున్న ఆర్టీసీ జేఏసీ నాయకులు, కార్మికులు భూపాలపల్లి డిపో వద్దకు చేరుకొని ఆందోళన చేపట్టారు. డిపో ఎదుట బయట బైఠాయించి బస్సులను అడ్డుకున్నారు. ఎట్టి పరిస్థితుల్లో బస్సులను నడవనీయబోమని భీష్మించారు. ఈ సందర్భంగా ఆర్టీసీ జేఏసీ నాయకులు మాట్లాడుతూ ప్రభుత్వం వెంటనే స్పందించి తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని లేకుంటే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అద్దె బస్సుల యజమానులు, డ్రైవర్లు సమ్మెకు సహకరించాలని భవిష్యత్తులో ఏ సమస్యలు వచ్చిన తాము మీకు సహకరిస్తామని పేర్కొన్నారు. పట్టిసీ అధికారులు తమ సమ్మెను కాదని బస్సులు నడపాలని చూస్తే ఉద్యమం మరింత పెద్ద ఎత్తున కొనసాగుతుందని ఆర్టీసీ జేఏసీ నాయకులు, కార్మికులు హెచ్చరించారు. సమ్మెకు పలు సంఘాల నాయకులు, పార్టీల నాయకులు మద్దతు తెలిపారు.

## నిర్ణీత గడువులోపు అంత్య పుష్కరాల పనులు పూర్తిచేయాలి

- జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ



**భూపాలపల్లి ప్రతినిధి, ఏప్రిల్ 23(నినాదం):** సరస్వతి అంత్య పుష్కరాల పనులను త్వరితగతిన పూర్తి చేసి భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సౌకర్యాలు చేయాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ అధికారులకు సూచించారు. ఐడీఓసీ వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో జరిగిన సమీక్ష సమావేశంలో అంత్య సరస్వతి పుష్కరాలు ఏర్పాట్లపై గురువారం కలెక్టర్ అధికారులతో సమగ్రంగా చర్చించారు. పుష్కరాల సందర్భంగా భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పించేందుకు వివిధ శాఖల అధికారులు చేపట్టిన పనుల పురోగతిని రెవెన్యూ, ఇరిగేషన్, వైద్య, పీఆర్, విద్యుత్తు, ఆర్ అండ్ బి, ప్రణాళిక, రవాణా, పర్యాటక, అగ్నిమాపక అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. ముఖ్యంగా కాళేశ్వరంలో సరస్వతి ఘాట్ వద్ద జరుగుతున్న పనులపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఘాట్ సిద్ధం చేయడం, షట్టరింగ్ పనులు మరియు స్టాంప్డ్ కాంక్రీట్ వేయడం కొనసాగుతున్నాయని వేగం పెంచాలని సూచించారు. పేవర్ బ్లాక్స్ వేసే పనులు పురోగతిలో ఉన్నాయని అన్నారు. భద్రత, పారిశుద్ధ్యం, తాగునీరు, రవాణా తదితర అన్ని ఏర్పాట్లను సమన్వయంతో నిర్వహించాలని పేర్కొన్నారు. భక్తులు స్నానాలు ఆచరించేందుకు షవర్లు ఏర్పాటు చేయాలని తెలిపారు. ఈ సమావేశంలో కాటారం సబ్ కలెక్టర్ మయాంక్ సింగ్, అదనపు కలెక్టర్లు అశోక్ కుమార్, విజయలక్ష్మి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.




## రెడ్డీస్ కళ్యాణ మండపానికి, భూమి పూజ, శంకుస్థాపన చేసిన మంత్రి పొంగులేటి

**మణుగూరు ఏప్రిల్ 23 (నినాదం):**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరు మండలంలో రైల్వే స్టేషన్ శివారులో ఉన్న తోగూడెం క్రాస్ రోడ్ వద్ద రెడ్డి సంక్షేమ సమాఖ్య ఆధ్వర్యంలో రెడ్డిస్ కళ్యాణ మండపం కు గురువారం సమాచార, రెవిన్యూ శాఖ మంత్రివర్యులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి భూమి పూజ నిర్వహించి శంకుస్థాపన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి మాట్లాడుతూ రెడ్డి సంక్షేమ సమాజ అభివృద్ధి దిశగా సంక్షేమ సేవా కార్యక్రమాలు నిర్వహించుకునేందుకు ఇటువంటి కళ్యాణ మండపాలు ఎంతో ఉపయోగపడతాయని అని అన్నారు. ఇటువంటి కళ్యాణ మండపాలు ద్వారా ఏజెన్సీ ప్రాంతాల్లో రెడ్డి సంక్షేమాలకు కోసం సామాజిక, సాంస్కృతిక, వివాహాల వేదిక కోసం ఈ కళ్యాణ మండపం ఎంతో ఉపయోగపడుతుందని ఆయన అన్నారు. కళ్యాణ మండపానికి ముందుకు వచ్చిన సమైక్య సభ్యులను ఆయన అభినందిస్తూ భవన నిర్మాణం నాణ్యతతో త్వరితగతిన పూర్తి చేయాలని ఆయన సూచించారు. అనంతరం స్థానిక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు మాట్లాడుతూ...... రెడ్డిస్ సంక్షేమ సమైక్య అభివృద్ధి కోసం కళ్యాణ మండపాలు ఎంతో దోహదపడతాయని ఆయన అన్నారు. ఏజెన్సీ ప్రాంతాల్లో ఇప్పటివరకు రెడ్డి సంక్షేమ కళ్యాణ మండపాలు పినపాక నియోజకవర్గం లో ఇదే మొట్టమొదటి ఆయన పేర్కొన్నారు. దీని అభివృద్ధి కోసం సాయశక్తులకు కృషి చేస్తానని ఆయన రెడ్డి సంక్షేమ సమైక్యకు హామీ ఇచ్చారు. ఈ సంక్షేమ మండపానికి తన వంతు కృషి అందిస్తూ నాణ్యతతో కూడిన పనులను త్వర త్వరగా పూర్తి చేసేందుకు తనవంతు కర్తవ్యంగా ముందుంటానని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో భద్రాచలం ఎమ్మెల్యే తెల్ల వెంకటరావు డిసిసి అధ్యక్షులు తోట దేవి ప్రసన్న, సమైక్య ప్రతినిధులు మండల ముఖ్య నాయకులు ప్రజాప్రతినిధులు మహిళా నాయకులు యువ నాయకులు మరియు కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## విద్యాభివృద్ధికి తల్లిదండ్రుల పాత్ర కీలకం

### నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టర్ బాధావత్ సంతోష్



**నాగర్ కర్నూల్ ఏప్రిల్ 23 (నినాదం)**

విద్యార్థుల భవిష్యత్తు నిర్మాణంలో ఉపాధ్యాయుల పాత్ర ఎంత ముఖ్యమో, తల్లిదండ్రుల పాత్ర కూడా అంతే కీలకమని నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టర్ పదావత్ సంతోష్ అన్నారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన 99 రోజుల కార్యాచరణ కార్యక్రమాల నిర్వహణలో సందర్భంగా నాగర్ కర్నూల్ జిల్లాలో సంక్షేమ వారోత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. ఈ నేపథ్యంలో నాగర్ కర్నూల్ నియోజకవర్గ పరిధిలోని బిజినపల్లి మండలంలోని పాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం పాఠశాల విద్యార్థుల తల్లిదండ్రులతో ప్రత్యేక సమావేశాన్నికి జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ హాజరయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థుల విద్యా ప్రగతి, పాఠశాల అభివృద్ధి, తల్లిదండ్రుల బాధ్యతలపై కలెక్టర్ అవగాహన కల్పించారు. జిల్లా కలెక్టర్, విద్యార్థుల భవిష్యత్తు నిర్మాణంలో ఉపాధ్యాయుల పాత్ర ఎంత ముఖ్యమో, తల్లిదండ్రుల పాత్ర కూడా అంతే కీలకమని, విద్యార్థులు పాఠశాలలో నేర్చుకునే విద్యతో పాటు ఇంటి వద్ద తల్లిదండ్రుల ప్రోత్సాహం, పర్యవేక్షణ ఎంతో అవసరమని, ప్రతి విద్యార్థి ఉన్నత స్థాయికి చేరుకోవాలంటే కుటుంబం మరియు



పాఠశాల మధ్య సమన్వయం అవసరమని స్పష్టం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యా రంగానికి అత్యున్నత ప్రాధాన్యతనిస్తూ పలు వినూత్న కార్యక్రమాలు అమలు చేస్తోందని, పాఠశాలల్లో మౌలిక సదుపాయాల అభివృద్ధి, ఆధునిక డిజిటల్ విద్యా వనరుల ఏర్పాటు, ఉపాధ్యాయులకు ప్రత్యేక శిక్షణ కార్యక్రమాల నిర్వహణ ద్వారా విద్యా నాణ్యతను మెరుగుపరచడానికి కృషి జరుగుతోందని వివరించారు.జిల్లాలో విద్యార్థుల హాజరు శాతం పెంపు, మధ్యలో చదువు మానేసే వారి సంఖ్య తగ్గింపు, ప్రతి విద్యార్థికి నాణ్యమైన విద్య అందించడంపై జిల్లా యంత్రాంగం ప్రత్యేక దృష్టి సారించినట్లు తెలిపారు. ముఖ్యంగా ప్రభుత్వ పాఠశాలలపై ప్రజల్లో విశ్వాసం పెంపొందించేందుకు అనేక చర్యలు చేపడుతున్నామని వెల్లడించారు. తల్లిదండ్రులు తమ పిల్లల విద్యపై మరింత శ్రద్ధ వహించాలని, వారిని క్రమం తప్పకుండా పాఠశాలకు పంపించాలని, ఇంటి వద్ద చదువుకు అనుకూలమైన వాతావరణాన్ని కల్పించడం ద్వారా పిల్లల అభ్యాసంలో మెరుగైన ఫలితాలు సాధించవచ్చని, విద్యార్థులు ఎదుర్కొనే సమస్యలను ఉపాధ్యాయులతో చర్చించి వెంటనే పరిష్కారం కనుగొనాలని సూచించారు. ప్రభుత్వం అందిస్తున్న ఉచిత పాఠ్యపుస్తకాలు, యూనిఫార్ములు, మధ్యాహ్న భోజన పథకం వంటి సంక్షేమ కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలని తల్లిదండ్రులకు పిలుపునిచ్చారు. ఈ పథకాలు విద్యార్థుల చదువుకు ప్రోత్సాహకరంగా నిలుస్తున్నాయని తెలిపారు. పాఠశాలలో ఇటీవల గుర్తించిన సమస్యలను పరిష్కరించేందుకు జిల్లా యంత్రాంగం తక్షణ చర్యలు తీసుకుంటుందని కలెక్టర్ హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా పాఠశాల అభివృద్ధి కమిటీ సభ్యులు, ఉపాధ్యాయులు, స్థానిక ప్రజాప్రతీనిధులు తమ అభిప్రాయాలను వెల్లడిస్తూ పాఠశాల అభివృద్ధికి అవసరమైన సూచనలు చేశారు. సంక్షేమ వారోత్సవాల ద్వారా ప్రభుత్వం ప్రజలకు మరింత చేరువవుతూ, వారి సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకొని త్వరితగతిన పరిష్కరించే దిశగా కృషి చేస్తోందని తల్లిదండ్రులు అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, స్థానిక ప్రజాప్రతినిధులు, విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థులు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ఆర్టీసీ కార్మికుడు ఆత్మహత్యాయత్నం

### డిపో ప్రాంగణంలో ఉద్రిక్తత

**నల్లగొండ ప్రతినిధి ఏప్రిల్ 23 నినాదం**

నల్లగొండ జిల్లా కేంద్రంలో ఆర్టీసీ కార్మికుల సమ్మె రెండవ రోజు ఉద్రిక్తతకు దారి తీసింది. సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం స్పందించడం లేదని కార్మికులు ఆవేదన చెందుతున్నారు. గురువారం ఉదయం నుండే ఆర్టీసీ కార్మికులు పెద్ద ఎత్తున డిపో ప్రాంగణంలో ఏర్పాటు చేసిన టెంట్లో సమావేశమయ్యారు. ఇంతలోనే ఆర్టీసీ డ్రైవర్ రావుల వెంకన్న ఆవేదనతో ఆత్మహత్య ప్రయత్నం చేసుకున్నారు ఒంటిపై పెట్రోల్ పోసుకొని ప్రయత్నం చేశారు. వెంటనే అప్రమత్తమైన తోటి కార్మికులు పోలీసులు కార్మికుని అడ్డుకొని పెద్ద ప్రమాదం నుంచి తప్పించారు. కార్మికున్ని అక్కడ నుంచి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కార్మికుడి ఆత్మహత్య ప్రయత్నం తెలుసుకున్న కార్మికులు బస్టాండ్ కు భారీగా చేరుకున్నారు. తమ సమస్యలను పరిష్కారం చేసు



కునేంతవరకు సమ్మె కొనసాగిస్తామని, డిమాండ్లను నెరవేర్చాలని నినాదాలు చేస్తూ కార్మికులు సమ్మెను కొనసాగిస్తారు.

## విద్యార్థుల సమగ్ర అభివృద్ధే లక్ష్యం

### తల్లిదండ్రుల భాగస్వామ్యం కీలకం: జిల్లా కలెక్టర్ ప్రావీణ్య

**సంగారెడ్డి బ్యూరో, ఏప్రిల్ 23 (నినాదం )**

పిల్లల చదువు పై తల్లిదండ్రులు శ్రద్ధ తీసుకున్నప్పుడే వారి భవిష్యత్తు బాగుంటుందని జిల్లా కలెక్టర్ ప్రావీణ్య అన్నారు. ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా జరుగుతున్న సంక్షేమ వారోత్సవాల సందర్భంగా సంగారెడ్డి లో గల మహాత్మ జ్యోతిబా పూలే తెలంగాణ బీసీ సంక్షేమ గురుకుల పాఠశాల జోగిపేట (బాలికలు)లో గురువారం నిర్వహించిన తల్లిదండ్రుల సమావేశానికి జిల్లా కలెక్టర్ ప్రావీణ్య హాజరయ్యారు. ఈ సందర్భంగా పాఠశాల పరిసరాలను పరిశీలించి, తరగతి గదులను సందర్శించి విద్యార్థులతో ప్రత్యక్షంగా మాట్లాడి వారి విద్యా ప్రగతి, సౌకర్యాలపై వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, విద్యార్థుల భవిష్యత్తు నిర్మాణంలో తల్లిదండ్రుల పాత్ర అత్యంత కీలకమని, పిల్లల చదువుపై నిరంతరం శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. పాఠశాల అభివృద్ధికి తల్లిదండ్రులు తమ సూచనలు, సలహాలు అందించాలని, సమస్యలు ఉన్నపక్షంలో వెంటనే ఉపాధ్యాయుల దృష్టికి తీసుకురావాలని తెలిపారు. అవసరమైతే కంప్లైంట్ బాక్సులు ఏర్పాటు చేసి, విద్యార్థులు మరియు తల్లిదండ్రుల సమస్యలను స్వీకరించి పరి





ష్కరించే చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. ఇంగ్లీష్ భాషలో నైపుణ్యం పెంపొందించేందుకు హాస్టల్‌లో ప్రతిరోజు ఒక గంటపాటు ఇంగ్లీష్‌లోనే మాట్లాడే విధానాన్ని అమలు చేయాలని ప్రిన్సిపల్ మరియు ఉపాధ్యాయులకు ఆదేశించారు. ప్రతి విద్యార్థి సామర్థ్యాన్ని గుర్తించి, వారు బలహీనంగా ఉన్న సబ్జెక్టులపై ప్రత్యేక శ్రద్ధ పెట్టడంతో పాటు, ఆసక్తి ఉన్న రంగాలలో ప్రోత్సహించాలని సూచించారు. ప్రభుత్వం సంక్షేమ వసతి గృహాలలో విద్యార్థులకు అవసరమైన అన్ని వసతులను సమకూరుస్తోందని, పాఠ్యపుస్తకాలు, యూనిఫారాలు అందించడంతో పాటు నాణ్యమైన విద్య, పౌష్టికాహారం అందిస్తున్నామని తెలిపారు. విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణకు రెగ్యులర్ హెల్త్ చెకప్‌లు నిర్వహిస్తున్నట్లు వివరించారు. వసతి గృహాలలో అందిస్తున్న సౌకర్యాలపై కూడా తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. ప్రతి నెల నిర్వహించే పేరెంట్స్ మీటింగ్‌కు తల్లిదండ్రులు హాజరై, పిల్లలతో కలిసి ఒక పూట భోజనం చేసేలా అన్ని వసతి గృహాలకు ఆదేశాలు జారీ చేయనున్నట్లు వెల్లడించారు. విద్యార్థులలో పెరుగుతున్న మానసిక, భావోద్వేగ సమస్యలను దృష్టిలో ఉంచుకుని తల్లిదండ్రులు మరియు ఉపాధ్యాయులు కలిసి వారికి మానసిక ధైర్యం అందించాలని సూచించారు. విద్యార్థులు తమ ఆసక్తి ఉన్న సబ్జెక్టులను ఎంపిక చేసుకుని, తమ ప్రతిభను మెరుగుపరుచుకుని ఉన్నత లక్ష్యాలను సాధించాలని కలెక్టర్ ప్రోత్సహించారు. ఈ సందర్భంగా తల్లిదండ్రులు కూడా తమ అభిప్రాయాలను వ్యక్తపరిచి, సంక్షేమ వసతి గృహాలలో అందుతున్న నాణ్యమైన విద్య, పౌష్టికాహారం, ఇతర సౌకర్యాలపై సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం 2025-26 విద్యాసంవత్సరంలో 5, 6, 7, 8, 9 తరగతుల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ ర్యాంకులు సాధించిన విద్యార్థులకు జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ శాఖ అధికారి జగదీష్, ప్రిన్సిపాల్ రజని, అసిస్టెంట్ ప్రిన్సిపాల్ స్రవంతి, డిప్యూటీ వార్డెన్ జ్యోతి, తల్లిదండ్రులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



## రాకా మూవీలో దీపికదే కీ రోల్

### ఆమె నటించదన్న వార్తలపై టీమ్ స్పందన



అల్లు అర్జున్ హీరోగా అట్లీ దర్శకత్వంలో తెరకెక్కుతోన్న చిత్రం 'రాకా'. భారీస్థాయిలో రూపొందుతోన్న ఈ సినిమాలో బన్నీకి జోడీగా బాలీవుడ్ నటి దీపికా పదుకొణె నటిస్తున్నారు. ఇటీవల ఆమె రెండోసారి తల్లి కానున్నట్లు సోషల్ మీడియా వేదికగా ప్రకటించిన సంగతి తెలిసిందే. దీంతో ఈ సినిమాపై రూమర్స్ మొదలయ్యాయి. షూటింగ్ ఆలస్యం అవుతుందని.. దీపిక స్థానంలో మరో నటిని తీసుకోనున్నారని వార్తలు వచ్చాయి. తాజాగా వాటిని 'రాకా' టీమ్ ఖండించింది. సినిమాలో దీపిక పాత్ర నిడివి తగ్గించారనే ప్రచారాన్ని కూడా కొట్టేసింది. సినిమాలో ఆమె పాత్ర కీలకమైనదని షూటింగ్ కూడా అనుకున్న షెడ్యూల్స్ ప్రకారమే సాగుతోందని స్పష్టం చేసింది. రూమర్స్‌ను షేర్ చేయొద్దని విజ్ఞప్తి చేసింది. సన్ పిక్చర్స్ నిర్మిస్తోన్న ఈ ఫాంటసీ ఎంటర్‌టైనర్‌లో దీపిక కొన్ని క్రేజీ యాక్షన్ సన్నివేశాల్లోనూ నటించనున్నట్లు తెలుస్తోంది. అవసరమైన జాగ్రత్తలు తీసుకుంటూ ఆమె ఈ సీక్వెన్స్ చేస్తున్నట్లు సమాచారం. ఈ చిత్రంలో ఆమెతో పాటు మరికొందరు హీరోయిన్‌లు కూడా నటించనున్నట్లు వార్తలు వస్తున్నాయి. రష్మిక, జాన్వీకపూర్, మృణాల్ ఠాకూర్ పేర్లు కూడా వినిపిస్తున్నప్పటికీ, అధికారికంగా మాత్రం ఇంకా చిత్రబృందం వెల్లడించలేదు. ఇందులో ప్రధాన పాత్రల్లో ఎవరు అతిథి పాత్రల్లో ఎవరనే విషయంపై స్పష్టత రావడానికి మరింత సమయం పట్టే అవకాశాలు ఉన్నాయి. వచ్చే ఏడాది ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకురానుంది. ఈ సినిమాలోని లుక్ కోసం అల్లు అర్జున్ రోజూ 3, 4 గంటలు సమయం వెచ్చిస్తున్నారని సినీవర్గాలు చెప్పాయి.

## పెద్ది మూవీలో శృతి స్పెషల్ డ్యాన్స్



మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ నటిస్తున్న ప్రతిష్ఠాత్మక చిత్రం 'పెద్ది'కి సంబంధించిన తాజా అప్‌డేట్ టాలీవుడ్‌లో చర్చనీయాంశంగా మారింది. ఈ సినిమాలోని స్పెషల్ సాంగ్ కోసం ప్రముఖ హీరోయిన్ శృతి హాసన్‌ని ఎంపిక చేసినట్లు సమాచారం. ఇప్పటికే పలువురు హీరోయిన్ల పేర్లు వినిపించినా చివరకు ఈ అవకాశాన్ని శృతి హాసన్ దక్కించుకున్నట్లు టాక వినిపిస్తోంది. ఈ స్పెషల్ సాంగ్ షూటింగ్ త్వరలోనే ప్రారంభమై, తక్కువ సమయంలో పూర్తయ్యేలా చిత్ర యూనిట్ ప్లాన్ చేస్తున్నట్లు తెలుస్తోంది. సినిమాకు హైలైట్‌గా నిలిచే ఈ పాటలో శృతి హాసన్ గ్లామర్, స్టెప్పులు ప్రత్యేక ఆకర్షణగా ఉండబోతున్నాయని సినీ వర్గాలు చెబుతున్నాయి. ఇక శృతి హాసన్‌కు స్పెషల్ సాంగ్స్ కొత్తేమీ కాదు. గతంలోనే రామ్ చరణ్‌తో కలిసి 'ఎవడు' సినిమాలో 'పింపుల్ డింపుల్' పాటలో సందడి చేసిన విషయం తెలిసిందే. అలాగే మహేశ్ బాబు నటించిన 'ఆగడు' సినిమాలో కూడా ఆమె ప్రత్యేక గీతంలో మెరిసి ప్రేక్షకులను అలరించింది. ఇప్పుడు 'పెద్ది'లో మరోసారి స్పెషల్ సాంగ్‌తో రాబోతుండటంతో అభిమానుల్లో ఆసక్తి పెరిగింది. ఇప్పటికే ఈ సినిమాపై భారీ అంచనాలు ఉండగా శృతి హాసన్ ఎంట్రీతో మరింత హైప్ పెరిగే అవకాశముంది. ప్రస్తుతం షూటింగ్ దశలో ఉన్న 'పెద్ది' సినిమా నుంచి త్వరలోనే ఈ స్పెషల్ సాంగ్‌పై అధికారిక ప్రకటన వచ్చే అవకాశముంది. ఈ పాట ఎలా ఉండబోతుందో శృతి హాసన్ ఏ రేంజ్‌లో ఆకట్టుకుంటుందో చూడాలని ఫ్యాన్స్ ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. 'ఉప్పెన' వంటి బ్లాక్ బస్టర్ తర్వాత బుచ్చిబాబు తెరకెక్కిస్తున్న చిత్రం పెద్ది కావడంతో ఈ ప్రాజెక్టుపై భారీ అంచనాలు నెలకొన్నాయి. ఇందులో రామ్ చరణ్ సరసన బాలీవుడ్ నటి జాన్వీ కపూర్ హీరోయిన్‌గా నటిస్తోంది. ఆమె తెలుగులో చేస్తున్న కీలక ప్రాజెక్టుల్లో ఇది ఒకటిగా నిలుస్తోంది.

## నేను తెరిస్తే అంతే సంగతులు

### గీతామాధురి యూట్యూబ్ ఇంటర్వ్యూ



తెలుగు సినీ సంగీత ప్రపంచంలో తన స్వరంతో ప్రత్యేక గుర్తింపు సంపాదించుకున్న ప్రముఖ గాయని గీతా మాధురి మరోసారి వార్తల్లో నిలిచారు. పాటలతోనే కాదు, టీవీ షోలతో, సోషల్ మీడియాలో తన యాక్టివ్‌నెస్‌తో కూడా ప్రేక్షకులను ఆకట్టుకుంటున్న ఆమె, తాజాగా చేసిన వ్యాఖ్యలు ఇపరేడు నెట్టింట హాట్ టాపిక‌గామారాయి. గీతామాధురి ఇటీవల ఓ యూట్యూబ్ ఛానల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో కొన్ని ఆసక్తికర విషయాలు వెల్లడించారు. ఈ ఇంటర్వ్యూకి సంబంధించిన ప్రోమో విడుదల కాగా, అందులో ఆమె చేసిన వ్యాఖ్యలు చర్చనీయాంశంగా మారాయి. ప్రోమోలో గీతామాధురి మాట్లాడుతూ నేను ఎప్పుడో ఒక రోజు కాఫీ షాప్‌కి వెళ్తాను. ఆ రోజే ఏదో ఒక ప్రేమ జంట అక్కడికి వస్తుంది. నేను వెళ్లినప్పుడే ఎవరో ఒకరు దొరుకుతారు. ఇలా చాలా మంది నాకు కనిపించారు' అంటూ నవ్వుతూ చెప్పారు. అయితే ఈ విషయంపై ఆమె చేసిన మరో కామెంట్ సంచలనం సృష్టించింది.నేను చూసిన వాటి గురించి నోరు తెరిస్తే కాపురాలు కూలిపోతాయి అంటూ గీతామాధురి చెప్పడం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది.గీతామాధురి చెప్పిన ఆ జంటలు ఎవరు వారు టాలీవుడ్‌కు చెందినవారా లేక ఆమె వ్యక్తిగత పరిచయాల్లో ఉన్నవారా అనే విషయంపై నెటిజన్లు చర్చలు మొదలుపెట్టారు. అయితే ఈ అంశంపై పూర్తి వివరాలు తెలుసుకోవాలంటే పూర్తి ఎపిసోడ్ విడుదలయ్యే వరకు వేచి చూడాల్సిందే.

NINADAM CINEMA

## మెక్సికోలో వారణాసి సీన్స్ ప్రదర్శన

రాజమౌళి దర్శకత్వంలో మహేశ్ బాబు హీరోగా ప్రతిష్ఠాత్మకంగా తెరకెక్కుతోన్న చిత్రం 'వారణాసి'కోసం ఇప్పుడు ప్రపంచవ్యాప్తంగా ఉన్న సినీప్రియులు ఎదురుచూస్తున్నారు. తాజాగా ఈ చిత్రానికి సంబంధించిన ఒక వార్తను ఎస్ఎస్ కార్తికేయ పంచుకున్నారు. మెక్సికోలో జరగనున్న ఓ సినీ వేడుకలో ఈ చిత్రంలోని కొన్ని సన్నివేశాలను ప్రదర్శించనున్నట్లు తెలిపారు. మెక్సికో వేదికగా ఏప్రిల్ 24 నుంచి 26 వరకు జరగనున్న కామిక్ కాన్ ఎక్స్పీరియన్స్‌లో 'వారణాసి'కి సంబంధించిన ఎక్స్‌క్లూజివ్ కంటెంట్‌ను ప్రదర్శించనున్నారు. ఈ సినిమాకు సంబంధించిన మేకింగ్ వీడియోలు, బిహైండ్ ది సీన్స్‌తో పాటు కొన్ని కీలకమైన సన్నివేశాలతో కూడిన గ్లింప్స్‌ను ప్రేక్షకులకు చూపించనున్నారు. ఈ వేడుకకు కార్తికేయ హాజరు కానుండగా.. రాజమౌళి ప్రత్యేక వీడియో సందేశంతో అక్కడి అభిమానులను ఉద్దేశించి ప్రసంగించనున్నారు. వచ్చే ఏడాది ఏప్రిల్ 7న ప్రపంచవ్యాప్తంగా ఐమ్యాక్స్ ఫార్మాట్‌లో విడుదల కానుంది. ప్రస్తుతం హైదరాబాద్‌లో భారీ షెడ్యూల్ జరుగుతోంది. అంతర్జాతీయస్థాయిలో భారతీయ సినిమా సత్తాను చాటేలా ఈ



సినిమాను రాజమౌళి అత్యున్నత సాంకేతిక విలువలతో రూపొందిస్తున్నారు. మహేశ్‌కు జోడీగా ప్రియాంక చోప్రా నటిస్తున్నారు.

## రామాయణంలో రావణ, కుబేర యుద్ధం

### భారీ స్థాయిలో చిత్రీకరిస్తున్న దర్శకుడు



బాలీవుడ్ దర్శకుడు నితీష్ తివారీ దర్శకత్వంలో రణబీర్ కపూర్ హీరోగా రూపుదిద్దుకుంటున్న అత్యంత భారీ బ్జడెట్ చిత్రం 'రామాయణం' గురించి ఒక సంచలన వార్త ప్రస్తుతం హాట్ టాపిక‌గామారింది. సాధారణంగా రామాయణం కథ అనగానే శ్రీరాముడి బాల్యం లేదా జననంతో మొదలవుతుందని మనందరికీ తెలుసు, కానీ ఈ చిత్రంలో దర్శకుడు నితీష్ తివారీ సరికొత్త ప్రయోగానికి శ్రీకారం చుడుతున్నట్లు తెలుస్తుంది. ఈ సినిమాలో రావణుడిగా నటిస్తున్న కన్నడ సూపర్ స్టార్ యష్ పవర్‌ఫుల్ ఎంట్రీతో, రావణ- కుబేర యుద్ధంతో ప్రారంభం కాబోతుందని తెలుస్తుంది. తన సోదరుడైన కుబేరుడిపై దాడి చేసి, స్వర్ణ లంకను మరియు పుష్పక విమానాన్ని రావణుడు స్వాధీనం చేసుకునే ఘట్టాన్ని అత్యంత భారీ స్థాయిలో వెండితెరపై చూపించబోతున్నట్లు సమాచారం. భారతీయ సినీ చరిత్రలోనే మునుపెన్నడూ లేని విధంగా సుమారు 4,000 కోట్ల భారీ బడ్జెట్‌తో నిర్మితమవుతున్న ఈ చిత్రం రెండు భాగాలుగా విడుదల కానుంది.

Printed, Published & Owned by B.Srinivas, Printed at Sree Seshasai Enterprises Plot no.98/1, Co-operative Industrial Estate, Gandhi Nagar, Near Balanagar Medchel, Malkajgiri Dist. Hyderabad 500037 (T.S)
Published at Plot S11, 3rd Floor, Ballard Estate Margadarshi Building Tarnaka Secundrabad, Hyderabad 500 007 (T.S), Editor : B.Srinivas, PRGI.REGN.NO. APTEL /2003/11288, CELL : +91 8333068787